అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 18-07-2024

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 10 | సంచిక : 199 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



అసమానతలను చట్టబద్ధం చేసిన అధర్మ శాస్త్రాలు

దేశ అభివృద్ధికి ఆటంకంగా కులం

- సామాజిక పీడన, ఆర్థిక దోపిడీ అంతం కావాలి
- కులవివక్షను సమర్థించే బీజేపీని నిరోధించాలి : దళిత శోషన్ ముక్తి మంచ్ జాతీయ ఉపాధ్యక్షులు బీవీ.రాఘవులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

దేశంలో అసమానతలను చట్టబద్ధం చేసిన అమానవీయ అధర్మ శాస్త్రాలను ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని, సామాజిక పీడన, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఏకకాలంలో ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించాలని దళిత్ శోషన్ ముక్తి మంచ్ (డీఎస్ఎంఎం) జాతీయ ఉపాధ్యక్షులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. హనుమ కొండ దీపా విద్యుత్ భవన్‌లో నిర్వహిస్తున్న కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతుల ముగింపులో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దేశంలో కులం పేరుతో మనుషుల్ని ముక్కలు చేసి.. వంశపారంపర్యంగా అసమాన తల్ని చట్టబద్ధం చేసిన దుర్మార్గ శాస్త్రాలను తిరస్కరించాలని రాఘవులు అన్నారు. భూమి, చదువు, ప్రకృతి వనరులను మెజారిటీ ప్రజలకు దక్కనీయకుండా చేసిన ఆ తప్పుడు శాస్త్రాల వల్లే దేశం నేటికీ వెనుకబడి ఉందన్నారు. దేశ అభివృద్ధికి ఆటంకంగా కులం నిలిచిందన్నారు. కుల వివక్ష అంటరానితనాన్ని సంపూర్ణంగా సమర్థించే రాజకీయ పార్టీ బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉందన్నారు. ఆ పార్టీ విధానాలను బలపరడం అంటే.. కులవ్యవస్థను, అసమానతల్ని అంగీకరించడం, సమర్థించడమేనని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దాడులు దౌర్జన్యాలను బీజేపీ ఏనాడూ ఖండించిన పాపాన పోలేదన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చాక రాజ్యాంగం, రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేయడానికి ఒక పథకం ప్రకారం కుట్ర చేస్తోందని విమర్శించారు.

దేశంలో కీలకమైన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడం, కార్పొరేట్ శక్తులకు అమ్మడం ద్వారా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీజేపీ పని చేస్తోందన్నారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సిద్ధిస్తుందని ప్రశ్నించారు.

బీజేపీ పదేండ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై రెట్టింపు స్థాయిలో దౌర్జన్యాలు పెరిగాయన్నారు. దేశవ్యాప్తంగా 20 శాతం ఉన్న దళితులకు బడ్జెట్లో జనాభా దామాషా ప్రకారం ఎందుకు నిధులు కేటాయించలేదో బీజేపీ సమాధానం చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని ఎందుకు నీరుగార్చారో జవాబు చెప్పాలన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేండ్లయినా దళితులు అమానుష కులవివక్ష అనుభవించడానికి పాలకుల విధానాలే కారణమని విమర్శించారు.

మనువాద విధానాలను ప్రతిఘటించాలి

బీజేపీ మనువాద విధానాలను సామాజిక, ప్రజాస్వామిక, అభ్యుదయ శక్తులు సమైక్యంగా ప్రతిఘటించాలని రాఘవులు కోరారు. దేశ ప్రజల రక్షణ కవచంగా ఉన్న రాజ్యాంగం ప్రమా దంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

హిందూ మతం ప్రమా దంలో ఉన్నదని బీజేపీ నేతలు పదే పదే వల్లిస్తున్నారు కానీ ఆ పార్టీ విధానాల వల్లే దేశ ప్రజలు ప్రమాదంలో ఉన్నారని అన్నారు. కులవివక్ష, అణచివేత, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే అన్ని శక్తులు కలిసి రాజ్యాంగ లౌకిక విలువల పరిరక్షణ కోసం విశాల ఐక్యవేదిక ఏర్పాటు చేయాలని పిలుపు నిచ్చారు.

ఈ క్లాస్‌కు కేవీ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్‌గా వ్యవ హరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి.స్కైలాబ్‌బాబు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యు లు మంద సంపత్, పల్లేర్ల లలిత, నందిపాటి మనో హర్, ఆరూరి కుమార్, డి.రాధా కృష్ణ, డి.రామ్మూర్తి, కోట గోపి, టి.సురేష్, దుర్గం దినకర్, ఎం.ప్రకాష్ కరత్, హనుమ కొండ జిల్లా నాయకులు ఓరు గంటి సాంబయ్య దూడేపాక రాజేందర్ కనకం కావ్య పాల్గొన్నారు.

'ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క' పుస్తకావిష్కరణ

రచయిత కడియాల సురేశ్‌కుమార్‌ను అభినందించిన మంత్రి సీతక్క



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

యువ సాహిత్య రత్న, ప్రముఖ సామాజిక రచయిత కడియాల సురేష్ కుమార్ రాసిన 'ఆదివాసుల ఆత్మ బంధువు సీతక్క' పుస్తకాన్ని బుధవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన జీవిత చరిత్రపై పుస్తకం రాసి తన తల్లిదండ్రులకు అంకితం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. ములుగు ప్రాంతం నుంచి స్వశక్తితో ఎదిగిన సురేష్ మంచి రచయితగా గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. శాలువాతో సత్కరించారు. సీతక్క జీవితం, ఉద్యమం, పోరాటాల గురించి అనేక వివరాలు సేకరించి రచయిత సురేష్ కుమార్ ఈ పుస్తకంలో పొందుపర్చారు. ఈ పుస్తకానికి లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయ ప్రకాష్ నారాయణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ చింతకింది కాశీం, బీసీ కమిషన్ మాజీ చైర్మెన్ బీఎస్ రాములు ముందుమాట రాశారు. పుస్తకావిష్కరణలో బీసీ సంక్షేమ సంఘం మహిళా నాయకులు మాహియా రాజ్, సుష్మ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
గురువారం 18-07-2024
సంపుటి : 10 | సంచిక : 199 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50



నేటి నుంచి రుణమాఫీ

సాయంత్రం కల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు

మూడు దశల్లో ... ఆగస్టు 15లోపు పూర్తి

- గ్రామ, మండల, అసెంబ్లీ కేంద్రాల్లో నేడు సంబురాలు
- ప్రజాభవన్ వేదికగా ప్రారంభించనున్న సీఎం
- కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో రేవంత్ ,భట్టి భేటీ

వరంగల్ రైతు డిక్లరేషన్ వాగ్దానం సాకారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లుగా రైతు మెడపై వేలాడుతున్న రుణ కత్తిని తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ చేసేందుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదముద్ర వేసిందని చెప్పారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన కాంగ్రెస్...దాన్ని సాకారం చేస్తోందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదికగా గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రైతు రుణమాఫీ' ప్రక్రియను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం రేవంత్ ప్రారంభించనున్నారు. అప్పటి నుంచే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఇదే అంశంపై చర్చించేందుకు బుధవారం ప్రజాభవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు సమావేశమయ్యారు. రుణమాఫీ మార్గదర్శకాలు, ...6లో




నీటిపారుదల ప్రాజెక్టులకు

రూట్‌మ్యాప్

మంత్రి ఉత్తమ్

2025 నాటికి నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రణాళికలు

వివరాలు 6లో



నాలుగు నెలల్లో 'నైనీ' బొగ్గు ఉత్పత్తి

అధికారులకు భట్టి దిశానిర్దేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి సంస్థకు ఒడిశా రాష్ట్రంలో కేటాయించిన నైనీ బొగ్గు బ్లాక్ నుంచి నాలుగు నెలల్లో ఉత్పత్తిని ప్రారంభించాలని ...15లో

మేడిపండు చందంగా ఆర్థిక వ్యవస్థ

పడిపోతున్న ప్రజల వినియోగ వ్యయం

- జీఎస్టీ వసూళ్లు గోప్యం
- బడ్జెట్‌లో దృష్టి సారించాలంటున్న నిపుణులు

మోడీ ప్రభుత్వం మూడోసారి కూడా అధికారంలోకి వచ్చింది. కానీ దేశ ఆర్థికవ్యవస్థ మాత్రం గాడిలో పడటం లేదు. ప్రజలు పీకల్లోతు అప్పుల్లో, కష్టాల్లో కూరుకుపోతున్నా.. సర్కారు కార్పొరేట్లకే జై కొడుతోంది. ఆర్థిక వృద్ధి అంటే సెన్సెక్స్ పరుగులు పెట్టడం కాదన్న విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోతోంది. ఫలితంగా దేశ ఆర్థికవ్యవస్థ రోజురోజుకూ దిగజారుతూనే ఉంది. ప్రజల వినియోగ వ్యయం గణనీయంగా పడిపోతోంది. వాస్తవాలకు మసిపూసి మారేడు కాయలు చేయడం కాకుండా.. ఈ సారైనా పేదలకు మేలు చేసేలా బడ్జెట్‌పై దృష్టిపెడితే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

న్యూఢిల్లీ : మధ్య ముంబయి నగరంలోని జౌళి మిల్లులు గత కొన్ని సంవత్సరాలుగా క్రమేపీ కనుమరుగవుతున్నాయి. వీటి స్థానంలో బహుళ అంతస్తుల భవనాలు దర్శనమిస్తున్నాయి. ఈ భవనాల ఎత్తు దాదాపు ఆకాశాన్ని తాకుతోంది. వీటిలో ఉండే వ్యక్తులు ఇతరుల సొమ్ముతో వ్యాపారాలు చేస్తుంటారు. ఎత్తయిన భవనాలు దూరం నుండి చూస్తే కంటికి ఎంతో అందంగా కన్పిస్తాయి. ముఖ్యంగా వర్షం కురిసేటప్పుడు ఆ దృశ్యాలను చూసి తీరాల్సిందే. ఇవన్నీ చూస్తుంటే ముంబయి మహా నగరం ఏ ఇతర అంతర్జాతీయ నగరానికీ తీసిపోదని అనిపిస్తుంది.

అయితే ఇది నాణానికి ఒక వైపు మాత్రమే. ఆ భవనాల నుండి బయటికి వచ్చి వర్షంలో గొడుగు వేసుకొని నడుస్తుంటే గుంతల రోడ్లు, ఎక్కడ చూసినా వర్షపు నీరు కన్పిస్తుంది. ఫుట్‌పాత్‌పై నడుద్దామని అనుకుంటే దానిపై చిరు వ్యాపారులు ఏదో ఒకటి అమ్ముతూ కన్పిస్తారు. గొడుగుల నుండి పూల దండల వరకు, మొబైల్ ఫోన్ కవర్ల నుండి పండ్లు, కూరగాయల వరకూ అక్కడ దొరకనిదంటూ ఉండదు. స్థానిక రైల్వే స్టేషన్‌కు పరుగులు తీసే జనం మిమ్మల్ని నెట్టుకుంటూ ముందుకు కదులుతుంటారు. ఓ వైపు విపరీతమైన వర్షం, మరోవైపు ట్రాఫిక్ రద్దీ ఇవన్నీ చూసి కూడా ముంబయి నగరం అందంగా ఉందని అనుకోగలమా?



మంది సొమ్ముతో జల్సాలు

ఇతరుల సొమ్ముతో వ్యాపారాలు చేసే వారు మాత్రం భవనాల నుండి బయట కాలు పెట్టరు. వారు ఫ్యాన్సీ కార్లలో ప్రయాణిస్తూ, డోర్ గ్లాసులు ఎక్కించేసి ఏసీ వేసుకొని ఎంజాయ్ చేస్తుంటారు. వారు ముంబయి వీధుల్లో ఎప్పుడూ కనబడరు. గబ్బు వాసనలు పీల్చరు. ఉక్కపోత అనేదే వారికి తెలీదు. అయితే వారి వ్యాపారాల కారణంగా బీఎస్ఈ సెన్సెక్స్ వచ్చే ఏడాది లక్ష పాయింట్లను, 2029కి 1.60 లక్షల పాయింట్లను, 2047 నాటికి పది లక్షల పాయింట్లను దాటేస్తుంది. స్టాక్ మార్కెట్ ఇలా నిక్షేపంగా ఉంటే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా అద్భుతంగా ఉన్నట్టా!

జీడీపీ పెరిగినా...

దూరపు కొండలు ఎప్పుడూ నునుపే. దూరం నుండి చూస్తే అంతా అందంగా, అత్యద్భుతంగా ఉన్నట్లు కన్పిస్తుంది. 'మేడి పండు చూడ మేలిమై ఉండును...పొట్ట విప్పి చూడ పురుగులుండు' అని అప్పుడెప్పుడో చిన్నప్పుడు చదువుకున్న ...15లో

ఈ చర్యలు తప్పనిసరి

ఈ నెల 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. దేశంలో వినియోగ వ్యయం ఎందుకు తగ్గుతోందో ఆర్థిక మంత్రి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రజల చేతిలో మరింత సొమ్మును ఉంచడం ప్రభుత్వ తక్షణ కర్తవ్యం. ఇందుకోసం ప్రభుత్వం పలు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. 'పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై పన్నులు తగ్గించాలి. ద్విచక్ర వాహనాలపై జీఎస్టీని 28 శాతం నుండి 18 శాతానికి తగ్గించాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాల అమ్మకాలు పెరిగితే దాని ప్రభావం రబ్బర్, ప్లాస్టిక్, స్టీల్ వంటి అనేక పరిశ్రమలపై పడుతుంది. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం స్పష్టమైన కేటాయింపులు జరపాలి. వినియోగం పెరగాలంటే పట్టణ పేద మహిళలకు నగదు బదిలీ పథకాన్ని వర్తింపజేయడంపై ప్రభుత్వం దృష్టి సారించాలి. అది జరిగితే కార్పొరేట్ శక్తులు దేశ ఆర్థిక వ్యవస్థలో మరిన్ని పెట్టుబడులు పెడతాయి. తద్వారా ఉద్యోగాల కల్పన జరుగుతుంది. వినియోగ వ్యయం పెరుగుతుంది. ఆర్థిక వృద్ధి అంటే సెన్సెక్స్ పరుగులు పెట్టడం కాదన్న విషయాన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.



రుణమాఫీ మార్గదర్శకాలు సవరించాలి

చిన్న సన్నకారు, కౌలుదార్లకు మాఫీ వర్తింపజేయాలి

- పహాణీలో పేరున్న పోడు రైతులకూ ఇవ్వాలి
- త్వరితగతిన కులగణన చేయాలి : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రుణమాఫీ మార్గదర్శక సూత్రాలను సవరించి చిన్న, సన్నకారు రైతులు, కౌలుదార్లకు వర్తించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ. రాఘవులు కోరారు. హన్మకొండ రాంనగర్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ అమలుకు పూనుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. అయితే, అందుకు సంబంధించిన మార్గదర్శక సూత్రాలు తీవ్ర లోపభూయిష్టంగా వున్నాయన్నారు. వాటి ప్రకారం కౌలుదార్లకు రుణమాఫీ వర్తించదని, పోడు వ్యవసాయం చేసే వారికి, రైతుమిత్ర గ్రూపులకు ...15లో

ఆ ఎమ్మెల్యేలు మాజీలయ్యే వరకు నిద్రపోం



- సుప్రీంకోర్టులో పోరాడుతాం
- రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు ఎందుకు?
- పాస్‌బుక్కు సరిపోతుందని జీవోలో మార్చండి : మాజీ మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-రామచంద్రాపురం

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఇతర పార్టీలకు వెళ్తున్న ఎమ్మెల్యేలు మాజీలు అయ్యేవరకు నిద్రపోమని, సుప్రీంకోర్టులో పోరాడుతామని ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ...15లో


12 మంది మావోయిస్టులు హతం

గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్

- మృతుల్లో తిపాగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం
- భద్రతా బలగాలు వెల్లడి



గడ్చిరోలి : మహారాష్ట్రలోని గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, పోలీసులకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం సమీపంలో బుధవారం 12 నుంచి 15 మంది మావోయిస్టులు ఉన్నారని సమాచారం అందడంతో డిప్యూటీ ఎస్పీ సారథ్యంలో పోలీసులు ఆపరేషన్ నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం మొదలైన భీకర కాల్పులు సాయంత్రం వరకు కొనసాగాయని పోలీసు అధికారులు తెలిపారు. దాదాపు ఆరు గంటల పాటు కాల్పులు జరగ్గా.. ఇప్పటివరకు 12మంది మృతదేహాలను గుర్తించినట్టు పేర్కొన్నారు. అలాగే, మూడు ఏకే 47 తుపాకీలతో పాటు పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. మృతుల్లో తిపాగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం అలియాస్ విశాల్ ఆత్రం ఉన్నట్టు గుర్తించామని పోలీసులు వెల్లడించారు. మిగతా మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు, ఈ కాల్పుల్లో ఒక జవాన్‌కు బుల్లెట్ గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం నాగ్‌పూర్‌కు తరలించినట్టు భద్రతా అధికారులు తెలిపారు.



కర్నాటకలో

స్థానికులకే ఉద్యోగాలు

- కోటాపై దుమారం
- సిద్ధరామయ్య సర్కార్ వెనకడుగు !

వివరాలు 15లో

నేటి నుంచి

డీఎస్సీ రాతపరీక్షలు

- ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్లో నిర్వహణ

వివరాలు 6లో

ఒమెన్ తీరంలో

ఆయిల్ ట్యాంకర్ బోల్తా

19 మంది సిబ్బంది గల్లంతు

వివరాలు 15లో

రెండు వేల ఉద్యోగాలు 25 వేల మంది హాజరు



ముంబయి ఎయిర్‌పోర్టులో తొక్కిసలాట

ముంబయి : దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో మరోసారి వెల్లడైంది. ముంబయిలోని కలినా ప్రాంతంలో ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిన వాక్-ఇన్-ఇంటర్వ్యూలకు భారీగా అభ్యర్థులు తరలిరావడంతో అక్కడ తొక్కిసలాట చోటుచేసుకుంది. వారిని నియంత్రించలేక అధికారులు, పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 2,216 హ్యాండీమాన్ ఖాళీలను భర్తీ చేసేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో మంగళవారం ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. కౌంటర్ల వద్ద తమ పత్రాలు సమర్పించేందుకు భారీగా వచ్చిన అభ్యర్థులు ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. ఆహారం, నీరు అందక పలువురు ఇబ్బంది పడ్డారు. కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆ ఉద్యోగంలో చేరినవారు విమానం నుంచి లగేజీ దించడం, ఎక్కించడంతోపాటు బ్యాగేజీ బెల్టులను చూసుకోవాలి. ఒక్కో ఎయిర్‌క్రాఫ్ట్‌లో లగేజీ, కార్గోను చూసుకునేందుకు ఐదుగురు ...15లో

మోడీజీ.. ఇప్పటికైనా అసత్యాలు ఆపండి

ప్రియాంకగాంధీ



నిరుద్యోగ సమస్యపై ప్రధానమంత్రి మోడీ అసత్యాలు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించామని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్న మన్నారు. ముంబయి ఎయిర్‌పోర్టులో నిరుద్యోగుల వెల్లువ ఘటనను ప్రస్తావిస్తూ.. 'ఎక్స్' వేదికగా మోడీ సర్కార్‌పై ప్రియాంక విమర్శలు గుప్పించారు.

"ఇప్పటివరకు ఎన్‌డీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాలు కల్పించి రికార్డు సృష్టించిందని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ చెప్పారు. అవన్నీ అసత్య ప్రచారాలే. తాజాగా ముంబయి ఎయిర్‌పోర్టులో ఉపాధి కోసం నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. ఈ పరిస్థితి దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది." అని విమర్శించారు. "బూటకపు వాగ్దానాల ద్వారా ప్రజల దృష్టిని మళ్లించకండి. దయచేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించండి" అని కేంద్రాన్ని ఆమె కోరారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

విద్యాసాగర్

రామగుండం ఓసీపీ-2లో ప్రమాదం

విరిగిపడిన మట్టిపెళ్లలు.. ఇద్దరు కార్మికులు మృతి

మరో ఇద్దరికి గాయాలు


నవతెలంగాణ- కోల్‌సిటీ

పెద్దపల్లి జిల్లా రామగుండం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2లో బుధవారం సాయంత్రం ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

క్వారీలోని సౌత్ కోల్ ఏరియాలో సైడ్ వాల్ లోపల పైప్ లీకేజీని అరికట్టే పనులు చేపడుతుండగా కార్మికులపై ఒక్కసారిగా మట్టి కూలింది. దాంతో ఫిట్టర్ ఉప్పు వెంకటేశ్వర్లు, జనరల్ మజ్దూర్ విద్యాసాగర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమ్మయ్య, వీఎస్ఎన్ రాజు గాయపడ్డారు. మృతదేహాలను గోదావరిఖని సింగరేణి ఏరియా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఓసీపీ-2లో కక్షసాధింపు చర్యల్లో భాగంగా జరిగిన షిఫ్ట్ చేంజ్‌లో ఉప్పు వెంకటేశ్వర్లును సెక్షన్ మార్చడంతో ఆయన ఇటీవల పంప్ సెక్షన్‌కు వెళ్లినట్టు తెలిపారు.

సంపాదకీయం

కరెంట్ కత సశేషమే



సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి విద్యుత్ కమిషన్ బాధ్యతల నుంచి వైదొలిగారు. భారత ప్రధాన న్యాయమూర్తి అన్నట్టు "న్యాయం జరిగినట్టు కనపడటానికి" ఇది కూడా తప్పనిసరై యుండవచ్చు. రేవంత్ సర్కార్ 'తిక్క కుదిరింద'ని గులాబీ శ్రేణులు సంబరపడటం ఆశ్చర్యమే. అది కరెంటైనా, కాళేశ్వరమైనా కేసీఆర్ కడిగిన ముత్యంలా బయటపడతాడన్న నమ్మకం వారికున్నట్టుంది.

సుప్రీంకోర్టు విద్యుత్ కమిషన్ విచారణ విషయాల్లో జోక్యం చేసుకోలేదు. కమిషన్ ఆఫ్ ఇంక్వైరీ వద్దని, అది రాజకీయ కక్షపూరితమైందని కేసీఆర్ వాదన. ప్రస్తుతానికి దానికి సంబంధించి ఆయనకు ఊరటేమీ లభించలేదు. జస్టిస్ నర్సింహారెడ్డి విచారణ అంశాల మంచి చెడ్డల గురించి ముందే మీడియాతో ప్రస్తావించటాన్ని సుప్రీం తప్పుపట్టింది. దానితో ఆయన పదవి నుండి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు నివేదించారు. ఆయన స్థానంలో మరో జడ్జీని నియమించుకోండని రేవంత్ సర్కార్‌కు సుప్రీంకోర్టు సూచించింది. ప్రస్తుతం ఆ పనిలో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. కేసీఆర్ వాదనేమంటే ఈఆర్‌సీ ఫైనలైజ్ చేసిన విషయాలపై అవసరమైతే అప్పీలేట్స్‌లో సవాలు చేయాలి గాని, దానిపై విచారణ కమిషన్లు వేయడమేమిటనేది కీలక వాదన. ఈ అంశం జోలికి సుప్రీంకోర్టు వెళ్లలేదు.

ఏనుగుల్ని వదిలేసి దోమల్ని పట్టుకున్నట్టుంది మన పాలకుల పని. 2003 విద్యుత్ చట్టం ప్రకారమే తమ సర్కారు నడిచిందన్నది కేసీఆర్ వాదన. ఆ చట్టం గురించిగాని, దాని సవరణ బిల్లు (2021) గురించి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సైలెంట్‌గా ఉన్నాయి. విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రయివేటీకరణ వేగం పెరిగింది. ఇప్పటికే హైదరాబాద్ పాతబస్తీ బిల్లుల కలెక్షన్ అదానీకిస్తున్నట్లు వార్తలొచ్చాయి. యూనియన్లు ధర్నాలు చేస్తున్నాయి. పాలకుల నుంచిగాని అధికార యంత్రాంగం నుంచిగాని ఎటువంటి స్పందనా లేదు. కార్మికులను కొందరు అదానీ తమతోనే పని చేయించుకుంటాడని, లేకుంటే తమని వేరే సర్కిల్స్‌కి బదిలీ చేస్తారన్న భ్రమల్లో ఉన్నారు.

ఈలోపు రెండు డిస్కాంలలో స్తంభాల నుండి సబ్ స్టేషన్ల లైన్ల పొడవు (సర్క్యూట్ కి.మీ.), డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు వంటివన్నీ సంఖ్యలతో సహా లెక్కలు సేకరించి రీ సర్వే చేస్తున్నారు. 90శాతం పూర్తయింది. దీనిపై ప్రభుత్వం నోరిప్పట్లేదు.

ప్రజలు, ఉద్యోగులు దీని భావమేమి తిరుమలేశా? అని కనుబొమ్మలు చిట్లించి చూస్తున్నారు. తెలంగాణలో విద్యుత్‌రంగ అభివృద్ధి జరిగింది తన పాలనలోనే అంటూ కేసీఆర్ రొమ్ము విరుచుకోవడాన్ని పూర్తిగా కొట్టేయలేం. కాని తాను చేసినదంతా కరెక్టని బింకాలు పోవడం సత్యదూరమైన విషయం.

నీటి సౌకర్యమున్న చోటే థర్మల్ స్టేషన్లు కడతారనేది నిజమే ఐనా, అన్నీ గోదావరి మీదే ఉన్నాయి కాబట్టి 'వెనకబడ్డ' నల్లగొండ జిల్లా దామరచర్లలో కృష్ణా నదిపై యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించామని చెప్పడం, దానికి సమీపంలో బందరు పోర్టుంది.. క్రిష్ణపట్నం పోర్టుంది అనడం విచిత్రం. బందర్లో ఇంకా పోర్టే నిర్మితం కాలేదు. మూడు జిల్లాలు దాటిపోతే క్రిష్ణపట్నం పోర్టు అందుతుంది. జనం నవ్వుకుంటారనే స్పృహ లేకుండా ఇటువంటి వ్యాఖ్యలు జస్టిస్ నర్సింహారెడ్డికి రాసిన 12 పేజీల సుదీర్ఘ లేఖలో మాజీ సీఎం రాయడం ఆశ్చర్యమేమరి.

ఒకపక్క సింగరేణిని ముక్కలు ముక్కలుగా తన్నుకుపోయేందుకు ప్రయివేటు గద్దలు కాచుక్కూచున్నాయి. విద్యుత్ పంపిణీ ప్రయివేటీకరించేందుకు ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్, గత బీఆర్ఎస్ వంటి ప్రభుత్వాలు చేస్తున్న 'కృషి' కోసం నోటకరుచుకుపోవటానికి చెట్టుకింద నిరీక్షించే నక్కబావల్లా 'కార్పొరేట్లు' సిద్ధంగా ఉన్నాయి.

> నీటి సౌకర్యమున్న చోటే థర్మల్ స్టేషన్లు కడతారనేది నిజమే ఐనా, అన్నీ గోదావరి మీదే ఉన్నాయి కాబట్టి 'వెనకబడ్డ' నల్లగొండ జిల్లా దామరచర్లలో కృష్ణా నదిపై యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించామని చెప్పడం, దానికి సమీపంలో బందరు పోర్టుంది.. క్రిష్ణపట్నం పోర్టుంది అనడం విచిత్రం. బందర్లో ఇంకా పోర్టే నిర్మితం కాలేదు. మూడు జిల్లాలు దాటిపోతే క్రిష్ణపట్నం పోర్టు అందుతుంది. జనం నవ్వుకుంటారనే స్పృహ లేకుండా ఇటువంటి వ్యాఖ్యలు జస్టిస్ నర్సింహారెడ్డికి రాసిన 12 పేజీల సుదీర్ఘ లేఖలో మాజీ సీఎం రాయడం ఆశ్చర్యమేమరి.

కాంట్రాక్టీకరణ, కాషాయీకరణల 'అగ్నిపథ్'

- రాంభూపాల్



సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం 'అగ్నిపథ్' పేరుతో మోడీ ప్రభుత్వం సైనిక నియామకాల్లో కాంట్రాక్టీకరణ విధానాన్ని ప్రవేశపెట్టింది. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వానికి భుజం కాస్తూ, మూడోసారి మోడీ ప్రధాని కావడానికి కారణమైన నితీష్ కుమార్ ఈ అగ్నిపథ్ పథకాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని ఇప్పుడు డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకం గురించి పున:సమీక్షిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం కూడా ఇటీవల లీకేజీ వార్తలు ఇస్తున్నది. పార్లమెంట్‌లో చర్చ లేకుండా, నిపుణులతో సంప్రదించకుండా, ఏకపక్షంగా, ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు, లాక్‌డౌన్ లాగే ఈ అగ్నిపథ్ పథకం కూడా బెడిసికొట్టిందా?ఆఫీసర్ ర్యాంకుకు కింది స్థాయిలో వున్న సైనిక నియామకాల కోసం కేంద్రం 2022 జూన్ 14న 'అగ్ని పథ్' పథకాన్ని ప్రవేశ పెట్టి, సెప్టెంబర్ నుండి నియామకాలు చేపట్టింది. ఈ పథకం ద్వారా నియమించబడే సైనికులను కొత్త సైనిక ర్యాంకు కింద 'అగ్ని వీర్'లని పిలుస్తున్నారు. మెడికల్ బ్రాంచీల్లోని టెక్నికల్ కేడర్ మినహా అన్ని రంగాల్లో సైనికులు ఈ పథకం కింద సేవలకు యువత నియమితులవుతున్నారు. గతంలో సైనిక ఉద్యోగమంటే దేశభక్తితో కూడుకున్నదని, డ్యూటీలో మరణిస్తే అది వీరమరణం అవుతుందని, రిటైర్‌మెంట్ తర్వాతి జీవితానికి భరోసా వుంటుందనే నమ్మకంతో సంవత్సరానికి 75 వేల మంది యువత సైన్యంలో చేరేవారు. అలాంటి ఆలోచనలకు పూర్తిగా భిన్నమైంది ఈ 'అగ్ని పథ్' పథకం. అమెరికాలో అమలవుతున్న వాలంటరీ టూర్ ఆఫ్ డ్యూటీ (నిర్దిష్ట ప్రాంతంలో నిర్దిష్ట సైనిక సేవలు) అనే విధానం నుండి ఈ 'అగ్ని పథ్' పథకాన్ని రూపొందించారు. అమెరికాతో పాటు ఇజ్రాయిల్, నార్వే, ఉత్తర కొరియా, సింగపూర్, స్వీడన్ దేశాల్లో ఇలాంటి విధానం అమలవుతున్నది. ఈ ప్రయోగం ఆచరణలో విఫలమైందని ఈ దేశాలన్నీ గుర్తించి సవరించుకుంటున్న స్థితిలో మన దేశంలో ఈ పథకం అమలులోకి వచ్చింది. 'అగ్ని పథ్' పథకంలో ప్రయివేటీకరణ విధానాలు, కాషాయదళ ప్రయోజనాలు కలగలిసి వున్నందున ఈ రెండింటి నుండి మద్దతు వుంది.

సైన్యంలో ప్రయివేటీకరణ

సాయుధ దళాలను యవ్వనంగా ఉంచడం కోసం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టినట్లు కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రకటించుకుంది. ప్రస్తుత సాయుధ దళాల సగటు వయసు 32 ఏళ్ళు వుందని, దాన్ని 26 ఏళ్ళకు తీసుకు రావాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు కేంద్రం చెప్పింది. అందుకోసమే 'అగ్ని పథ్' ద్వారా 17.5 సంవత్సరాల నుండి 21 (తర్వాత దీన్ని 23 సంవత్సరాలకు పెంచారు) సంవత్సరాలలోపు వయసు వున్న యువతను సైన్యంలో నియమిస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా నియమించబడిన 'అగ్ని వీర్'లు సివిల్ వర్క్ ఫోర్స్‌గా వుంటూ దేశానికి అవసరమైన సైనిక సేవలు చేస్తారట! ఈ మాటలన్నీ వినసొంపుగా వున్నా, ఈ పథకం అసలు ఉద్దేశ్యం సైన్యంలో కాంట్రాక్టీరణ విధానాన్ని అమలు చేయడం. శాశ్వత ఉద్యోగాలకు మంగళం పాడి, ఉద్యోగ విరమణ తర్వాత ఏ రక్షణ లేకుండా వీధుల్లోకి గెంటివేసే కాంట్రాక్టీరణ విధానం1991 తర్వాత అన్ని రంగాల్లో వేగంగా అమలవుతున్నది. ప్రయివేటీకరణ బకాసురుడి ఆకలికి ఇప్పుడు సైనిక రంగం ఆహారం అవబోతున్నది. ఈ పథకం కింద నియ మించే 'అగ్నివీర్'లకు ఆరు నెలలు శిక్షణ ఇచ్చి, నాలుగేండ్లు ఉద్యోగం ఇస్తారు. ఇలా ప్రతి ఏడాది ఎంపికయ్యే 42వేల మంది అగ్నివీర్‌లలో 25 శాతం మందికి మాత్రమే 15 సంవత్సరాల కొలువుకు అవకాశం వుంటుంది. వీరికి మాత్రమే పింఛన్, ఉద్యోగ విరమణ ప్రయోజనాలు వుంటాయి. ఈ పథకం కింద నియమితు లైన సైనికులకు మొదటి సంవత్సరం రూ.30 వేలు, రెండవ సంవత్సరం రూ.33 వేలు, మూడో సంవత్సరం రూ.36,500, నాలుగో సంవత్సరం రూ.40 వేల వేతనం ఇస్తారు. ఈ వేతనంలో నుండి 30 శాతాన్ని కార్పస్‌ఫండ్‌కు జమచేస్తారు. కేంద్ర ప్రభుత్వం మరో 30 శాతాన్ని ఇందుకు జమ చేస్తుంది. నాలుగో సంవత్సరం పూర్తయ్యే నాటికి ఈ మొత్తం రూ. 10.04 లక్షలు అవుతుంది. 75 శాతం మంది అగ్నివీర్‌లకు ఈ మొత్తాన్ని రిటైర్‌మెంట్ ప్యాకేజీగా ఇచ్చి ఇంటికి పంపుతారు. ఇలా బయటకు వచ్చిన ఈ అగ్నివీర్‌లు మహా నగరాల్లో, నగరాల్లో వుండే కార్పొరేట్ ఆఫీసుల దగ్గర, కోటీశ్వరుల బంగ్లాల దగ్గర సెక్యూరిటీ గార్డులుగా పనిచేసే అవకాశం కోసం ఎదురు చూస్తూ బతకాలి. ఇప్పటికే 'దయార్ద్ర హృదయులు' అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ కంపెనీల యజమానులు, కంగనా రనౌత్ లాంటి సెలబ్రిటీలు అగ్నివీర్‌లకు అవకాశం ఇస్తామని 'గొప్ప మనసు'తో ముందుకు వచ్చారట! ఇన్నాళ్ళుగా మనం గుండెల నిండా గాలి పీల్చుకుని అరచిన 'జై జవాన్' నినాదం పాతబడి రానున్న రోజుల్లో కనుమరుగు కానుందన్న మాట!ఇప్పటికే రిటైర్ అయిన లక్షలాది మాజీ సైనికోద్యోగులు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాజస్థాన్‌లో 53,373 మంది మాజీ సైనికులు ఉద్యోగాల కోసం అర్జీలు పెట్టుకోగా కేవలం 1415 మందికి మాత్రమే (2.6 శాతం) ఉపాధి దొరికింది. ఉత్తరప్రదేశ్‌లో 86,192 మందికి గాను 1616 మందికి (1.8 శాతం), పంజాబ్‌లో 60,772 మందికి గాను 1150 మందికి (1.8 శాతం), బీహార్‌లో 43,845 మందికి గాను కేవలం 6 మందికి (0.01 శాతం) మాత్రమే ఉపాధి అవకాశాలు దొరికాయి. ప్రస్తుతం ప్రతి సంవత్సరం సుమారు 75,000 మంది సైనికులు ఉద్యోగ విరమణ చేస్తున్నారు. వీరికి తోడు ప్రతి నాలుగు సంవత్సరాలకు 30 వేల మంది (అగ్ని పథ్ కింద నియమితులైన వారిలో 75 శాతం మంది) అగ్నివీర్‌లు తాత్కాలిక ఉద్యోగం నుండి బయటకు వస్తారు. వీరందరికి ఉపాధి ఎవరు ఎక్కడ కల్పిస్తారు? 2022లో ఏర్పాటు చేయబడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ 'ఆన్ డిఫెన్స్ రిపోర్టు' ప్రకారం 2025 నాటికి రక్షణ శాఖ పెన్షనర్ల సంఖ్య సుమారు 26 లక్షలు కాగా, వారి పెన్షన్ బిల్లు రూ.2.5 లక్షల కోట్లు అవుతుందని అంచనా. ఈ సంవత్సర రక్షణ బడ్జెట్ రూ.6,21,541 కోట్లు. ఇందులో రెండున్నర లక్షల కోట్లు అంటే సుమారు 40 శాతం పెన్షన్లకే ఖర్చు అవుతుందనే పేరుతో సైనికులకు పెన్షన్ అమలు చేయకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. దేశం కోసం ప్రాణ త్యాగాలకు సిద్ధపడిన సైనికులు రిటైర్‌మెంట్ తర్వాత గౌరవంగా జీవించే హక్కును కాలరాయడానికే ఈ విధానాన్ని బీజేపీ తీసుకు వచ్చింది. సైన్యంలో కూడా తాత్కాలిక ఉద్యోగాలు, పెన్షన్ లేని రిటైర్‌మెంట్ విధానాలు అమలు కావడం కార్పొరేట్ కంపెనీలకు అదనపు బలం, అందుకే ఈ పథకానికి ఆ కంపెనీలు పెద్ద ఎత్తున మద్దతు తెలిపాయి.

> రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం ద్వారా హిందూ రాజ్య నిర్మాణం చేయాలనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. 1925లో స్వయం సేవక్ పేరుతో ఏర్పడిన ఈ సంస్థ ప్రతి రోజు తన సభ్యులకు శాఖ ద్వారా వ్యాయామంతో మొదలుపెట్టి, కర్ర సాము, ఆయుధాల శిక్షణ వరకు సైనిక తరహాలో శిక్షణ ఇస్తుంది. ఈ శిక్షణ లక్ష్యం మత విద్వేషం ప్రాతిపదికగా సాయుధ సైనిక బృందాలను తయారు చేయడం. 1938లోనే ఇందుకోసం భోంస్లా అనే ప్రాంతంలో మిలిటరీ స్కూల్ ప్రారంభించారు. అది ఇప్పటికీ నడుస్తోంది. ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయా లకు, మత ఘర్షణలకు వినియోగిస్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్ఎస్ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్ఎస్ఎస్ బలపరుస్తుంది.

కాషాయీకరణ

రాజకీయాల్లోకి మతాన్ని చొప్పించడం ద్వారా హిందూ రాజ్య నిర్మాణం చేయాలనేది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం. 1925లో స్వయం సేవక్ పేరుతో ఏర్పడిన ఈ సంస్థ ప్రతి రోజు తన సభ్యులకు శాఖ ద్వారా వ్యాయామంతో మొదలుపెట్టి, కర్ర సాము, ఆయుధాల శిక్షణ వరకు సైనిక తరహాలో శిక్షణ ఇస్తుంది. ఈ శిక్షణ లక్ష్యం మత విద్వేషం ప్రాతిపదికగా సాయుధ సైనిక బృందాలను తయారు చేయడం. 1938లోనే ఇందుకోసం భోంస్లా అనే ప్రాంతంలో మిలిటరీ స్కూల్ ప్రారంభించారు. అది ఇప్పటికీ నడుస్తోంది. ఇలా శిక్షణ పొందిన వారిని తమ అవసరాలకు అనుగుణంగా మత రాజకీయాలకు, మత ఘర్షణలకు వినియోగి స్తారు. జర్మనీ నియంత హిట్లర్ నుండి ఈ తరహా శిక్షణా పద్ధతులను ఆర్ఎస్ఎస్ వారసత్వంగా పొందింది. వీరు కోరుకునే పౌర సైనిక శిక్షణకు సరిగ్గా అగ్నిపథ్ పథకం తోడ్పడుతుంది. సైన్యంలో పనిచేసి వచ్చిన అగ్నివీర్‌లను తమ మతతత్వ రాజకీయాలకు వాడుకోవడం సులభం. కాబట్టే ఈ పథకాన్ని ఆర్ఎస్ఎస్ బలపరుస్తుంది.

సైన్యంలో కీలకమైన మార్పు చేసే అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టే ముందు దీని పర్యవసానాల గురించి నిపుణులతో కనీసం చర్చించకపోవడం సరికాదని పరమ వీరచక్ర కెప్టెన్ బాణా సింగ్ అభ్యంతరం తెలిపారు. ఈ పథకం అమలు వల్ల అనేక కష్టాలు వస్తాయని నావిక స్టాఫ్ మాజీ చీఫ్ అడ్మిరల్ అరుణ్ ప్రకాష్, ఆర్మీ స్టాఫ్ మాజీ వైస్ చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ రాజ్ కద్యన్ లాంటి అనేక మంది మాజీ సైనిక ఉన్నతోద్యోగులు అభిప్రాయపడ్డారు. అయినా వీటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా మోడీ ప్రభుత్వం 'అగ్ని పథ్' పథకాన్ని అమలులోకి తెచ్చింది. మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ తీవ్ర ఎదురుదెబ్బ తగలడానికి నిరుద్యోగం కీలక కారణమైంది. సైన్యంలో ఎక్కువ భాగం నియమితులయ్యే యు.పి, హర్యానా, పంజాబ్, బీహార్ లాంటి రాష్ట్రాల్లో బీజేపీ ఘోరంగా దెబ్బతింది. అందుకే నితీష్ కుమార్ అగ్నిపథ్ పథకం గురించి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం, కరోనా లాక్‌డౌన్ ఫలితంగా చిన్న పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతబడడం, జీఎస్‌టి పన్నుల విధానం, స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల పోటీకి మధ్యతరహా పరిశ్రమలు గిలగిలలాడు తుండడం, ప్రపంచ వ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ పరిశ్రమ తిరోగమన బాట పట్టడంతో దేశంలో నిరుద్యోగం భారీగా పెరిగింది. నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ తాజా నివేదిక 2015-2023 మధ్య 13 రాష్ట్రాలు, 3 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని తయారీ రంగంలోని అసంఘటిత రంగ యూనిట్లలో పనిచేస్తున్న 54 లక్షల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారనే కఠోర వాస్తవాన్ని బయటపెట్టింది. ఉన్నత చదువులు కొనలేని పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రతి సంవత్సరం 75 వేల మంది సైన్యంలో చేరి బతుకుతున్నారు. ఈ 'అగ్ని పథ్' వల్ల కేవలం 40 వేల మందికి మాత్రమే తాత్కాలిక ఉద్యోగాలు వస్తాయి. సుమారు 35 వేల మంది సైనిక ఉపాధి కోల్పోతారు. ప్రస్తుతం వున్న నిరుద్యోగ సైన్యానికి వీరు అదనంగా తోడవుతారు. సర్వరోగ నివారిణిగా ప్రచారం చేసిన ప్రయివేటీకరణ ఇప్పటికే అనేక రంగాల్లో సర్వరోగాల నిలయంగా మారింది. ఇప్పుడు సైన్యంలోకి కూడా ఈ రోగం విస్తరించింది. పౌర జీవితంలో రగిలే్చ మత విద్వేషాలను మరింత పెంచి పోషించేందుకు సైనిక రంగానికి కషాయ రాజ కీయాలు విస్తరిస్తున్నాయి. సైన్యంలోకి ప్రవేశ పెట్టిన కాంట్రాక్టీకరణ, కాషాయీకరణ విధానాలను అడ్డుకోవడం దేశ పౌరులందరి కర్తవ్యం.

కారంచేడు అలీసమ్మ హత్య కేసు ఏమైంది?

కారంచేడు రుధిర క్షేత్రం భారతదేశ కుల వాస్తవిక కర్కశత్వానికి సాక్ష్యం. కారంచేడులో ఆధిపత్య కులంచే చంపబడిన అమరుల స్ఫూర్తి దినం 17జులై1985. కారంచేడులో కుల దురహంకారం మాదిగలను ఊచకోత కోసిన దుర్దినం.. ఇది జరిగి ముప్పయి ఎనిమిదేండ్లు గడిచాయి. కారంచేడు దురంతాలు భారతదేశంలో మొదటిది కాదు, చివరిదీ కాదు. ఆధిపత్య కులహత్యలు అనేకం జరిగాయి, జరుగుతున్నాయి. కాని కొన్నింటికి మాత్రమే జాతి జాతంతా కదులుతుంది. అలా కదిలించిన ఉద్యమమే కారంచేడు విజయం.

కారంచేడు చరిత్రను, కుల దాష్టీకాలను, ఆ ఉద్యమ చైతన్యాన్ని, స్ఫూర్తిని ఇతర బాధిత సమాజాలకు, ఉద్యమ సమాజాలకు ఇవ్వడానికి కారంచేడు రుధిర క్షేత్రాన్ని స్మృతి దినంగా జరుపుకోవాలి. బాధిత సమాజాలు ఐక్యంగా నిలబడిన ఉద్యమం. బాధిత సమూహాలకు బాసటగా అనేక ఉద్యమాలు, ఉద్యమ శక్తులు, వ్యక్తులు అండగా వున్న పోరాటమది. లక్షల మంది బాధిత శిబిరాలకు దన్నుగా వున్న ఉద్యమం కారంచేడు. అందుకే ప్రభుత్వాలు దిగొచ్చాయి. ఉద్యమం విజయవంతమైంది. అందుకే కారంచేడు రుధిర క్షేత్రాన్ని ప్రత్యేకంగా చరిత్రలో చెప్పాలి. కారంచేడు సాధించిన ప్రధానమైనవి దళితుల ప్రతిఘటనా పోరాటస్థైర్యం. దళిత ఆత్మగౌరవ పోరాటాన్ని ఇంకా అంటరాని సమాజాల మీద ఎలాంటి వివక్షలు జరగ కూడదనీ, జరిగితే ఎంత శిక్షార్హమో తెచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టమే అందుకు నిదర్శనం. ఈ చట్టం రాకముందు దళితుల మీద ఏం జరిగినా, ఎలాంటి దాడులు, హత్యలు జరిగినా కూడా సాధారణ క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లే వుండేవి. నేరస్తులు సులువుగా ధనబలం, కుల బలంతో తప్పించుకునేవాళ్లు. కానీ కారంచేడు ఉద్యమం భారతదేశ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తెచ్చి వారికి బాసటగా నిలిచింది. ఇది సక్రమంగా అమలవుతుందా? ఇప్పటిదాకా ఎంత మంది శిక్షలు అనుభవించారంటే.. చెప్పలేము. కానీ అది అమలు పరిస్తే శిక్షలు ఖాయం అనే భయాలు కూడా ఉంటాయి.



ముఖ్యంగా కారంచేడు మారణకాండలో బాధిత మహిళలు సువార్తక్క, సలోచన, అలీసమ్మ ఇండ్లకు, కారంచేడు ఊచకోతకు ముందు మాదిగ గూడెం తాగే మంచి నీళ్ల చెరువును ఒక ఆధిపత్య కుల ఆసామి బర్లను కడిగి మురికి తీస్తుంటే కత్తి చంద్రయ్య అనే మాదిగ అవిటి అబ్బాయి 'మనషులు తాగే నీళ్ల అట్లా కంగాలి జేస్తవేంది సామి' అన్నందుకు 'నువ్వెవడవని' కొడుతుంటే..ఆ సమయంలో నీళ్ల కోసం బిందెతో వచ్చిన సువార్త అడ్డుకోబోయిందట. ఆమెను కూడా ఆ ఆసామి కొట్టబోతె బిందె ఎత్తిందట. ఆ తర్వాత కారంచేడు మారణకాండ చోటుచేసుకుంది.

పొలాల్లో పని చేసుకుంటున్న దళితుల మీద గొడ్డండ్లు, బరిసెలు గడ్డపారలతో భూస్వాములు ట్రాక్టర్లమీద వచ్చి దొరికినోల్లను దొరికినట్లు చంపింద్రు. చాలా మంది చెల్లా చెదురై పారిపోయింద్రు. కొంతమంది చావుదెబ్బలు తిని చచ్చినట్లు పడున్నారు. కొంత మందిని తీవ్రంగా గాయ పరిచింద్రు. వయసులో ఉన్న మహిళల్ని పొలంల దొరకబుచ్చుకొని కొట్టిన దెబ్బలు, గాయాలు వారి ఒంటి మీద ఇంకా మాయని మచ్చలుగా మిగిలిపోయాయి. ఈ మారణకాండలో మొత్తం చనిపోయింది దుడ్డు రమేష్, దుడ్డు వందనం, దుడ్డు అబ్రహం, తేళ్ళ ముత్తయ్య, తేళ్ళ యెహోవా, అలీసమ్మ. ఆ దాడిలో నలభై మంది తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు పోగొట్టుకున్నారు.

దుడ్డు రమేష్ ఇరవైయేండ్లు కూడా నిండని యువకుడు. అతని భార్య సులోచన. సులోచనతో పాటున్న టీనేజ్ ఆడపిల్లలు తేళ్లమరియ, తేళ్ల విక్టోరియ, శాంతమ్మ, తాళ్లలక్ష్మి. వీళ్లందర్ని కొట్టి కాల్చేద్దామన్న పథకం విఫలమైందని సజీవ చరిత్రగా మన్న సలోచన తనని కలిసిన వారితో చెప్తుంటది. సులోచన తన భర్త హత్యను చూసి ఆ భయాన్ని, బాధ నుంచి చేరుకొని మళ్లీ మామూలు మనిషి కావడానికి, కొత్త జీవితంలోకి అడుగుపెట్టడానికి ఉద్యమ సంఘాల సహకారం చేయూత అండనే కారణమని చెబుతున్నది. అయినా ఇప్పటికీ ఆనాటి మారణకాండల బీభత్సాలు, భయాల వణుకు అప్పుడప్పుడు వెన్నాడుతూనే ఉంటాయంటది సులోచన.

దుడ్డు అలీసమ్మ మరణం ఓ విషాదం. తన కన్నకొడుకు దుడ్డు వందనం. భూస్వాములు మాదిగల్ని వేటాడుతూ చంపుతున్నారని తెలిసి వెంటనే చీరాల పోలీస్టేషన్‌కి కంప్లయింట్ ఇద్దామని బయల్దేరిండు బయటకు. అంతే గొడ్డళ్లతో నరుకుతూ, బరిసెలతో పొడుస్తుంటే...ఆ అరుపులు కేకలు వీని బయట తనకొడుకుని చంపుతుంటే కళ్లార చూసిన దు:ఖం అలీసమ్మది. ఆక్రూర ఘటనను చూసిన అలీసమ్మ బహిరంగ సభల్లో, క్యాంపుల్లో చెపుతుంటే దళిత మహిళలు, పురుషులు శోకాలు బెట్టి ఏడ్చేవారంట. అయితే ఈ కేసులో ఐ విట్నెస్‌ను బహిరంగ పర్చకూడదని చట్టం చెబుతున్నది. కానీ అలీసమ్మకు బహిరంగ సభల్లో స్టేజీల మీద చెప్పించడం ఎలా జరిగింది? ఐ విట్నెస్‌ను చాలా రహస్యంగా వుంచుతారు, వారి సంరక్షణలో కాపు కాస్తారు. కానీ పోలీసులు, కోర్టులు పట్టించుకోవు, చెప్పరు కూడా ఈ రహస్యంగా, రక్షణ విషయాలు. కానీ ఉద్యమ సంఘాలకు, పౌరహక్కుల సంఘాలకు కూడా తెలవక పోవడమేంటి? వాల్లయినా అలర్ట్ చేయాల్సి ఉండాల్సింది. కానీ, అలా జరగలేదు. ఈ ఉదాసీనత ఏమరపాటు వల్ల అలీసమ్మను శత్రువు ఒక దొంగరాత్రి నిశ్శబ్దంగా చంపేసిపోయింది.

విజయనగర్ కాలనీ ఏర్పాటు చేస్తున్నప్పుడు బాధితుల కోసం ఇంకా పూర్తికాని తలుపులు కిటికీల్లేని ఇంటి ముందట ఆరుబయట నిద్రబోతున్న అలీసమ్మను మోకమ్మీద మెత్తేసి ఒత్తి చంపేసి పోయింద్రు. తెల్లవారి ఆమె శవమై మంచాల్లో పడివుంది. ఆమె మంచం పక్కన బూటు కాళ్ల అచ్చులున్నాయని గుర్తించారు. పోస్టుమార్టమ్ రిపోర్టులో ముఖమంతా కమిలి వుంది. ఊపిరాడకుండా ఉన్న పరిస్థితిలో చనిపోయిందని, అది సీబీ సిఐడికి ఇచ్చారు. ఇంకేముంది? అది ఇంకా పూర్తి కాలేదు రిపోర్ట్ అంటారు. బాధితులు తిరిగి తిరిగి వేసారి మానుకున్నారు. అతీ లేదు గతి లేదిప్పటికి. దళితుల పట్ల వ్యవస్థలు ఎంత దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా ఉన్నాయననేది అలీసమ్మ హత్య కేసే సాక్ష్యం. దోషులెవరు? అనేది ఇంకా తేలలేదు. ఏం జరిగినా బయటకు రాలే. ఒక మాదిగ మహిళను హత్య చేస్తే రుజువులున్నా, శిక్షలు, చట్టాలున్నా మనుస్మృతుల ముందు అవేమి పనిజేయలే. ఇది అంటరాని మహిళల దుస్థితి ఈ దేశంలో.

- జూపాక సుభద్ర

గ్రూప్2 పరీక్షలు వాయిదా వేస్తే నష్టమేంటి?



కోట రమేశ్
9618339490

గ్రూప్2, గ్రూప్3 పోస్టుల పెంపు, గ్రూప్2 పరీక్ష వాయిదా వేయడం గురించి అభ్యర్థులు ప్రభుత్వాన్ని అడుగుతున్నది న్యాయమైన, సామరస్యంగా పరిష్కరించ దగినదే. గ్రూప్ 2 పోస్టులు పెంచి, పరీక్షలను వాయిదా వేయడం మూలంగా ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక భారంగాని, ఇతర సాంకేతికాంశాలు కానీ పెద్దగా అడ్డురావు. వాళ్లు కోరుతున్నవి గొంతెమ్మ కోరికలేవీ కావు. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచడంతో పాటు, గ్రూప్2 పరీక్షను డిసెంబర్ వరకు వాయిదా వేయడానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే రాష్ట్రంలో గత కొంత కాలంగా గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలని, గ్రూప్ 2 పరీక్షను డిసెంబర్ వరకు వాయిదా వేయాలని అభ్యర్థులు, తీవ్రంగా ఆందోళనలు చేస్తున్నారు. గ్రూప్స్ పరీక్షలు, పోస్టుల సంఖ్య పెంపుపై నిరుద్యోగ అభ్యర్థులు లేవనెత్తుతున్న అంశాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పైగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. నిరుద్యోగ యువతను అవమానకరంగా మాట్లాడుతోంది. గ్రూప్2, గ్రూప్3 పరీక్షల విషయమై అభ్యర్థులు కోరుతున్న విధంగా సాధ్యాసాధ్యాలు పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపాలేగానీ కాలయాపన చేస్తోంది.

గ్రూప్స్ పరీక్షల్ని వాయిదా వేయాలని అభ్యర్థులు ఎందుకంత బలంగా కోరుతున్నారో ప్రభుత్వం పరిశీలించాలి. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల కాలంలో అనుసరించిన నిరుద్యోగ, విద్యార్థి వ్యతిరేక విధానాల మూలంగా ఆశించిన మేరకు ఉద్యోగాలు రాక నిరుద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్న విషయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించాలి. గత ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్లు రద్దు, పేపర్ లీకులు, టీఎస్పీఎస్సీ పరీక్షల నిర్వహణలో ఘోర తప్పిదాలు, పరీక్షలు వాయిదాలు వంటి కారణాలతో నిరుద్యోగులకు చాలా అన్యాయం జరిగింది. దానికి తోడు గ్రూప్2 పరీక్షలు మూడు సార్లు వాయిదా పడటం, నిరుద్యోగ యువతను మరింత నిరాశ పరిచింది. ఉద్యోగ నియామ కాల విషయంలో రెండు లక్షల ఉద్యో గాలు భర్తీ, రూ.4వేల నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ వంటి ఇతర అనేక వాగ్దానాలిచ్చి కాంగ్రెస్ గెలిచింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా, ఉద్యోగ నియామకాల విషయంలో స్పష్టత లేకపోవడం, ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగులకు నమ్మకం కలిగించక పోవడం, వరుస నోటిఫికేషన్లు, వివిధ రకాల పోటీ పరీక్షల నడుమ సమయం లేకపోవడం, ఇతర పోటీ పరీక్షల కోసం సన్నద్ధమయ్యే అవకాశాలు లేక అభ్యర్థులు మరింత మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. డీఎస్సీ రాత పరీక్షతోపాటు, గ్రూప్ 2 గ్రూప్ 3 పరీక్షలు వెనువెంటనే ఉన్నందున కొంత వెసులుబాటు కల్పిస్తూ, డిసెంబర్‌లో గ్రూపు 2 రాత పరీక్షలను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అభ్యర్థులు కోరడం ఆలోచించదగిన అంశమే.

తెలంగాణ ఏర్పడ్డాక 2016 తర్వాత వేసిన నోటిఫికేషన్‌తో 783పోస్టులకు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటన విడుదల చేసింది. ఎన్నికలు, ఇతర కారణాలరీత్యా సకాలంలో జరగాల్సిన పరీక్షలు వాయిదా పడ్డాయి. దాదాపు ఐదున్నర లక్షల మంది నిరుద్యోగులు ఈ పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తే తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని నిరుద్యోగుల ఆవేదన. 2022లో వేసిన నోటిఫికేషన్ ప్రకారం కాకుండా ప్రస్తుతం ఉన్న ఖాళీల ప్రకారం గ్రూప్2 పోస్టుల సంఖ్య పెంచి, సప్లిమెంటరీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షల గడువును డిసెంబర్ వరకు వాయిదా వేయాలని కోరుతున్నారు. జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు డీఎస్సీ రాత పరీక్షలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. డీఎస్సీ రాత పరీక్ష రాస్తున్న వారిలో అత్యధిక మంది గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షలు కూడా రాస్తున్న వారున్నారు. అభ్యర్థులు కోరుతున్న విధంగా ఇతర పోటీ పరీక్షలు రాసుకునే అవకాశం ఉండే మాదిరిగా డిసెంబర్ వరకు గ్రూప్2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విన్నవిస్తున్నారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులు అత్యధిక శాతం మంది గ్రూప్3 కూడా రాస్తున్నందున, సిలబస్ రెండు పరీక్షలకు ఒకేలా ఉండడం, వాయిదా వేయాలని కోరుటకు మరో ప్రధాన కారణం.

నవంబర్‌లో నిర్వహించే గ్రూప్ 3 పరీక్ష దగ్గరగా గ్రూప్ 2 పరీక్షలు పెట్టడం మూలంగా అభ్యర్థులు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది. గ్రూప్-2 రాసే అభ్యర్థులు గ్రూప్ 1 మెయిన్స్‌కు కూడా సెలెక్టయ్యారు. అలాంటప్పుడు ఈ రెండు పరీక్షలకు ఒకేసారి చదవడం కూడా చాలా ఇబ్బందే. గనుక వాయిదా వేయాలని నిరుద్యోగులు గట్టిగా పట్టుబడుతున్నారు. వేయకపోతే తమకు మరింత నష్టమన్నది నిరుద్యోగుల వాదన. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో రేవంత్ రెడ్డి నిరుద్యోగులతో పాటు గ్రూప్ 2 విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రూప్-2 పోస్టుల సంఖ్య పెంచి, మళ్లీ నోటిఫికేషన్ ఇస్తామంటూ, యువతకు న్యాయం చేస్తామంటూ చెప్పిన అంశాన్ని నిరుద్యోగులు గుర్తుచేస్తున్నారు. దానికి కట్టుబడి ఉండాలని కోరుతున్నారు.

ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ఉద్యోగ నియామకాల ప్రక్రియను వేగవంతం చేయాలని నిరుద్యోగులు ఆందోళన చేస్తున్నారు. గ్రూప్ 2 పోస్టులు పెంచి గ్రూప్-2 రాత పరీక్షలు డిసెంబర్ వరకు వాయిదా వేయాలని తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్నారు. అయితే చట్టబద్ధంగా పోరాడుతున్న అభ్యర్థుల పట్ల ప్రభుత్వం పోలీసు నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, అక్రమంగా అరెస్టు చేస్తూ, పోలీస్ స్టేషన్లో నిర్బంధిస్తూ, భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రూప్స్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులు పెంచాలి, గ్రూప్ 2 పరీక్షలు డిసెంబర్‌కు వాయిదా వేయాలనే అభ్యర్థుల ఆవేదనను అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహించడమే కాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల న్నింటిని భర్తీ చేయుటకు వెంటనే మరొక డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధపడాలి. దాంతో పాటు ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానన్న వాగ్దానానికి కట్టుబడి ఉండాలి. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో జాబ్ క్యాలెండర్ ప్రకటించి చట్టబద్ధత తీసుకొచ్చేందుకు, నిరుద్యోగ భృతి అమలు చేసేందుకు నిర్ణయాలు తీసుకోవాలి. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఉద్యోగ, ఉపాధి కల్పనకు సమగ్రమైన కృషి జరగాలి. నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ పాలన సాగాలి.



> జూలై 18 నుండి ఆగస్టు 5 వరకు డీఎస్సీ రాత పరీక్షలకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. డీఎస్సీ రాత పరీక్ష రాస్తున్న వారిలో అత్యధిక మంది గ్రూప్2, గ్రూప్ 3 పరీక్షలు కూడా రాస్తున్న వారున్నారు. అభ్యర్థులు కోరుతున్న విధంగా ఇతర పోటీ పరీక్షలు రాసుకునే అవకాశం ఉండే మాదిరిగా డిసెంబర్ వరకు గ్రూప్2 పరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థులు విన్నవిస్తున్నారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులు అత్యధిక శాతం మంది గ్రూప్3 కూడా రాస్తున్నందున, సిలబస్ రెండు పరీక్షలకు ఒకేలా ఉండడం, వాయిదా వేయాలని కోరుటకు మరో ప్రధాన కారణం.

సుప్రీంకోర్టు ఆదేశాన్ని స్వాగతిస్తున్నాం

బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ విచారణ కమిషన్ చైర్మెన్‌గా నరసింహారెడ్డిని తప్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్టు బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తెలిపారు. బుధవారం



హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు పట్ల జడ్జిగా పని చేసిన నరసింహారెడ్డి ఇష్టానుసారంగా ఎలా మాట్లాడుతారని ప్రశ్నించారు. నరసింహారెడ్డి భూకబ్జాలపై కాంగ్రెస్ నేతలే ఉద్యమం చేశారనీ, ఆయనకు ఆర్ఎస్ఎస్ మూలాలున్న సంగతి బహిరంగ రహస్యమేనని తెలిపారు. నరసింహారెడ్డిని చైర్మెన్‌గా నియమించినందుకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



ఉత్తమ వార్తా చిత్రం పోటీల గోడ పత్రికను
డిప్యూటీ సీఎం భట్టి ఆవిష్కరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫొటో జర్నలిస్టుల సంఘం ఏటా నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ఉత్తమ వార్తా చిత్రం పోటీల గోడ పత్రికను హైదరాబాద్‌లో బుధవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి, కొత్త సవాళ్లను స్వీకరించడానికి ప్రేరణగా నిలుస్తాయని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఫొటోజర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్. హరి మాట్లాడుతూ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని 30 ఏండ్లుగా ప్రతి ఏటా ఆగస్టులో ఉత్తమ వార్తా చిత్రం పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 200 మంది దాకా ఫొటో జర్నలిస్టులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశముందన్నారు. 2024 - 2025 గానూ ఉత్తమ వార్తా చిత్రం పోటీల విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.8వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేల పారితోషికంతో పాటు మెమెంటోలు, సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పారు. ఇవే కాకుండా 25 మంది ఉత్తమ ఫొటో గ్రాఫర్లకు కన్సొలేషన్ బహుమతుల కింద రూ.2 వేల చొప్పున నగదు పురస్కారం అందజేస్తా మన్నారు.

ఆసక్తి గల ఫొటోజర్నలిస్టులు మూడు 8 ఇన్‌టూ 12 సైజు కలర్, బ్లాక్అండ్‌వైట్ ఫొటోలను ఆగస్టు పదో తేదీలోపు బషీర్‌బాగ్ లోని దేశోద్ధారక భవన్‌లోని టీఎస్‌పీజేఏ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో టీఎస్‌పీజేఏ రాష్ట్ర నాయకులు నగర గోపాల్, అలీముద్దీన్, హరిప్రేమ్, ఆనంద్ ధర్మాన, వి.రజనీకాంత్, సుమన్ రెడ్డి, శివ కుమార్, అశోకుడు తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు

ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదు :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలని భావించిన కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టు తీర్పు చెంపపెట్టులాంటిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ట్వీట్ చేశారు. రాజకీయాల్లో కక్ష సాధింపు, ప్రతీకారాలకు చోటుండకూడదని పేర్కొన్నారు. కానీ దురదష్టవశాత్తు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పాలనను గాలికొదిలేసి రాజకీయ కక్షలు, ప్రతీకార చర్యలపైనే ఎక్కువ దృష్టి పెట్టిందని విమర్శించారు. నిజానికి వాటికి కూడా ఓ పరిమితి ఉంటుందనీ, కానీ దాన్ని దాటి కాంగ్రెస్ కేసీఆర్‌పై దుష్ప్రచారాలకు పూనుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రయత్నాలు ఎక్కువ కాలం నిలబడబోవని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పుతో స్పష్టమైందని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టిందని తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ సర్కారు బుద్ధి తెచ్చుకొని ఇలాంటి ప్రతీకార రాజకీయాలకు స్వస్తి పలకాలనీ, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. లేదంటే ప్రజా క్షేత్రంలో కూడా ఇలాంటి తీర్పే రావటం ఖాయమని హెచ్చరించారు. ఎన్నికుట్రలు, కుంతంత్రాలు చేసినప్పటికీ చివరికి సత్యమే గెలుస్తుందని పేర్కొన్నారు.

రుణమాఫీ చారిత్రాత్మక నిర్ణయం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా, రైతన్నకు ఇచ్చిన మాట ప్రకారం గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసేందుకు ముందుకొచ్చామని తెలిపారు. గురువారం సాయంత్రానికి 11.5 లక్షల మంది రైతుల ఖాతాల్లో నేరుగా నగదు జమ కానున్నట్టు పేర్కొన్నారు. ఆగష్టు 15లోగా రైతు రుణాలను మాఫీ చేస్తామని గతంలో ముఖ్యమంత్రి ప్రకటించారనీ, అందుకు నెలరోజుల ముందుగానే హామీని నిలబెట్టుకుని తమ నిబద్ధతను చాటుకున్నామని అన్నారు. పదహారేండ్ల క్రితం కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి రూ. 72 వేల కోట్ల వ్యవసాయ రుణాలు, వడ్డీలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణలో వ్యవసాయం మరింత లాభసాటిగా మారి, రైతులు ఆర్థికంగా బలపడడానికి వీలుగా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.. వ్యవసాయం దండుగ కాదు, పండుగ అనే విధంగా పరిస్థితిని మారుస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 60 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారనీ, రైతును రాజు చేయాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం ముందుకెళుతున్నదని పేర్కొన్నారు.

నేటి నుంచి రుణమాఫీ



(మొదటిపేజీ తరువాయి)
రాజకీయ పరిణామాలపై సీఎం వారికి దిశా నిర్దేశం చేశారు.

రుణవిముక్తే లక్ష్యం

రైతును రుణ విముక్తుడిని చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. రుణమాఫీపై జాతీయస్థాయిలో చర్చ జరగాలని వ్యాఖ్యానించారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఒకే విడతలో రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేయలేదని గుర్తు చేశారు. లక్ష రూపాయలతో ప్రారంభమై...ఈ నెలాఖరులోగా లక్షన్నర రూపాయలు, రెండు లక్షలు ఇలా మూడు దశల్లో ఆగస్టు 15లోపు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు సీఎం ప్రకటించారు.

ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలి

రైతు రుణమాఫీ నేపథ్యంలో గ్రామ, మండల, అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో పెద్ద ఎత్తున సంబురాలు చేపట్టాలని సీఎం పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు లేనిచోట నియోజకవర్గ ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామ, మండల కేంద్రాల్లో కూడలి నుంచి రైతు వేదికల వరకు బైక్ ర్యాలీలు నిర్వహించాలని కోరారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గ కేంద్రాల్లో పాల్గొనాలని ఆదేశించారు. ఎక్కడికక్కడ ఒక పండగ వాతావరణంలో సంబురాలు జరపాలన్నారు. ఏడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి రూ.30వేల కోట్లు ఖర్చు చేసిందని వెల్లడించారు. రాహుల్ గాంధీ ఇచ్చిన గ్యారంటీని అమలు చేశామంటూ పార్లమెంట్‌లో ఎంపీలు ప్రస్తావించాలని సూచించారు.

ఆర్థిక నిపుణులు కూడా భయ పెట్టారు

కేసీఆర్ పదేండ్లపాటు అధికారంలో ఉండి రూ.28 వేల కోట్లు కూడా మాఫీ చేయలేక పోయారని రేవంత్ విమర్శించారు. ఆగస్టు 15లోగా రైతుకు రుణమాఫీ చేస్తామని లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చామని, అయితే ఆర్థిక నిపుణులు రుణమాఫీ కష్టమని తేల్చి చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని వారు హెచ్చరించారన్నారు. కానీ గాంధీ కుటుంబం మాట ఇస్తే అది తమకు శిలాశాసనమన్నారు. రైతు రుణమాఫీ చేస్తామంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ఇచ్చారనీ, ఇబ్బందు లెన్నున్నా దాన్ని నిలబెట్టుకుంటున్నామని తెలిపారు.

దేశానికి తెలంగాణ మోడల్ 'రుణమాఫీ'

వ్యవసాయ విధానంలో తెలంగాణ మోడల్‌ను దేశం అనుసరించేలా ఉండాలని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే రోజనీ, గురువారం సాయంత్రం నాలుగు గంటలకు రూ.లక్ష వరకు ఉన్న రైతురుణాలు మాఫీ చేస్తున్నట్టు ప్రకటించారు. రుణమాఫీ పేరుతో కేసీఆర్ లాగా మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టడం లేదన్నారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందని అన్నారు. అందుకే ఏకమొత్తంలో రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తున్నట్టు వివరించారు. రైతు ఆత్మగౌరవాన్ని నిలబెట్టడానికే ఈ రుణమాఫీ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనిని ప్రజలకు వివరించాలని కోరారు.

రూపాయి, రూపాయి పోగేసి రుణమాఫీ
రేషన్‌కార్డు లేని కుటుంబాలకూ రుణవిముక్తి :
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

రైతు రుణమాఫీ అమలుకు నిద్రలేని రాత్రులు గడిపామనీ, రూపాయి, రూపాయి పోగేసి అన్నదాతలను రుణ విముక్తులను చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆగస్టు చివరి నాటికి రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామన్నారు. అన్ని కుటుంబాలకూ రుణమాఫీ అవుతుందని భరోసానిచ్చారు. రేషన్ కార్డులు లేని ఆరు లక్షల మంది రైతు కుటుంబాలకు కూడా రుణమాఫీ అందిస్తామని చెప్పారు. అవినీతిపరుల్లో 'ఎవరినీ వదలం...ఎవరికీ అవకాశం ఇవ్వం' అని స్పష్టం చేశారు. సాహసోపేతమైన రుణమాఫీ నిర్ణయాన్ని ప్రతి పోలింగ్ బూత్, ప్రతి ఓటర్ వద్దకు తీసుకెళ్లాలని కాంగ్రెస్ క్యాడర్‌కు విజ్ఞప్తి చేశారు.

తలెత్తుకుని ప్రచారం చేయండి

రుణమాఫీపై తల ఎత్తుకుని, ఎక్కడ తగ్గకుండా ప్రచారం చేయాలని భట్టి ఈ సందర్భంగా కోరారు. మిగులు బడ్జెట్ ఉన్నప్పుడు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం... లక్ష రూపాయల రుణమాఫీని రు.25వేల చొప్పున.. నాలుగు దఫాలుగా పూర్తి చేసిందన్నారు. ఏడు లక్షల కోట్ల అప్పులతో అధికారం చేపట్టిన కాంగ్రెస్... రెండు లక్షల రుణమాఫీని నెలల వ్యవధిలోనే పూర్తి చేస్తున్నదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే ఐదు హామీలను అమలు చేశామన్నారు. అయితే వాటి అమలుపై ఆశించిన స్థాయిలో క్షేత్రస్థాయిలో ప్రచారం లేదన్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటిస్తే అంతా ఆశ్చర్యపోయారని గుర్తు చేశారు. 'సీఎం సవాల్ ఓట్ల కోసమే, ఎన్నికల సవాల్ అనుకున్నారు. కానీ అందరి అంచనాలు తలకిందులు చేస్తూ రూపాయి రూపాయి పోగేసి రుణమాఫీని అమలు చేయబోతున్నాం. కాంగ్రెస్ నేతలందరికీ పెద్ద ఎత్తున ఉపయోగపడే కార్యక్రమం రుణమాఫీ. అందువల్ల ప్రతీ గ్రామానికి కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుంది' అని వివరించి రైతులు, ప్రజల హృదయాలను గెలవాలని కోరారు.

సీఎంను కలిసిన యూఎస్ ప్రొఫెసర్ మురళీధరన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ టాటా చాన్స్‌లర్స్ ఆఫ్ ఎకనామిక్స్ ప్రొఫెసర్ మురళీధరన్ ముఖ్యమంత్రిని కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సైతం మర్యాద పూర్వకంగా కలిశారు.

జూనియర్ విద్యార్థులపై సీనియర్ల దాడి

- చేర్యాల గురుకులంలో ఘటన మరువక ముందే అల్లాపూర్‌లో..





నవతెలంగాణ-తూప్రాన్

మరో గురుకుల పాఠశాలలో సీనియర్లు, జూనియర్ల మధ్య గొడవ జరిగింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండల పరిధిలోని అల్లాపూర్ టోల్‌ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో జూనియర్ విద్యార్థులపై ఇంటర్ సీనియర్ విద్యార్థులు మంగళవారం అర్ధరాత్రి దాడి చేయడం కలకలం రేపింది. భోజనాలు చేసిన తర్వాత టెన్త్ క్లాస్, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు నిద్రిస్తున్న గదికి సెకండియర్ విద్యార్థులు వెళ్లారు. ఈ క్రమంలో జూనియర్లు, సీనియర్లకు మధ్య మాటామాటా పెరిగింది. జూనియర్లపై బకెట్లు, పెట్టెలు, కర్రలతో సీనియర్లు విచక్షణా రహితంగా దాడి చేశారు. ఈ దాడిలో ఫస్ట్ ఇయర్ విద్యార్థి రాకేష్‌కు తీవ్ర గాయాలు కాగా షణ్ముఖ్, అనిల్ స్వల్పంగా గాయపడ్డారు. రాకేష్‌ను తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కళాశాల నిర్వాహకులను పోలీసులు ఆరా తీస్తున్నారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ సంఘటన జరిగిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్, అధ్యాపకులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరిపి భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

పది రోజుల కిందట చేర్యాలలో..

పది రోజుల కిందట చేర్యాల గురుకులంలోనూ ఇలాగే జరిగింది. ఈనెల 4వ తేదీ అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల హాస్టల్లో పదోతరగతి విద్యార్థులపై ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాడి చేసి గాయపర్చారు. దెబ్బల ధాటికి తట్టుకోలేక టెన్త్ విద్యార్థులు వీధుల వెంబడి పరుగులు తీస్తూ సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటనలో విధుల్లో ఉండి నిర్లక్ష్యం వహించిన నైట్ స్టే అధికారి పాము కృష్ణమూర్తి, వాచ్‌మెన్ లక్ష్మణ్‌కు అధికారులు మెమో జారీ చేశారు. రిజినల్ కో ఆర్డినేటర్ నిర్మల విద్యార్థులకు కౌన్సెలింగ్ కూడా ఇచ్చారు. ఇలా గురుకుల హాస్టళ్లలో ఇంటర్ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై దాడులు చేయడం తల్లిదండ్రులను భయాందోళనకు గురి చేస్తోంది.

పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలి

- పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలి
- బదిలీ అయిన ఉపాధ్యాయులకు స్థానచలనం కల్పించాలి : టీఎస్‌యూటీఎఫ్ సమావేశంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వేతన సవరణ కమిషన్ (పీఆర్సీ) నివేదికను కమిటీ నుంచి తెప్పించుకుని వెంటనే ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులందరినీ విడుదల చేయాలని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ 2023 జులై నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయాల్సిన పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలని అన్నారు. కర్నాటక ప్రభుత్వం 27.5 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణలో కూడా ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా 2022 జులై నుంచి 2024 జనవరి వరకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏలకు అనుగుణంగా రాష్ట్రంలోనూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నాలుగు డీఏలను ప్రకటించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవు, జీపీఎఫ్ రుణాలు, పార్ట్ ఫైనల్ రుణాలు, ఉద్యోగ విరమణ అనంతరం చెల్లించాల్సిన బిల్లులు రెండేండ్లుగా చెల్లించాల్సి ఉందని వివరించారు. ఇప్పటికీ ప్రభుత్వం చెల్లించకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాబట్టి వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మిగిలిపోయిన ఖాళీల్లో వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే బదిలీల్లో స్పౌజ్ పాయింట్ల దుర్వినియోగానికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బదిలీల్లో సమయాభావం వల్ల ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చే సందర్భంలో జరిగిన పొరపాట్ల వల్ల దూర ప్రాంతాలకు వెళ్ళిన వారికి న్యాయం చేయాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయు లందరినీ వెంటనే విడుదల చేయాలని చెప్పారు. ఒక వేళ ఉపాధ్యాయులు అవసరమైతే తదుపరి సర్దుబాటు చేయాలని సూచించారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ అన్ని గురుకులాల్లో జరుగుతున్న పదోన్నతులు, బదిలీల్లో సీనియార్టీ జాబితాల్లో తప్పులవల్ల సీనియర్లకు పదోన్నతి రాకుండా నష్టం జరుగుతున్నదని చెప్పారు. కాబట్టి సీనియార్టీ జాబితాలను తప్పుల్లేకుండా చేసి అందరికీ న్యాయం జరిగేటట్టు చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 317 జీవో బాధిత ఉపాధ్యాయులకు స్థానికత ఆధారంగా వారి జిల్లాలకు ఖాళీలను బట్టి బదిలీలు చేయాలని కోరారు. కేజీబీవీ నూతన నియామకాలు చేపట్టక ముందే ప్రస్తుతం పనిచేస్తున్న వారికి బదిలీలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశాల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ రాములు, సిహెచ్ దుర్గా భవాని, కోశాధికారి టి లక్ష్మారెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు ఎ వెంకటి, కె సోమశేఖర్, ఎం రాజశేఖర్‌రెడ్డి, వి శాంతికుమారి, డి సత్యానంద్, ఆర్ రంజిత్ కుమార్, ఈ గాలయ్య, బి రాజు, కె రవికుమార్, ఎస్ రవిప్రసాద్‌గౌడ్, ఎస్ మల్లారెడ్డి, జి నాగమణి, వై జ్ఞానమంజరి, జె యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే 'కస్తూర్బా'లు

- కల్వకుర్తి సమీపంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ : ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- కడ్తాల్‌లో కస్తూర్బా విద్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు





నవతెలంగాణ-ఆమనగల్

కాంగ్రెస్ హయాంలోనే కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు ప్రారంభించినట్టు ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో రూ.3.35 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని బుధవారం మంత్రులు శ్రీధర్ బాబు జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ పాఠశాలల విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు గర్వించేలా చేయాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కల్వకుర్తి సమీపంలో రూ.800 కోట్లతో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గ్రూప్-1 పరీక్షలను సజావుగా నిర్వహించలేకపోయిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. ఇప్పుడు పోటీ పరీక్షలు వాయిదా వేయాలని కుట్రలు చేస్తోందని అన్నారు. నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా డీఎస్సీతోపాటు అన్ని పోటీ పరీక్షలు నిర్ణీత సమయంలో కొనసాగుతాయని వివరించారు. ఏటా నిర్వహించే ఉద్యోగాల భర్తీ విషయమై త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకటించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. అన్ని సమస్యలను అధిగమించి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా నేటి నుంచి ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల వరకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.31 వేల కోట్ల రైతు రుణమాఫీ చేస్తామని అన్నారు.

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్య ఉంటే సాధించలేనిది ఏదీ లేదన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి దేశానికే తలమానికంగా ఎదగాలని సూచించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ..నియోజకవర్గంలోని చెర్కూర్ ప్రాంతంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం వందెకరాల స్థలాన్ని గుర్తించినట్టు చెప్పారు. అదేవిధంగా డీ 82 (కేఎల్ఐ) కాల్వ ద్వారా నియోజకవర్గంలో 35వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పొల్యూషన్ కమిటీ సభ్యులు బాలాజీ సింగ్, జిల్లా కలెక్టర్ శశాంక్, అడిషనల్ కలెక్టర్ ప్రతిమ సింగ్, ఆర్డీఓ సూరజ్ కుమార్, జిల్లా విద్యాధికారి సుశిందర్ రావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామేశ్వరీ దేవి, ఎంఈఓ సర్దార్ నాయక్, తహసీల్దార్ ముంతాజ్, ప్రిన్సిపాల్ అనిత, ఏటీడీఓ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'బు అబ్దుల్లా' కంపెనీ పెట్టుబడులు

- టీ హబ్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దుబాయికి చెందిన ప్రముఖ సంస్థ 'బు అబ్దుల్లా' రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. హైదరాబాద్‌లోని టీ హబ్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువురు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు 'బు అబ్దుల్లా' అంగీకారం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా అనేక వ్యాపార రంగాల్లో పెట్టుబడులు పెట్టి రికార్డులను సొంతం చేసుకున్న ఈ సంస్థ టీ కన్సల్ట్‌తో కలిసి పని చేయడానికి ముందుకు రావడం పట్ల సంస్థ చైర్మెన్ సందీప్ కుమార్ మక్తాలా సంతోషం వ్యక్తం చేశారు. వ్యాపార విస్తరణ, సహకారం, అభివృద్ధికి ఈ ఒప్పందం వారధిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

నేటినుంచి డీఎస్సీ రాతపరీక్షలు

- ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విధానం (సీబీఆర్టీ)లో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 14 జిల్లాల్లో 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు సుమారు 2,48,851 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గురువారం నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. రెండో విడతకు మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు.

నీటిపారుదల ప్రాజెక్టులకు రూట్‌మ్యాప్

- మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం వేగవంతం చేయడానికి ప్రత్యేకంగా రూట్‌మ్యాప్‌తో ముందుకుపోతున్నామని ఆ శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ ఇటీవల మహబూబ్‌నగర్ పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు 2025 డిసెంబరునాటికి ఆ జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తిచేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు చెప్పారు. పాలమూరు-రంగారెడ్డితోపాటు రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పురోగతి, నిర్మించాల్సిన ప్రాజెక్టులపై బుధవారం జలసౌధలో అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్సీ బి అనిల్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడుతూ కృష్ణా బేసిన్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని కోయిల్‌సాగర్, ఆర్‌బీఎల్ఐఎస్, జేఎన్ఎల్ఐఎస్, డిండి ఎల్ఐఎస్, ఏఎంఆర్, ఎస్ఎల్‌బీసీ, నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి ఎల్ఐఎస్ ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. గోదావరి బేసిన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం, నిల్వాయి ప్రాజెక్టు, పాలెంవాగు, మత్తడివాగు, ఎస్ఆర్ఎస్పీ ఫేజు-2, చనాకా కోరాట, లోయర్ పెన్‌గంగా, దేవాదుల, మోడీకుంటవాగు, ఎస్వైపీ, జేసీఆర్‌డీఎల్ఐఎస్, సీతారామా ఎల్ఐఎస్‌పై సమీక్ష చేసినట్టు తెలిపారు. వీటిని పూర్తి చేసేందుకు సుమారు రూ. 8 వేల కోట్ల పైచిలుకు ఖర్చవుతుందని చెప్పారు. అలాగే 2025 డిసెంబరు నెలాఖరుకు పూర్తి చేయాలన్న నిర్దేశిత లక్ష్యంతో ప్రణాళికలు రూపొందించుకున్న తాము నీటిపారుదల శాఖకు అదనంగా మరో రూ.11 వేల కోట్లు బడ్జెట్ ప్రతిపాదనను ఆర్థిక శాఖకు పంపాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ. 28 వేల కోట్లు నీటిపారుదల శాఖకు కేటాయించగా, గత ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణాల పేరుతో చేసిన అప్పులకు కడుతున్న వడ్డీయే రూ.18 వేల కోట్లు అని చెప్పారు. మరో రూ. 2వేల కోట్లు జీతభత్యాలకు ఖర్చవుతున్నాయని మంత్రి తెలిపారు. అవసరం మేరకు అదనపు నిధులతో ముందుకు సాగుతామన్నారు. ఇప్పటికే పూర్తికావొచ్చిన వాటిని ఏ కేటగిరీలో, ఆ తరువాత పనులు మధ్యలో ఉన్నవి బీ కేటగిరీలో, పనులు ప్రారంభంలో ఉన్నవి సీ కేటగిరీగా విభజించినట్టు తెలిపారు. ఏ విభాగంలో రూ.240.66 కోట్లతో 47,882 ఎకరాల ఆయకట్టును సేద్యంలోకి తీసుకొస్తున్నట్టు ప్రకటించారు. అలాగే ఆన్ గోయింగ్ ప్రాజెక్టులుగా నిర్మితమవుతున్న ప్రాజెక్టులకు రూ.7500 కోట్ల అంచనా వ్యయంతో 5,84,770 ఎకరాల ఆయకట్టు భూమిని సేద్యంలోకి తీసుకురానున్నట్టు చెప్పారు. నిర్మల్ జిల్లా సదర్‌మాట్ ప్రాజెక్టును ఈ నెల చివరలో ఖమం జిల్లా రాజీవ్ కెనాల్(సీతారామప్రాజెక్టు)ను ఆగస్టు 15న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్టు తెలిపారు.

రుణమాఫీ.. సాఫీయేనా..!

మార్గదర్శకాల్లో రేషన్‌కార్డుతో లింకు

- మౌఖికంగా లేదంటున్న మంత్రులు
- కుటుంబం ప్రామాణికతతో లక్షల్లో అనర్హులుగా మారుతున్న రైతులు
- రీషెడ్యూల్ విధానం కరెక్ట్ కాదంటున్న రైతులు, రైతుసంఘాలు
- విధివిధానాల సవరణ కోసం ఆందోళనలు
- నేటి నుంచి రూ.లక్షలోపు రుణాల మాఫీ.. సోషల్ మీడియాలో లిస్టు చక్కర్లు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రుణమాఫీ అమలు సాఫీగా సాగేనా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో రైతులను యూనిట్‌గా తీసుకుంటామని చెప్పి.. మార్గదర్శకాల్లో మాత్రం కుటుంబాన్ని ప్రాతిపదికగా నిర్ధారించడం ప్రభుత్వాన్ని విమర్శలకు గురిచేస్తోంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు ఐదేండ్లలో రైతులు తీసుకున్న రుణాన్ని రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం మాటిచ్చింది. ఇందుకు రూ.31వేల కోట్లు కేటాయించింది. 47 లక్షల మంది రైతులను లబ్దిదారుగా సూచించింది. అయితే, రేషన్‌కార్డుతో లింకు చేయడంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రేషన్‌కార్డు కేవలం కుటుంబ సభ్యులను తేల్చడానికేనని మంత్రులు మౌఖికంగా చెబుతున్నారు.. మార్గదర్శకాల్లో సవరణలు మాత్రం చేయలేదు. దాదాపు పదేండ్లుగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో లక్షలాది మంది అర్హులు కూడా అనర్హులుగా మారే ప్రమాదం ఉందని రైతుసంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వం, బ్యాంకర్ల ఒత్తిడి మేరకు రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తించకపోవడాన్ని కూడా పలువురు తప్పుపడుతున్నారు.

కొర్రీలు లేకుండా వర్తింపజేయాలని డిమాండ్లు

ఎలాంటి కొర్రీలు లేకుండా రుణమాఫీని వర్తింపజేయాలనే డిమాండ్ తీవ్రంగా ఉంది. ఈ పథకంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు.. మార్గదర్శకాల్లో లోపాలపై ఆందోళనలు కొనసాగుతున్నాయి. మరోవైపు రూ.లక్షలోపు రుణాలను గురువారం సాయంత్రానికి అకౌంట్లలో జమ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో 'క్రాప్‌లోన్ వేయివర్ 2024- ఫేస్‌వన్ ఫార్మర్స్ డేటా' పేరుతో ఓ పీడీఎఫ్ ఫైల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఖమ్మం జిల్లాలో 1,302 పేజీలతో 57,857 మంది రైతులను లబ్దిదారులుగా గుర్తిస్తూ మండలాలు, క్లస్టర్లు, రైతుల పేర్లతో కూడిన జాబితా ఒకటి సర్క్యులేట్ అవుతుండటంతో పలువురు దీనిపై చర్చించుకుంటున్నారు. ఈ జాబితాలో ఇది వరకే మాఫీ అయిన రైతుల పేర్లు ఉండటం మరో చర్చకు దారితీస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొత్తగా జారీ చేసిన పట్టాదార్ పాస్‌పుస్తకాల రైతుల పేర్లు మాత్రమే అర్హుల జాబితాలో ఉండటం గమనార్హం. కొన్నిచోట్ల దీనిని ఏవోలు షేర్ చేయడంతో ఇది అధికారిక జాబితాగా ప్రచారమవుతోంది.

విధివిధానాల సవరణ కోసం..

రైతు రుణమాఫీ విధివిధానాలను సవరించాలని పలుచోట్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. విపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల నిరసనలు తెలిపారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. బుధవారం సెలవు దినం కావడంతో గురువారం ఈ ఆందోళనలు మరింత ఉధృతంగా కొనసాగే అవకాశం ఉంది.

కుటుంబం.. రేషన్‌కార్డు అంశంపై విమర్శలు

రూ.2లక్షల్లోపు రుణాలు మాఫీ అవుతుండటంపై అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నా.. ప్రభుత్వ మార్గదర్శకాల్లో కుటుంబాన్ని ప్రాతిపదికగా తీసుకోవడం.. వారిని రేషన్‌కార్డు ఆధారంగా గుర్తిస్తామనడంతో కొందరిలో ఆందోళన నెలకొంది. గతంలో కుటుంబాన్ని నిర్ధారించేందుకు రేషన్‌కార్డును ప్రాతిపదికగా తీసుకుంటే.. 10 ఏండ్లుగా కొత్త కార్డులు జారీ కాలేదు. ఈ పదేండ్లలో వివాహాలు చేసుకుని వేర్వేరుగా ఉంటున్న సన్నకారు రైతుల్లో సందేహాలు నెలకొన్నాయి. మార్గదర్శకాల్లో ఉన్న ఈ నిబంధనను పూర్తిస్థాయిలో ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించలేదు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రం మౌఖికంగా రేషన్‌కార్డుతో సంబంధం లేదని చెబుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు విచారించి రేషన్‌కార్డు లేని రైతులను ధ్రువీకరిస్తారని అంటున్నారు. అలాగే, ఏజెన్సీ ప్రాంతంలో పట్టాదారు పాస్‌పుస్తకం లేని రైతులకు కూడా మాఫీ వర్తిస్తుందని మంత్రి తెలిపారు. మిగతా మంత్రులూ అదేరకంగా ప్రకటన చేస్తున్నారు. అయితే, మౌఖికంగా ఉన్న ఈ అంశాలు మార్గదర్శకాల్లో స్పష్టంగా లేకపోవడంపై అనుమానాలు నెలకొన్నాయి.

ప్రారంభ గడువుతో పలువురికి అనర్హత

2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.లక్షలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని నాటి కేసీఆర్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక రుణమాఫీ పథకం ఆచరణలో రకరకాల కొర్రీలు పెట్టింది. ఏకకాలంలో కాకుండా విడతల వారీ అమలుతో అర్హతున్నా చాలా మంది రైతులు అనర్హులయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. నాడు కేసీఆర్ సర్కారు ఏ కటాఫ్ తేదీ (2018 డిసెంబర్ 11)తో ముగించిందో ఆ మరుసటి రోజు (2018 డిసెంబర్ 12) నుంచి రూ.2లక్షల పంట రుణమాఫీ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. 2018 డిసెంబర్ 12 నుంచి సోనియాగాంధీ పుట్టిన రోజైన 2023 డిసెంబర్ 9వ తేదీని కటాఫ్‌గా ప్రకటించింది. ముగింపు తేదీ విషయంలో రైతులకు ఎలాంటి అభ్యంతరమూ లేకపోయినా కటాఫ్ డేట్స్ ప్రారంభ తేదీ (2018 డిసెంబర్ 12)ని మార్పు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మార్గదర్శకాలను సవరించి 2023 డిసెంబర్ 9లోపు రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటన చేయాల్సిందిగా రైతులు డిమాండ్ చేస్తున్నారు.

రీషెడ్యూల్‌తో మరికొందరు అనర్హులు

రీషెడ్యూల్ విధానంతో మరికొందరు అనర్హులుగా మారే ప్రమాదం ఉంది. 2008-09లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పంట నష్టపోయిన రైతుల రుణాలను రీషెడ్యూల్ చేశారు. ఉదా:లక్ష పంట రుణం ఉంటే దానిని నాలుగు విడతలుగా రూ.25వేల చొప్పున చెల్లించాలని సూచించారు. ఆ రైతులకు రూ.50వేల లోన్‌ను తిరిగి ఇచ్చారు. అలా పునరుద్ధరించిన రుణాలు కమర్షియల్ బ్యాంకుల్లో అధికంగా ఉన్నాయి. అప్పటి నుంచి కొనసాగుతున్న రీషెడ్యూల్ రుణాలకు మాఫీ వర్తించకపోవడంతో పలువురు అర్హత కోల్పోతున్నారు

బిజినెస్

ఆదాయపు పన్ను రేట్లను తగ్గించాలి

- 56 శాతం మంది డిమాండ్
- బడ్జెట్‌లో ఉపశమనం కల్పించాలి
- నిరుద్యోగాన్ని పరిష్కరించాలి
- ఇటి సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను రేటును తగ్గించాలని మెజారిటీ పన్ను చెల్లింపుదారులు డిమాండ్ చేస్తున్నారు. మోడీ సర్కార్ పన్ను భారాలు తగ్గించడం ద్వారా ప్రజల చేతుల్లో నగదు ఉంటుందని.. దీంతో వినిమయానికి డిమాండ్ పెరుగుతుందని సూచిస్తున్నారు. జులై 23న ఆర్థిక శాఖ మంత్రి మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ టైమ్స్ ఆన్‌లైన్ సర్వేలో 9500 మంది అభిప్రాయాలను సేకరించింది.

వచ్చే బడ్జెట్‌లో తమకు పన్ను భారాల నుంచి ఉపశమనం కల్పించేలా పన్ను రేట్ల తగ్గింపునకు ప్రాధాన్యతను ఇవ్వాలని 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభాన్ని కట్టడి చేయాలని 37 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నగదు బదిలీ పెంచాలని కేవలం 4 శాతం మంది మాత్రమే పేర్కొనడం గమనార్హం. రైల్వేలకు నిధుల కేటాయింపు పెంచాలని 2 శాతం మంది కోరారు.

పన్ను రేట్ల శ్లాబులను హేతుబద్ధీకరించాలని.. రూ.15 లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని 53 శాతం మంది అభిప్రాయపడ్డారు. 80సి పన్ను మినహాయింపుల పరిధిని పెంచాలని 20 శాతం మంది కోరారు. అధిక శ్లాబులో ఉన్న వారిపై పన్ను రేట్లను పెంచాలని, తక్కువ శ్లాబులో ఉన్న వారిపై పన్ను రేట్లకు కోత పెట్టాలని 11 శాతం మంది డిమాండ్ చేశారు.

2024-25లో ఇప్పటివరకు ప్రత్యక్ష పన్నుల వసూళ్లరూ.5.74 లక్షల కోట్లకు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోల్చితే 20 శాతం అదనం. ఇందులో రూ.3.61 లక్షల కోట్లు వ్యక్తిగత పన్ను ఆదాయానికి సంబంధించినవే. ఫిబ్రవరి 1న ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో 2024-25లో ఆదాయపు పన్ను వసూళ్లు రూ.11,56,000 కోట్లకు పెరుగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ఇది 2023-24తో పోల్చితే 13 శాతం ఎక్కువ. ఆదాయపు పన్ను రేట్లను తగ్గించడం ద్వారా ఇప్పటికే వెనుకబడిన వినియోగ స్థాయిలను పెంచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సహం లభించనుందని అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లోని సనోఫీ సెంటర్ విస్తరణ



హైదరాబాద్ : నగరంలోని తమ గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌ను విస్తరించినట్లు సనోఫీ హెల్త్‌కేర్ ఇండియా ప్రకటించింది. నూతన సెంటర్‌ను బుధవారం రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు లాంచనంగా ప్రారంభించారు. 2025 నాటికి 100 మిలియన్ల యూరో (రూ.900 కోట్లు)లతో పాటుగా 2030 నాటికి 400 మిలియన్ల యూరోల (రూ.36వేల కోట్లు) పెట్టుబడులకు ప్రణాళికలు రూపొందించినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. ఈ నూతన కేంద్రం వచ్చే రెండేళ్లలో 2600 మంది ఉద్యోగులకు తగిన అవకాశాలను అందించనుందని పేర్కొంది. హైటెక్‌సిటీలోని అత్యాధునిక కార్యాలయం ప్రారంభోత్సవంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ సెక్రటరీ అరుణిష్ చావ్లా, బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ థియరీ బెర్థెలాట్, సనోఫీ బిజినెస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ మడేలిన్ రోచ్ తదితరులు పాల్గొన్నారు.

విఎస్‌టిఎల్ తయారీ సామర్థ్యం రెట్టింపు

హైదరాబాద్ : విభర్ స్టీల్ ట్యూబ్స్ లిమిటెడ్ (విఎస్‌టిఎల్) తెలంగాణలోని బాలానగర్‌లోని తమ జిఐ తయారీ ప్లాంట్ సామర్థ్యాన్ని రెట్టింపు చేసినట్లు ప్రకటించింది. హర్యానా ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉన్న ఈ కంపెనీ తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్‌లోని యూనిట్ జిఐ తయారీ సామర్థ్యాన్ని ఏడాదికి 24,000 మెట్రిక్ టన్నుల నుండి 48,000 మెట్రిక్ టన్నులకు విస్తరించినట్లు వెల్లడించింది. ఎత్తయిన కట్టలపై విస్తతంగా ఉపయోగించే క్రాష్ బారియర్‌ల ఉత్పత్తిని పెంచడంలో కొత్త యూనిట్ కంపెనీకి సహాయపడుతుందని విఎస్‌టిఎల్ ఎండి విభర్ కౌశిక్ తెలిపారు. కొత్త యూనిట్ కోసం రూ.2 కోట్ల పెట్టుబడులు పెట్టామన్నారు. ఈ సంస్థకు మరో ప్లాంట్ మహారాష్ట్రలోని రాయిగడ్‌లో ఉంది.

జిఆర్ఎం ఓవర్సీస్ నుంచి మస్టర్డ్ ఆయిల్

న్యూఢిల్లీ : భారతీయ బాస్మతి బియ్యం ఎగుమతిదారులలో ఒక్కటైన జిఆర్ఎం ఓవర్సీస్ లిమిటెడ్ కొత్తగా తన ఎఫ్ఎంసిజి 10ఎక్స్ బ్రాండ్ కింద 'గులిస్తాన్ కచిఘని మస్టర్డ్ ఆయిల్'ని ఆవిష్కరించినట్లు తెలిపింది. ఒక్క లీటర్ సీసాలు, 5 లీటర్ల జాడిలో వచ్చే ఆవాల నూనె ప్యాక్ దేశవ్యాప్తంగా అందుబాటులో ఉంటుందని జిఆర్ఎం ఓవర్సీస్ సిఎండి అతుల్ గార్గ్ తెలిపారు.

ఆగస్ట్ 8న రెమిడియం లైఫ్‌కేర్ బోర్డు భేటీ

హైదరాబాద్ : ఎపిఐ ఇంటర్మీడియట్, ఇతర ముడి పదార్థాల ట్రేడింగ్ సంస్థ రెమిడియం లైఫ్‌కేర్ లిమిటెడ్ బోర్డు 2024 ఆగస్టు 8న భేటీ కానున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా ప్రత్యేక రసాయనాలకు సంబంధించిన అన్‌లిస్టెడ్ కంపెనీ కొనుగోలును పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. ఆ సంస్థ కొనుగోలు విలువ రూ.1,000 కోట్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. అదే విధంగా జూన్30తో ముగిసిన తొలి త్రైమాసికానికి సంబంధించిన తమ కంపెనీ ఆర్థిక ఫలితాలను బోర్డు ఆమోదించనుందని ఆ సంస్థ తెలిపింది.

ఇండెల్‌మనీ అండమాన్‌కు విస్తరణ

కొచ్చి : ప్రముఖ గోల్డ్ లోన్ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ ఇండెల్ మనీ కొత్తగా అండమాన్ నికోబర్ దీవులకు తమ కార్యకాలాపాలను విస్తరించినట్లు ప్రకటించింది. అక్కడ ఏర్పాటు చేసిన కొత్త శాఖలను ఆ సంస్థ ఛైర్మన్ మోహనన్ గోపాలకృష్ణన్ ప్రారంభించారని పేర్కొంది. దేశంలోని ప్రతి మూలకు చేరుకోవడం, ప్రతీ పౌరునికి సేవ చేయడంలో తమ నిబద్ధత, విజన్‌లో ఇది భాగమని ఆసంస్థ సిఇఒ ఉమేష్ మోహనన్ పేర్కొన్నారు.



శూన్య కర్బన వ్యర్థాలే లక్ష్యం

- ఎస్‌బిఐ సైక్లోథాన్

హైదరాబాద్ : విశ్వంలో శూన్య కర్బన వ్యర్థాలే లక్ష్యంగా అవగాహన పెంచడానికి ఎస్‌బిఐ హైదరాబాద్ సర్కిల్ బుధవారం సైక్లోథాన్‌ను నిర్వహించింది. 'పెడల్ ఫర్ ప్లానెట్' పేరుతో నెక్లెస్ రోడ్‌లో ఎస్‌బిఐ ప్రొబేషనరీ ఆఫీసర్స్ 2023 బ్యాచ్, సీనియర్ అధికారులు సైకిల్ ర్యాలీ చేపట్టారు. దీనికి ఆ బ్యాంక్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల కోసం కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

తమ బ్యాంక్ 2030 నాటికి కార్బన్ న్యూట్రాలిటీకి చేరాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్లు ప్రకాష్ చంద్ర బరోర్, రవి కుమార్ వర్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి ముగ్గురు మృతి

- పల్లెటూరిలో సరదాగా గడిపేందుకు వచ్చిన కుటుంబాల్లో తీవ్ర విషాదం
- సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ఎస్ మండలంలో ఘటన


రాజు (ఫైల్)


శ్రీపాల్‌రెడ్డిరాజు (ఫైల్)


ఉషాంక (ఫైల్)

నవతెలంగాణ-ఆత్మకూరు ఎస్

పల్లెటూరిలో రెండ్రోజులు సరదా గడిపేందుకు స్నేహితుని అత్తగారి గ్రామానికి వచ్చిన రెండు కుటుంబాల్లో తీరని విషాదం ఏర్పడింది.. పల్లె ప్రకృతి అందాలను చూసి.. పొలాల్లో సంతోషంగా తిరిగిన వారు చివరకు క్వారీ గుంతలో ఈతకొట్టేందుకు వెళ్లి ప్రాణం కోల్పోయారు. లోతును గమనించే లోపే ముగ్గురు అందులోకి జారిపడి మృతిచెందారు. ఈ ఘటన బుధవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ఎస్ మండలం బొప్పారం గ్రామంలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన తిప్పారెడ్డి శ్రీపాల్‌రెడ్డి(40), తన మిత్రుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నరసరావుపేటకు చెందిన చామల రాజు(45) కుటుంబంతో కలిసి శ్రీపాల్‌రెడ్డి అత్తగారు ఊరు అయిన ఆత్మకూర్ ఎస్ మండలం బొప్పారం గ్రామానికి రెండ్రోజుల కిందట వచ్చారు. బుధవారం ఉదయం పల్లె వాతావరణం, పరిసరాలను చూసేందుకు శ్రీపాల్ రెడ్డి, కుమారుడు చేతన్ రెడ్డి, చామల రాజు, అతని ఇద్దరు కుమార్తెలు ఉషాంక (12), రిషిక, శ్రీపాల్ రెడ్డి వదిన కూతురు వర్షిత మొత్తం ఆరుగురు బయటకు వెళ్లారు. గ్రామ సమీపంలో ఉన్న బిక్కేరు వాగు వద్ద కాసేపు గడిపారు. తర్వాత శ్రీపాల్ రెడ్డి మామ ఉపేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి వస్తుండగా.. చెరువు సమీపంలో ఉన్న క్వారీలో నీటిని చూశారు. గుంత లోతు తక్కువ ఉంటుందనుకుని అందులో ఈత కొట్టాలనుకున్నారు. శ్రీపాల్‌రెడ్డి కొడుకు చేతన్ రెడ్డికి ఈత రావడంతో గుంతలోకి దిగి లోతు చూసి రమ్మన్నారు. గుంత లోతుగా ఉన్నదని చెప్పేలోగా రాజు, అతని పెద్ద కూతురు ఉషాంక నీటిలోకి దిగారు. ప్రమాదవశాత్తు లోపలికి జారిపడ్డారు. వారిని కాపాడే ప్రయత్నంలో శ్రీపాల్ రెడ్డి కూడా జారి పడిపోయారు. అదే సమయంలో రాజు చిన్న కూతురు రితిక మునిగిపోతుండగా చేతన్ కాపాడి బయటకు తీసుకొచ్చాడు. అప్పటికే రాజు, ఉషాంక, శ్రీపాల్‌రెడ్డి నీటిలో మునిగిపోయారు. బయట ఉన్న వారు కుటుంబీకులకు ఫోన్ చేసి చెప్పి.. కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే ముగ్గురూ మృతిచెందారు. శ్రీపాల్ రెడ్డి ఖమ్మంలో బిల్డర్‌గా పనిచేస్తున్నారు. రాజు కొంతకాలంగా హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. రాజు భార్య, శ్రీపాల్ రెడ్డి భార్య క్లాస్ మేట్‌లు కావడంతో రెండు కుటుంబాలు సన్నిహితంగా ఉంటున్నాయి. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో డీఎస్పీ రవి, సీఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ సైదులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాలను సూర్యాపేట ఏరియాస్పత్రికి తరలించారు.

క్వారీ చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి : గ్రామస్తులు

క్వారీ చేపట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. క్వారీ చేపట్టడంతో చుట్టుపక్కల పంట పొలాలు దెబ్బతింటున్నాయని, పెద్ద పెద్ద గోతులు, బండలు ఏర్పడ్డాయని, దాని ద్వారా పశువులతో పాటు మనుషులు కూడా ప్రమాదాల గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

మెరుగైన చికిత్సనందించాలి

- నారాయణమూర్తి ఆరోగ్యంపై మంత్రి దామోదర

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ నటుడు ఆర్.నారాయణమూర్తికి మెరుగైన చికిత్సనందించాలని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అనారోగ్యంతో చికిత్స కోసం నారాయణమూర్తి నిమ్స్ లో చేరిన నేపథ్యంలో మంత్రి,, ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

నారాయణమూర్తి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్టు డాక్టర్ బీరప్ప మంత్రికి వెల్లడిచారు. అనుభవజ్ఞులైన డాక్టర్లతో నారాయణమూర్తికి చికిత్సనందించాలని మంత్రి సూచించారు.

జవహర్‌నగర్‌లో యాంటీ డాగ్ స్క్వాడ్ ఆపరేషన్

- 40 కుక్కలను పట్టుకున్న జీహెచ్ఎంసీ సిబ్బంది
- కార్పొరేషన్ ఎదుట స్థానికుల ఆందోళన



నవతెలంగాణ - జవహర్‌నగర్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి కుక్కల దాడిలో సుమారు 16 నెలల వయస్సు బాలుడు మృతి చెందడంతో స్థానికంగా తీవ్ర విషాదం.. భయాందోళన నెలకొంది. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. జీహెచ్ఎంసీ, బ్లూ క్రాస్, హెల్త్ డిపార్ట్‌మెంట్ సహకారంతో యాంటీ డాగ్ సిబ్బంది బుధవారం రెండు బృందాలుగా ఏర్పడి ఆపరేషన్ నిర్వహించారు. సుమారు 40 కుక్కలను పట్టుకున్నారు. ఈ ఘటనపై మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డి స్పందిస్తూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామన్నారు. యాంటీ డాగ్ బృందాలు మున్సిపల్ పరిధిలో అందుబాటులో లేకపోవడంతో ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని చెప్పారు. భవిష్యత్‌లో మళ్లీ జరగకుండా చూస్తామన్నారు. పర్మినెంట్‌గా ఒక యాంటీ డాగ్ వెహికల్ బృందం జవహర్‌నగర్ మున్సిపల్‌కు కేటాయించాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన

వీధి కుక్కల బెడదపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదంటూ జవహర్‌నగర్‌లో స్థానికులు కార్పొషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు వారికి మద్దతుగా వచ్చారు. బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. కమిషనర్ తాజ్ మోహన్‌రెడ్డితో నాయకులు చర్చలు జరిపారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వీధి కుక్కలపై అధ్యయనానికి నిపుణుల కమిటీ

- బాలుడి మృతి కలిచివేసింది :జవహర్‌నగర్ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ జవహర్‌నగర్‌లో వీధి కుక్కల దాడిలో రెండేండ్ల బాలుడు మృతి చెందడం తనను కలిచి వేసిందని సీఎం ఏ.రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. వీధి కుక్కల బెడద ఉన్న ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు కాల్ సెంటర్ లేదా టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పసికందులు, చిన్నారులపై ప్రతి ఏటా వీధి కుక్కల దాడులకు వాతావరణ పరిస్థితులా లేక సీజనల్ అంశాలు కారణమా అనే అంశంపై అధ్యయనానికి పశు వైద్యులు, బ్లూ క్రాస్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీధి కుక్కలకు టీకాలు వేయటంతో పాటు ఇతర రాష్ట్రాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లు, రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో కుక్క కాటుకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని వైద్యారోగ్య శాఖను సీఎం ఆదేశించారు. ఇలాంటి ఘటనలను నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలనీ, అన్ని బస్తీలు, కాలనీలు, సంబంధిత వార్డు కమిటీల సహకారం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఆరోగ్యంగా అంబారీ ఏనుగు

- బోనాలు, మొహర్రం ఊరేగింపులో పాల్గొంటుంది : అటవీశాఖ అధికారులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కర్నాటక రాష్ట్రం నుంచి తీసుకొచ్చిన రూపవతి అనే ఏనుగు బోనాలు, మొహర్రం ఊరేగింపుల్లో పాల్గొంటుందని రాష్ట్ర అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఈనెల 14న తెల్లవారుజామున హైదరాబాద్ చేరుకున్న అంబారీ ఏనుగుకి నెహ్రూ జూపార్క్ వైద్యులు, తెలంగాణ పశు సంవర్ధక శాఖకి చెందిన సుదీర్ఘ అనుభవం కలిగిన వైద్యులు బుధవారం మరోసారి వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు 'ఏనుగు ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. ప్రవర్తన సాధారణంగా ఉంది. పురానాహవేలీలో సురక్షితంగా వెటర్నరీ వైద్యుల సంరక్షణలో ఉంచాం' అని వైద్యుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్, ఎలిఫెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు కర్నాటక నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చే క్రమంలో మొఖా అనే ప్రాంతం వద్ద ఏనుగుకు తొలిసారి వైద్యపరీక్షలను నిర్వహించామని వైద్యులు తెలిపారు. నిజాం రిలీజియస్ ట్రస్ట్, అక్కన్న మాదన్న దేవాలయ కమిటీలు మొహర్రం, బోనాల ఊరేగింపు కోసం ఏనుగు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి అర్జీ పెట్టుకున్న విషయం విదితమే. దీంతో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కర్నాటక ప్రభుత్వంతో చర్చించి దావణగెరెలోని జగద్గురు పంచాచార్య మందిర్ ట్రస్ట్ నుండి ఏనుగును తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ రూపవతిని తీసుకొచ్చిన సంగతి తెలిసిందే.

బీఆర్ఎస్‌కు భూ కేటాయింపు రద్దు చేయండి

సికింద్రాబాద్‌కు చెందిన జై అశోక్ జయశ్రీ, కుటుంబసభ్యుల పిటీషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గండిపేట మండలం కోకాపేటలోని తమ భూమిని గత ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీకి కేటాయించడాన్ని రద్దు చేయాలంటూ సికింద్రాబాద్‌కు చెందిన జై అశోక్ జయశ్రీ ఇతర కుటుంబసభ్యులు పిటిషన్ వేశారు. దీనిని జస్టిస్ లక్ష్మణ్.కె విచారించి ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు. కౌంటర్ వేయాలని ఆదేశించారు. కోకాపేటలో సర్వే నెం 230, 240లో 11 ఎకరాల కేటాయింపును రద్దు చేయాలని పిటిషనర్ న్యాయవాది కోరారు. నవాబ్ నుస్రత్ జంగ్1 నుంచి వారసుల పవర్ ఆఫ్ అటార్నీ పొందిన కృష్ణమూర్తి ద్వారా తమ వంశీయులు 1967లో కొన్నారని

తల్లి లివర్ కొడుక్కి...

ఉస్మానియా ఆస్పత్రిలో కాలేయమార్పిడి విజయవంతం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కార్పొరేట్ ఆస్పత్రులకు ఏ మాత్రం తీసిపోని విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రు ల్లోని వైద్యులు తమ ప్రతిభను, పనితీరును కనబరుస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రి డాక్టర్లు ఇప్పటికే ఎనిమిది మంది చిన్నారులతో పాటు 30 మందికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన సంగతి తెలిసిందే. తాజాగా మరో చిన్నారికి చేసిన కాలేయ మార్పిడి చికిత్స కూడా జయప్రదమైంది.. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం కొండవనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతుల కుమారుడు మాస్టర్ చోహన్ ఆదిత్య (3) పుట్టుకతోనే పిత్తాశయ ధమని, కాలేయ సమస్యతో బాధపడుతున్నాడు. ఆదిత్యను పరిశీలించిన ఉస్మానియా వైద్యులు మధుసూదన్ నేతృత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, కాలేయ మార్పిడి బృందం ఈ నెల మూడో తేదీన అతడికి కాలేయ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. అమల తన కాలేయాన్ని కుమారునికి దానం చేయడంతో కొంత భాగాన్ని తీసుకొని బాలునికి అమర్చారు. ప్రస్తుతం తల్లీకుమారులు క్షేమంగా ఉన్నారు. వారిని మంగళవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

మంత్రి అభినందనలు

కాలేయ మార్పిడిని విజయవంతంగా పూర్తి చేసిన వైద్యబందాన్ని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందించారు. ఉస్మానియా ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వైద్య సేవలందిస్తున్నదని మంత్రి తెలిపారు.

మంత్రుల ఆదాయ పన్ను చెల్లింపుపై పిల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల జీతాలపై ఆదాయపు పన్నును ప్రభుత్వమే చెల్లించేలా తెచ్చిన చట్టసవరణను రద్దు చేయాలనే పిల్‌పై కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. జీతాలు, పెన్షన్, అనర్హతపై తొలగింపు చట్టం 1953లోని సెక్షన్ 3(4)ను రద్దు చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ పిల్ దాఖలు చేసింది. దీనిని చీఫ్ జస్టిస్ బెంచ్ విచారించి ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జీఏడీ ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది.

విద్యలో నాణ్యత పడిపోతోంది
ప్రాథమిక స్థాయి పూర్తయినా చదవలేకపోతున్నారు

భారత్‌పై యునిసెఫ్ నివేదిక

ప్రాథమిక విద్యలో టాపర్...
ఉన్నత విద్యలో బ్యాక్‌బెంచర్ !



దేశంలో విద్యా నాణ్యత ఆశించిన స్థాయిలో లేదు. ఎక్కువ మంది విద్యార్థుల్లో నైపుణ్యం కన్పించడం లేదు. ప్రాథమిక విద్యను పూర్తి చేసిన వారు సైతం సరిగా చదవలేక పోతున్నారు. విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ప్రాథమిక పాఠశాలలను కూడా ఇంటర్నెట్‌తో అనుసంధానించాలని యునిసెఫ్ నివేదిక సూచించింది. ఈ విషయంలో మన దేశం బాగా వెనుకబడి ఉంది.

న్యూఢిల్లీ : ప్రాథమిక విద్యలో మన దేశం గణనీయమైన పురోగతి సాధించింది. గత సంవత్సరం 94 శాతం భాగస్వామ్య (పార్టిసిపేషన్) రేటును సొంతం చేసుకుంది. వచ్చే సంవత్సరానికి నిర్దేశించుకున్న జాతీయ లక్ష్యం 99 శాతానికి కొద్ది దూరంలో నిలిచింది. వియత్నాం, ఇరాన్ వంటి దేశాలతో పాటు వర్ధమాన దేశాల్లో అత్యంత వేగంగా పురోభివృద్ధి సాధిస్తున్న దేశాల సరసన చేరింది. అయితే సెకండరీ స్థాయిలో...అంటే ఉన్నత విద్యలో మాత్రం పురోగతి నత్తనడక నడుస్తోంది. ఇందులో మన దేశం 88 శాతం పార్టిసిపేషన్ రేటు మాత్రమే పొందింది. అప్పర్ సెకండరీ స్థాయి విద్యను పూర్తి చేసే రేటు ఆందోళన కలిగిస్తోంది. లింగ సమానత్వ సూచికలో మన విద్యాభివృద్ధి అప్పర్ సెకండరీ స్థాయిలో అసమానతలతో కూడి ఉంది. నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడం కూడా సవాలుగా మారింది. నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే నాణ్యమైన విద్యను అందించగలుగుతాము. పాఠశాలల్లో ఇంటర్నెట్ అనుసంధానం కూడా పెరుగుతుంది. యునెస్కో ఇటీవల విడుదల చేసిన నివేదిక విద్యలో మన దేశం సాధించిన పురోగతితో పాటు ఎదుర్కొంటున్న సవాళ్లను కూడా ప్రస్తావించింది.

మన దేశంలో అప్పర్ సెకండరీ స్థాయి విద్యను పూర్తి చేసిన రేటు కేవలం 51 శాతంగానే ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా కంటే భారత్ వెనుకబడి ఉంది. సెకండరీ విద్యను పూర్తి చేసే వరకూ విద్యార్థులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతోంది. విద్యా రంగంలో లింగ సమానత్వం మన దేశంలో ఒకేలా లేదు. ప్రాథమిక, లోయర్ సెకండరీ స్థాయిల్లో అసమానతలు తక్కువగా ఉండగా అప్పర్ సెకండరీ స్థాయిలో అధికంగా ఉన్నాయి. సెకండరీ విద్యను పూర్తి చేసుకుంటున్న యువతుల సంఖ్య పెరుగుతోంది. అయితే 2025 నాటికి సాధించాలనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన వేగం కన్పించడం లేదు. సెకండరీ స్థాయిలో లింగ అసమానతలను తగ్గించుకోవడంలో బంగ్లాదేశ్, భూటాన్ వంటి దేశాలు పురోగతి సాధించాయి.

రెచ్చిపోయిన హిందూత్వ మూక

- ఒక మతం ప్రార్థనలకు ఆటంకం
- ఇంట్లోకి చొరబడి మరీ ఏడుగురిపై దాడి
- ప్రార్థన గది, ఇల్లు ధ్వంసం.. డెహ్రాడూన్‌లో ఘటన



డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లో హిందూత్వ శక్తులు రెచ్చిపోయాయి. ఒక మైనారిటీ వర్గం మత విశ్వాసాలను కించపరుస్తూ, వారి ప్రార్థనలకు ఆటంకం కలిగిస్తూ దారుణంగా వ్యవహరించాయి. ఇంట్లోకి చొరబడి మరీ బాధితులపై దాడులకు దిగాయి. డెహ్రాడూన్‌లో జరిగిన ఈ ఘటనలో నిందితులపై పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..గత వారం ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లోని తన ఇంట్లో తన కుటుంబం, బంధువులు, పొరుగువారితో కలిసి వారపు ప్రార్థనలకు సిద్ధమైన దీక్షా పాల్(35)పై హిందూత్వ శక్తుల దాడులు రెచ్చిపోయాయి. ఇంట్లోకి చొరబడి, లోపల ఉన్నవారిలో కనీసం ఏడుగురిపై దాడి చేశాయి. ప్రార్థన గది, పడకగదిని ధ్వంసం చేశాయి. క్రైస్తవ విశ్వాసానికి వ్యతిరేకంగా కించపరిచే వ్యాఖ్యలు చేసి, వారందరినీ బలవంతపు మతమార్పిడులకు పాల్పడ్డారని హిందూత్వ కార్యకర్తలు ఆరోపించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద 11 మంది నిందితులపై నెహ్రూ కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. నిందితులను దేవేంద్ర దోభాల్, బిజేంద్ర థాపా, సధీర్ థాపా, సంజీవ్ పాల్, సుధీర్ పాల్, ధీరేంద్ర ధోబాల్, అర్మాన్ ధోబాల్, ఆర్యమాన్ ధోబాల్, అనిల్ హిందూ, భూపేష్ జోషి, బిజేంద్రగా గుర్తించారు. పోలీసు అధికారి సత్బీర్ సింగ్ మాట్లాడుతూ.. "ఇంట్లో ఎటువంటి మత మార్పిడీ జరగలేదు. హిందూత్వ సంస్థలకు చెందిన వ్యక్తులు కుటుంబ సభ్యులతో దురుసుగా ప్రవర్తించారు. వారి ఇంటిని ధ్వంసం చేశారు" అని చెప్పారు. ఘటనకు సంబంధించిన ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. కాగా, ఈ ఘటనలో పోలీసులు ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదు. "పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో ఛార్జిషీట్ దాఖలు చేస్తారు" అని పోలీసు అధికారి చెప్పారు. నిందితుల చర్యను సామాజికవేత్తలు, ప్రజా సంఘాల నాయకులు ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, పోలీసులను వారు డిమాండ్ చేశారు. హిందూత్వ శక్తులు సమాజంలోని మతసామరస్యానికి విఘాతం కలిగిస్తూ, మైనారిటీ వర్గాలను భయాందోళనకు గురి చేస్తున్నాయని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

గోరఖ్‌పూర్ వర్సిటీలో
ఏబీవీపీ మూకల వీరంగం
వీసీ, రిజిస్ట్రార్‌పై దాడి...పిడిగుద్దులు

పోలీసుల పైనా తిరుగుబాటు

గోరఖ్‌పూర్ : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ఇలాకా గోరఖ్‌పూర్‌లో బీజేపీ అనుబంధ విద్యార్థి విభాగం ఏబీవీపీ కార్యకర్తలు శుక్రవారం బీభత్సం సృష్టించారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గోరఖ్‌పూర్ యూనివర్సిటీలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌పై దాడి చేసి కొట్టారు. వారిని కింద పడేసి పిడిగుద్దులు గుద్దారు. అడ్డుకోబోయిన పోలీసులపై కూడా తిరగబడ్డారు. ఏబీవీపీ కార్యకర్తలు తొలుత వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌పై దాడి చేసి విధ్వంసం సృష్టించారు. వారిని నియంత్రించేందుకు ప్రయత్నించిన పోలీసులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో వైస్ ఛాన్సలర్ రాజేష్ సింగ్, రిజిస్ట్రార్ అజయ్ సింగ్, కొందరు పోలీసులు గాయపడ్డారు. సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులతో సమావేశమయ్యేందుకు వర్సిటీ అధికారులు నిరాకరించడంతో గొడవ మొదలైంది. సమస్యలు పరిష్కరిస్తామని గతంలో వైస్ ఛాన్సలర్ హామీ ఇచ్చారని, అయినా ఏమీ జరగలేదని విద్యార్థులు ఆరోపించారు. వర్సిటీలో అలజడి సృష్టిస్తున్న నలుగురు ఏబీవీపీ కార్యకర్తలను అంతకుముందు డీన్ సత్యపాల్ సింగ్ సస్పెండ్ చేశారు. దీంతో ఉద్రిక్తతలు పెరిగాయి. నిరసనకారులను అదుపు చేయడంలో పోలీసులు విఫలమ వడంతో పరిస్థితి మరింత క్షీణించింది. పరిస్థితి చేయిదాటడంతో పోలీసులు వర్సిటీ అధికారులను సురక్షిత ప్రదేశానికి తరలించారు.

ఒక్కసారి బారికేడ్లు ఎత్తేస్తే..

ఢిల్లీ వైపు రైతుల మార్చ్

డిమాండ్లను సాధించేవరకూ ఆందోళన
- ఎస్కేఎం నేత, రైతు నాయకుడు : జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ వెల్లడి

చండీగఢ్: అంబాలా సమీపంలోని శంభు సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై హర్యానా ప్రభుత్వం ఏర్పాటు చేసిన బారికేడ్లను ఎత్తివేస్తే రైతులు ఢిల్లీ వైపు తమ మార్చ్‌ను కొనసాగిస్తారని రైతు నేత, సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీ యేతర) నాయకుడు జగ్‌జిత్ సింగ్ దల్లేవాల్ అన్నారు. సాగు చట్టాల రద్దు అనంతరం మోడీ సర్కారు హామీ ఇచ్చిన కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ), ఇతర డిమాండ్ల సాధన కోసం రైతులు ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. వీరిని ఢిల్లీలోకి ప్రవేశించకుండా భద్రతా దళాలు, హర్యానా ప్రభుత్వం రహదారిపై బారీకేడ్లను ఏర్పాటు చేసి నిరోధిస్తున్నది. రహదారి ఎప్పుడు తెరిచినా, మేము ఢిల్లీ వైపు కవాతు చేస్తామని దల్లెవాల్ అన్నారు.

ఫిబ్రవరిలోనే మార్చ్‌కు ప్రణాళిక.. అడ్డుకున్న హర్యానా ప్రభుత్వం

పంటలకు ఎంఎస్‌పీకి చట్టపరమైన హామీతో సహా వివిధ డిమాండ్‌లకు మద్దతుగా ఢిల్లీ వైపు వెళ్లాలని ఫిబ్రవరిలో ఎస్కేఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం)లు తమ ప్రణాళికను ప్రకటించాయి.

అయినప్పటికీ, వారి 'ఢిల్లీ చలో' మార్చ్‌ను ఫిబ్రవరి 13న పంజాబ్, హర్యానా మధ్య శంభు-ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద భద్రతా దళాలు, హర్యానా ప్రభుత్వం బారికేడ్లు, సిమెంటు దిమ్మలు ఏర్పాటు చేసి అడ్డు కున్నాయి. అప్పటి నుంచి చాలా మంది రైతులు సరిహద్దు పాయింట్ల వద్దే ఉంటున్నారు. కాగా, తమ డిమాండ్లు సాధించే వరకు రైతుల ఆందోళన కొనసాగుతుందని దల్లేవాల్ స్పష్టం చేశారు.

బారికేడ్లను ఎత్తేయాలన్న హైకోర్టు.. 'సుప్రీం'కు హర్యానా సర్కారు

మార్చిలో జరిగిన ర్యాలీలో అరెస్టు చేయబడి, అల్లర్లు, హత్యాయత్నంతో సహా పలు అభియోగాలను ఎదుర్కొంటున్న నవదీప్ సింగ్‌కు సంఘీభావం తెలిపేందుకు బుధవారం అంబాలా వద్ద రైతులు శాంతియుత నిరసనను ప్లాన్ చేసినట్టు ఆయన చెప్పారు.



రైతన్నల డిమాండ్లివే..!

రైతులు, రైతు కూలీలకు పూర్తి రుణమాఫీ, 58 ఏండ్ల రైతులు, వ్యవసాయ కూలీలకు నెలవారీ పింఛను, విద్యుత్ సవరణ బిల్లు-2020 ఉపసంహరణ, రైతుల సమ్మతిని నిర్ధారించటానికి, నాలుగు రెట్ల పరిహారం కోసం భూసేకరణ చట్టం-2013ని తిరిగి ప్రవేశపెట్టటం, రోజువారీ వేతనాల పెరుగుదల వంటి ఇతర డిమాండ్లను రైతులు వినిపిస్తున్నారు.

వారంలోగా శంభు సరిహద్దు వద్ద బారికేడ్లను ఎత్తేయాలని పంజాబ్ అండ్ హర్యానా హైకోర్టు హర్యానా ప్రభుత్వాన్ని ఆదేశించిన కొద్ది రోజుల తర్వాత దల్లేవాల్ నుంచి ప్రకటన రావటం గమనార్హం. కాగా, శాంతిభద్రతల పరిస్థితిని పేర్కొంటూ హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ హర్యానా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హర్యానా ప్రభుత్వ వాదనపై దల్లేవాల్ స్పందిస్తూ..రోడ్డును దిగ్బంధించింది ప్రభుత్వమే తప్ప రైతులు కాదని చెప్పారు. ఫిబ్రవరి 21న నిరసన తెలుపుతున్న రైతులకు, భద్రతా సిబ్బంది మధ్య జరిగిన ఘర్షణలో మరణించిన భటిండా నివాసి శుభకరన్ సింగ్(21) మరణంపై దర్యాప్తు చేయటానికి ఏర్పాటు చేసిన దర్యాప్తు ప్యానెల్‌పై కూడా దల్లేవాల్ ప్రశ్నలు లేవనెత్తారు.

హయ్యర్ పెన్షన్‌లో అవరోధాలెన్నో

- దేశవ్యాప్త ఆందోళనలు తప్పవు
- ఈపీఎఫ్ సొమ్మును షేర్‌మార్కెట్లలో పెట్టేందుకు కేంద్రం యత్నం : ఎస్‌డబ్ల్యూఎఫ్ సదస్సులో సీఐటీయూ జాతీయ కార్యదర్శి, ఈపీఎఫ్ఓ సీబీటీ సభ్యులు ఆర్ కరుమలయన్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

హయ్యర్ పెన్షన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ ట్రస్ట్‌లు అనేక అవరోధాలు సృష్టిస్తున్నాయని సీఐటీయూ జాతీయ కార్యదర్శి, ఈపీఎఫ్ఓ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీ (సీబీటీ) సభ్యులు ఆర్ కరుమలయన్ అన్నారు. ఈ సమస్య కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించింది కాదనీ, దేశవ్యాప్తంగా కార్మికలోకం మొత్తం ఎదుర్కొంటున్నదని తెలిపారు. పరిష్కారం కోసం దేశవ్యాప్త ఆందోళనలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దీనికి సంబంధించి కోల్‌కత్తాలో జరిగే సీఐటీయూ జాతీయ కౌన్సిల్ సమావేశంలో చర్చించి దేశవ్యాప్త పోరాట ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల సంయుక్తాధ్వర్యాన బుధవారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'సుప్రీంకోర్టు తీర్పు అమలు-హయ్యర్ పెన్షన్ సమస్యలు' అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పీఎఫ్ ట్రస్ట్‌లో రూ.25 లక్షల కోట్ల

కార్మికుల సొమ్ము జమ అయ్యిఉందనీ, వారి సొమ్మును వారికే ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్ఓ ట్రస్ట్‌లు అంగీకరించట్లేదన్నారు. ఎలాగైనా కార్మికుల పెన్షన్ ఎగ్గొట్టాలనీ, ఇచ్చే పెన్షన్లలో కోతలు పెట్టాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు అమల్లో కాలయాపన చేస్తూ, ఆన్‌లైన్ క్వెరీలు పెడుతూ, కార్మికులకు నష్టం చేస్తున్నారని వివరించారు. హయ్యర్ పెన్షన్ సమస్యల పరిష్కారం కోరుతూ జూన్ నెలాఖరు నాటికి ఈపీఎఫ్ఓ బోర్డుకు ఆరు లేఖల్ని రాసామని తెలిపారు. క్షేత్రస్థాయిలో సమస్యలు సృష్టించి, అంతా సక్రమంగా ఉందని అధికారులు భావిస్తే సరిపోదని హెచ్చరించారు. వేతన సవరణల అనంతరం పెన్షన్ పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈపీఎఫ్ఓ వద్ద ఉన్న రూ.25 లక్షల కోట్ల సొమ్ములో రూ.5వేల కోట్లను స్టాక్‌మార్కెట్ షేర్లలో పెట్టుబడులు పెట్టేందుకు కేంద్రం అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. దీనివల్ల లాభం సంగతి ఏమో కానీ, నష్టం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. భవిష్యత్ భారతదేశంలో రిటైర్ అయ్యే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందనీ, అప్పుడది సామాజిక సమస్యగా మారే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షనర్లు వారి కుటుంబసభ్యులపై ఆధారపడకుండా, గౌరవంగా బ్రతకడం కోసం పోరాటాల్లో భాగస్వాములు కావాలని కోరారు. హయ్యర్ పెన్షన్‌పై ఎస్‌డబ్ల్యూఎఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీలు అనేక సమస్యల్ని తమ దృష్టికి తెచ్చాయన్నారు. వాటి పరిష్కారం కోసం సీబీటీ బోర్డులో గళం విప్పుతాననీ చెప్పారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు మినహా మిగిలిన అన్ని పార్టీలు పెన్షన్‌కు వ్యతిరేకంగా ఉన్నాయనే విషయాన్ని గమనించాలని అన్నారు. కేవైసీలో సమస్యలను బోర్డు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అంతకుముందు టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు సదస్సులో ముసాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. పలు సమస్యల్ని ప్రస్తావించారు. సదస్సుకు ఏపీఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి జిలానీ పాషా, టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఏపీఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు సుందరయ్య, ఇరు రాష్ట్రాల ప్రచార కార్యదర్శులు పీ రవీందర్‌రెడ్డి, దొర తదితరులు పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాలకు
ఎస్ఎస్ఏ నిధుల నిలిపివేత
పీఎం-శ్రీ పథకానికి 'నో' చెప్పడమే కారణమా?

న్యూఢిల్లీ : పాఠశాల విద్యా కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు అందజేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) నిధులను కేంద్ర విద్యా శాఖ నిలిపివేసింది. రైజింగ్ ఇండియా (పీఎం-శ్రీ) పథకానికి సంబంధించిన ప్రధానమంత్రి పాఠశాలల్లో భాగస్వాములు అయ్యేందుకు ఆ మూడు రాష్ట్రాలు నిరాకరించడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ పథకం కోసం రాబోయే ఐదు సంవత్సరాల్లో రూ.27,000 కోట్లు ఖర్చు చేస్తారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాల్సి ఉంటుంది. పథకంలో భాగస్వాములయ్యేందుకు ఆసక్తి చూపే రాష్ట్రాలు కేంద్ర విద్యా శాఖతో కలిసి అవగాహనా పత్రం (ఎంఓయూ)పై సంతకాలు చేయాల్సి ఉంటుంది. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా దేశంలోని కనీసం 14,500 ప్రభుత్వ పాఠశాలలను 'ఆదర్శ' సంస్థలుగా తీర్చిదిద్దాలని ఈ పథకం కింద లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

తమిళనాడు, కేరళ, ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు ఎంఓయూపై ఇంకా సంతకాలు చేయలేదు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు తమ సమ్మతిని తెలుపగా మిగిలిన మూడు రాష్ట్రాలు నిరాకరించాయి. ఈ నేపథ్యంలోనే వాటికి ఎస్ఎస్ఏ నిధులను విద్యా శాఖ నిలిపివేసిందని తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలోని చివరి రెండు త్రైమాసికాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని తొలి



త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్) సంబంధించిన ఎస్-ఎస్ఏ వాయిదాలను ఈ రాష్ట్రాలకు విడుదల చేయలేదు. నిధులు విడుదల చేయాల్సిందిగా ఆయా రాష్ట్రాలు అనేక లేఖలు రాసినా, రిమైండర్లు పంపినా కేంద్రం పట్టించుకోవడం లేదు. గడచిన మూడు త్రైమాసికాలకు సంబంధించి ఢిల్లీకి రూ.330 కోట్లు, పంజాబ్‌కు సుమారు రూ.515 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు రూ.వెయ్యి కోట్లు అందాల్సి ఉంది.

ఆమ్‌ఆద్మీ పాలనలోని ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాలు ఇప్పటికే ఇలాంటి పథకాన్ని అమలు చేస్తుండడంతో పీఎం-శ్రీలో భాగస్వాములయ్యేందుకు విముఖత చూపాయి. పాఠశాల పేరుకు ముందు 'పీఎం-శ్రీ' అని తగిలించడాన్ని పశ్చిమ బెంగాల్ వ్యతిరేకించింది.

జమ్మూకాశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్
32 నెలల్లో అమరులైన 48 మంది జవాన్లు

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌లో మరో ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారవర్గాలు తెలిపాయి. కాగా దోడా జిల్లాలో సోమవారం ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మేజర్ సహా నలుగురు సైనికులు వీరమరణం పొందారు. ఉగ్రవాదుల కదలికలపై సమాచారం అందుకున్న రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు, రాష్ట్ర పోలీసులకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ దోడా పట్టణానికి 55 కిలోమీటర్ల దూరంలోని దెసా అటవీ ప్రాంతంలో సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఇరు పక్షాలు పరస్పరం తారసపడ్డాయి. ఈ సందర్భంగా 20 నిమిషాల పాటు భీకర పోరు సాగింది. కాల్పుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. ఆ తర్వాత ఉగ్రవాదులు పరారయ్యేందుకు ప్రయత్నించగా దళాలు వారిని వెంటాడాయి. ఈ క్రమంలో దట్టమైన అటవీ ప్రాంతంలో మరోసారి కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు సైనికులు తీవ్రంగా గాయపడగా వారిలో నలుగురు చనిపోయారు. పాకిస్తాన్ ప్రేరేపిత జైషే మహమ్మద్‌కు షాడో గ్రూపుగా పనిచేస్తున్న కాశ్మీర్ టైగర్స్ ఈ దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది. మృతుల్లో కెప్టెన్ బ్రిజేష్ థాపా, నాయక్ డి రాజేష్, సిపాయి బిజేంద్ర, సిపాయి అజయ్ నారూకా ఉన్నారని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ఈ నెల 9న కథువాలో సైనిక కాన్వాయ్‌పై దాడి చేసింది కూడా కాశ్మీర్ టైగర్లే. సంఘటనపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆరా తీశారు. చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆయనకు టెలిఫోన్‌లో పరిస్థితిని వివరించారు. తాజా ఘటనతో కలిపి జమ్మూ ప్రాంతంలో గత 32 నెలల్లో జరిగిన ఉగ్రవాద దాడుల్లో మొత్తం 48 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 9న కథువా జిల్లాలో సైనిక కాన్వాయ్‌పై ఉగ్రవాదులు దాడి చేయగా ఐదుగురు సైనికులు మరణించారు. మరో ఐదుగురు గాయపడ్డారు. గత నెల 11, 12 తేదీల్లో జరిగిన రెండు దాడుల్లో ఆరుగురు సైనికులు గాయపడ్డారు. గత నెల 9న యాత్రికులతో వెళుతున్న బస్సుపై ఉగ్రవాదులు దాడి చేశారు. ఈ ఘటనలో బస్సు ఓ వాగులో పడి తొమ్మిది మంది చనిపోయారు. 33 మంది గాయపడ్డారు. మే 4న పూంఛ్ జిల్లాలో రెండు వాహనాలపై ఉగ్రవాదులు దాడి చేయగా వైమానిక దళానికి చెందిన సైనికుడు చనిపోగా ఐదుగురు గాయపడ్డారు.

త్రిపురలో బీజేపీ హింసాత్మక దాడులను
ఖండించిన పొలిట్‌బ్యూరో



న్యూఢిల్లీ : త్రిపురలో పంచాయితీ ఎన్నికలకు ముందు అధికార బీజేపీ చేస్తున్న హింసాత్మక దాడులను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి సీపీఐ(ఎం), ప్రతిపక్షాల అభ్యర్థులు, వారి మద్దతుదారులపై బీజేపీ గూండాలు ఎడతెగని దాడులు చేస్తున్నారని విమర్శించింది. సీపీఐ(ఎం) అభ్యర్థులపైనా, వారి మద్దతుదారులపైనా క్రూరమైన దాడులకు పాల్పడుతూ నామినేషన్లను దాఖలు చేయకుండా బలవంతంగా అడ్డుకుంటు న్నారని తెలిపింది. ఈ నెల 13న బీజేపీ గూండాల చేతిలో దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్‌కు సీపీఐ(ఎం) అభ్యర్థి బాదల్ షిల్‌ను దారుణ హత్యకు గురయ్యారని తెలిపింది. బీజేపీ గూండాల క్రూరమైన దాడుల కారణంగా సీపీఐ(ఎం)కు చెందిన అనేకమంది నాయకులు, కార్యకర్తలు గాయపడి ఆసుపత్రి పాలయ్యారని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లోనూ పాల్గొనకుండా ప్రతిపక్ష నాయకులను బలవంతంగా అడ్డుకున్నారు, నామినేషన్ సమర్పించడానికి ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష అభ్యర్థిని చంపేస్తానని బీజేపీ నాయకులు బెదిరించారు, పోలీసు సిబ్బంది సమక్షంలోనే ప్రతిపక్ష నేతల వాహనాలపై దాడి చేశారని పొలిట్ బ్యూరో తెలిపింది.సీపీఐ(ఎం)కు ప్రముఖ నేతలపై పలు చోట్ల దాడులు జరిగాయని, పార్టీ ఊరేగింపులపై రాళ్లు రువ్వడం, పార్టీ నేతల నివాసాలపై బాంబులు విసిరిన ఘటనలు అనేకం రాష్ట్రంలో జరిగాయని తెలిపింది.రాష్ట్రంలో బీజేపీ గెలిచినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రతిపక్షాలను నిర్మూలించాలనే తన ఎజెండాను ఏకపక్షంగా పార్టీ కొనసాగిస్తోందని విమర్శించింది. 2018 నుంచి ప్రారంభమైన ఈ దాడుల్లో పార్టీకి చెందిన 30 మంది సభ్యులు, కార్యకర్తలు మరణించినట్టు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని బీజేపీ సృష్టించిందని తెలిపింది. ఆగస్టు 8న జరిగే ఎన్నికలకు అభ్యర్థులందరూ నామినేషన్లు దాఖలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పొలిట్ బ్యూరో డిమాండ్ చేస్తోంది.

ఎన్టీఏ మెరుగుదలపై 37 వేల సూచనలు



న్యూఢిల్లీ : నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) పనితీరును మెరుగుపరచే విషయంపై ఇస్రో మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో ఏర్పడిన ఉన్నతస్థాయి పరీక్షా సంస్కరణల కమిటీకి 37 వేలకు పైగా సూచనలు అందాయి. పరీక్షల ప్రక్రియ, డాటా సెక్యూరిటీ ప్రొటోకాల్స్, ఎన్టీఏ కార్యకలాపాలను సమీక్షించి సంస్కరణలను సిఫార్సు చేసేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఎన్టీఏ పనితీరుపై నెలకొన్న ఆందోళనలను ఈ కమిటీ పరిశీలిస్తుంది.

కమిటీకి విద్యార్థుల నుండి ఎక్కువ సలహాలు వచ్చాయి. పరీక్షల ప్రక్రియకు సంబంధించిన వివిధ కోణాలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రేస్ మార్కులు, పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. మైగవ్ వేదిక ద్వారా గత నెల 27 నుండి ఈ నెల 7వ తేదీ వరకూ సూచనలు స్వీకరించారు. వైద్య కళాశాలల్లో ప్రవేశ పరీక్షలు (నీట్), పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష (నెట్)లో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలను పరిశీలించేందుకు ఈ కమిటీ ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్, నీట్ పీజీ పరీక్షలను రద్దు చేసిన విషయం తెలిసిందే. అవకతవకలపై ప్రస్తుతం సీబీఐ విచారణ జరుపుతోంది. కాగా ప్రశ్నాపత్రాల రూపకల్పనకు సంబంధించి ప్రస్తుతం అమలులో ఉన్న సెక్యూరిటీ ప్రొటోకాల్స్‌ను, ఇతర పరీక్షా పద్ధతులను మదింపు చేసే బాధ్యతను కూడా కమిటీకే అప్పగించారు. కమిటీలో విద్యావేత్తలు సహా పలువురు సభ్యులకు చోటు కల్పించారు. దేశంలోని కోచింగ్ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కూడా కొన్ని సిఫార్సులు చేసింది.

రైతు రుణమాఫీ హర్షణీయం



నవతెలంగాణ-అంబర్‌పేట

రైతులకు రుణమాఫీ చేయడం హర్షించ దగ్గ విషయమని బీసీ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. రుణమాఫీ చేసినందుకు ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు దృష్టి సారించాలని కోరారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహమ్మద్ ఆల్ అజ్రీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహమ్మద్ ఆల్ అజ్రీ అన్నారు. నియోజకవర్గం యూత్ జనరల్ సెక్రటరీ సంతోష్ గౌడ్ ఆధ్వర్యంలో లంగర్ హౌజ్ డివిజన్ కు చెందిన యువకులు దుర్గ ప్రసాద్, దినేష్ కుమార్, శశి, అరుణ్ కుమార్, కార్తీక్ తదితరులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువాతో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తుందన్నారు. వాటితోనే పార్టీలోకి వస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శంకర్, కార్వాన్ డివిజన్ ప్రెసిడెంట్ జగన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సంస్థలుతో సమావేశం ఏర్పాటు



- రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

నవతెలంగాణ-కల్చరల్

సాంస్కృతిక సంస్థలుతో తొందరలో సమావేశాన్ని సంబంధిత మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి ఏర్పాటు చేసి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై తెలంగాణ కల్చరల్ వెల్ఫేర్ సొసైటీ వార్షిక వేడుకలు జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళాకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంలో సోసిటీ పక్షాన వినతి పత్రాన్ని గాయని ఆమనితో కలసి వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు అందజేశారు. వేదిక పై గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, రసమయి సంస్థ డాక్టర్ రాము, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటి దామోదర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి తొలుత ఆమని సుభాష్ పద్మశ్రీ తదితరులు దాశరథి సినారె జయంతి వేడుకలు పురస్కరించుకొని వారు రాసిన పాటలు మధురం గా ఆలపించారు.

మొహర్రం సందర్భంగా భోజన ప్యాకెట్ల పంపిణీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

కర్బలా మైదానంలో ధర్మ పరిరక్షణ కోసం హాజరత్ ఇమామే హుస్సేన్ తన కుటుంబంలోని 72 మంది పోరాడుతూ అసువులు బాసిన అమరులను స్మరిస్తూ ముస్లిం సోదరులు ఇవాళ నిర్వహించిన మొహర్రం పదవ సంతాప దినంను పునస్కరించుకొని మదీనా చౌరస్తా వద్ద మొహమ్మద్ క్యాప్ మార్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు షార్బత్, ఐస్ క్రీం, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు.



ఆషాఢ మాసం బోనాల పండుగను పురస్కరించుకొని భాగ్యనగర ఉమ్మడి దేవాలయ ఊరేగింపు కమిటీ చైర్మెన్‌గా నియమితులైన గాజుల అంజయ్యను ఘనంగా సన్మానించారు. సన్మానించిన పురానపుల్ డివిజన్ కార్పొరేటర్ నాయకులు అభిషేక్ రాజ్ సక్సేన శ్రీనివాస్ గౌడ్, రాజు, దినేష్

నవతెలంగాణ-ధూల్ పేట్



బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కృష్ణయ్య బీసీ నాయకులతో కలిసి తొలి ఏకాదశి సందర్భంగా తిరుమల వెంకన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవతెలంగాణ-ముషీరాబాద్



పాతబస్తీ జంగంమెట్ అంబేద్కర్‌నగర్ నాగులబండ బస్తీలో నీటి సౌకర్యార్థం పవర్ బోర్ ప్రారంభించిన బీజేపీ ఎస్సీ మోర్చా నగర ప్రధాన కార్యదర్శి బోయిని విజయ్ కుమార్, స్థానికులు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీలో ప్రశాంతంగా మొహర్రం..

- పోలీసుల భారీ బందోబస్తు..







నవతెలంగాణ-ధూల్‌పేట్

మొహర్రం సంతాప దినాలను పురస్కరించుకొని బుధవారం పాతబస్తీ వీధులలో నిర్వహించిన 'బీబీకాఆలం' భారీ ఊరేగింపు అశ్రునయనాల నడుమ ప్రశాంతంగా ముగిసింది. షియా ముస్లిం యువకులు నల్లటి దుస్తులు ధరించి సంతాప సూచికంగా నిర్వహించిన మాతంతో విషాదచాయలు అలుముకున్నాయి. హజ్రత్ ఇమాం హుస్సేన్‌ను స్మరించుకుంటూ చిన్నారులు, యువకులు, వయోవృద్ధుల వరకు చేతులకు బ్లేడ్లను అమర్చుకొని ఎదపై బాదుకుంటూ రక్తం చిందించారు. ఇస్లాం మతం పరిరక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన హజ్రత్ ఇమాం హుస్సేన్, హసన్లను స్మరిస్తూ వేలాది మంది యువకులు విషాద గీతాలు ఆలపిస్తూ ముందుకు సాగారు. దారి పొడవునా ఏర్పాటు చేసిన స్వాగత వేదికలపై నుంచి పలువురు అధికార, అనధికార ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు అంబారీపై ఊరేగిన బీబీకా ఆలంకు పూలు, దట్టీలను సమర్పించారు. డబీరురా బీబీకా అలాం నుంచి ప్రారంభమైన భారీ ఊరేగింపు షేక్ఫేజ్ కమాన్, యాకుతురా దర్వాజా, ఎతేబార్ చౌక్, కోట్ల అలిజా చార్మినార్, గుల్జార్హౌజ్, పంజెషా, కద్మే రసూల్, ఎతేబార్చౌక్, మీరాలం మండి. పురానీహవేలీ, రుషిషా, మసిదే ఇమామియా, మసిదే ఇలాహిల మీదుగా ఛాదర్ ఘాట్ వరకు కొనసాగింది.

భారీ బందోబస్తు..

పదో మొహర్రం రోజు సందర్భంగా మంగళవారం నిర్వహించిన 'బీబీకా ఆలం' ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పాతబస్తీలో 2500 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాలు చేశారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. డబీర్‌పూరలోని 'బీబీ కా ఆలం' నుండి అలకరించిన ఏనుగుపై ఉంచిన 'ఆలం' ఊరేగించారు. ఊరేగింపు పొడవున సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించారు. అడుగడుగునా అదనపు బలగాలను మొహరించిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డితో పాటు పలువురు పోలీసులు అధికారులు బీబీకా ఆలంకు స్వాగతం పలికి పూలు, దట్టీలు సమర్పించారు. ఈసందర్భంగా వారు సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మొహర్రం ఊరేగింపునకు ప్రభుత్వం తరుపున అన్ని సహయ సహకరాలు అందించారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పోలీసులు భారీ బందోస్తు ఏర్పాటు చేశారన్నారు. ఈసందర్భంగా పోలీసులకు ప్రత్యేక ధన్యవాదలు తెలిపారు. ఈకార్యక్రమంలో అడిషనల్ సీపీలు విక్రమ్‌సింగ్ మాన్, విశ్వప్రసాద్, సౌత్‌జోన్ డీసీపీ స్నేహ మెహ్రాతో పాటు పలువురు పోలీసులు అధికారులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

'భూదాన యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి చేస్తా'

భూదాన రామచంద్రారెడ్డి 119వ జయంతి సభలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జి.చిన్నారెడ్డి



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భూదాన యజ్ఞ బోర్డు పునరుద్దరణ, అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి భూదాన బోర్డుకు అప్పగించడం, భూదాన భూములను పంపిణీ చేసే విషయాలను సీఎం ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి చెప్పారు. భూదాన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం, ఉద్యమ అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలలో పొందుపర్చడం, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఇతర ముఖ్యమైన ప్రాంతాలలో అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేసే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఆయన తెలిపారు. భూదాన ఉద్యమానికి బీజం వేసిన భూదాన్ (వెదిరె) రామచంద్రారెడ్డి 119వ జయంతి సభ బుధవారం హైదరాబాద్‌లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించారు. భూదాన (వెదిరె) రామచంద్రా రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ వెదిరె ప్రబోద్ చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ చిన్నారెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ ఎ.నరసింహారెడ్డి, తెలంగాణ భాషా, సాంస్కృతిక మండలి చైర్మన్ డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, ఆలిండియా సర్వసేవా సంఘ్ మేనేజింగ్ టస్టీ మహాదేవ్ విద్రోహి, అఖిల భారత సర్వసేవ సంఘ్ జాతీయ అధ్యక్షులు వెదిరె అరవింద్ రెడ్డి, కార్యదర్శి ఎ.రవీంద్రాచారి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ టి.కృష్ణా గౌడ్, అతిథులుగా అమరవీరుల వారసులు భీంరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మల్లు కరుణ, ఆరుట్ల శ్రీకాంత్, చిట్యాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ మహోన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన భూదాన యజ్ఞ బోర్డును పునర్ నిర్మించడం వల్ల ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి చొరవ తీసుకుని నల్లగొండ జిల్లాలోని పలు గ్రామాల్లో బెల్టు షాప్‌లను తొలగింపజేయడం అభినందనీయమన్నారు. అనంతరం మహాదేవ్ విద్రోహి మాట్లాడుతూ అన్యాక్రాంతామవుతున్న భూదాన భూములను పరిరక్షించి భూదాన్ యజ్ఞ బోర్డుకు అప్పగించాలని, తద్వారా మిగిలి ఉన్న భూదాన భూములను మూడేళ్లలో పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. వెదిరె అరవింద్ రెడ్డి మాట్లాడుతూ భూదాన ఉద్యమం అప్పటి దేశ రాజకీయాల పరిస్థితిని మర్చివేసిందన్నారు. డాక్టర్ ఎ.నరసింహారెడ్డి మాట్లాడుతూ భూదాన రామ చంద్రా రెడ్డి లాంటి వారు భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రగతిశీల ఆలోచనలు చేశారన్నారు.దేశ స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన అనేక భూచట్టాలలో లోపాలు లేవని, వాటిని పటిష్టంగా అమలు చేయించుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు.

హస్తకళలు, చేతి వృత్తులు, చేనేత కళలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం హస్తకళలు, చేతి వృత్తులు, చేనేత కలలుకు ప్రోత్సాహం అందిస్తుందని బీసీ సంక్షేమ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ముషీరాబాద్ లోని హస్తకళా భవన్‌లో హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నాయడు సత్యనారాయణ గౌడ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు చేప ట్టిన నాయడు సత్యనారాయణ గౌడ్‌కు హార్దిక శుభాకాం క్షలు తెలియజేశారు. హస్తకళల కార్పొరేషన్ 2013లో ఏర్ప డినప్పటికీ 2015 నుండి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించు కున్నాం. క్షేత స్థాయిలో కళా నైపుణ్యం వారిని వృత్తులకు ప్రోత్సహిస్తూ వారికి మార్కెటింగ్ సౌకర్యానికి వేదికగా ఈ సంస్థ ముందుందని తెలిపారు. హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ ద్వారా రాష్టానికి 61 కోట్ల టర్నోవర్ చేస్తుంది. దానిని 600 కోట్ల టర్నోవర్‌కు తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అతిథులకు బయట దేశం, బయటి రాష్ట్రం నుండి వచ్చే అతిథులకు బహుమానలు ఇస్తుంటారు. చేనేత వృత్తులకు ప్రోత్సహించడానికి చేనేత వస్త్రాలను ప్రభుత్వం తరుపున వివిధ సంస్థలకు ఇవ్వడానికి జీవో నెంబర్ 1 ద్వారా టెస్కో ద్వారా కొనుగోలు చేస్తుంటారన్నారు. సీఎం ఆర్థిక మంత్రితో మాట్లాడి హస్తకళలు సంబంధించినవి వచ్చినప్పుడు ఈ కార్పొరేషన్ నుండి తయారు చేసినవి మాత్రమే కొనుగోలు చేసేలా జీవో తీసుకొచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. హ్యాండ్ క్రాఫ్ట్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మెన్‌గా నాయడు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. హస్తకళలు సామాన్య ప్రజలతో కలిసి మమేకమై ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, ఎమ్మెల్యే కోరం కనకయ్య కంచర్ల గోపన్న సేవాసమితి అధ్యక్షులు మారగనీ శ్రీనివాస్, చైర్మెన్ సత్యనారాయణ గౌడ్ సతీమణి విజయ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'ప్రజల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న'

- తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ప్రజల హక్కుల కోసం పోరాడిన బహుజన వీరుడు పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకమని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ అన్నారు. తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా బుధవారం హైదర్ గూడలోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో సాయన్న చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండ ప్రకాష్ ముదిరాజ్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ జిల్లా, మెరుగొనిపల్లి గ్రామంలో పుట్టిన పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదలకు అండగా నిలిచి అన్నార్తులకు అన్నం పెట్టిన మహానుభావుడని కొనియాడారు. సాయన్న ఒక ప్రాంతానికి పరిమితం కాదని, ఆయన ఖ్యాతిని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బహుజన వర్గాలపై ఏ వర్గాలు అధిపత్యం చెలాయిస్తున్నాయో గుర్తించి దాన్ని ఎదుర్కొనేందుకు చదువు ఎంతో ముఖ్యమని సాయన్న సందేశం ఇచ్చారని గుర్తు చేశారు. సాయన్న జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, యాదగిరి, కార్యనిర్వహక కార్యదర్శి కనకయ్య, కృపాసాగర్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు పండుగ బాలు, రాష్ట్ర కో-ఆర్డినేటర్ బొక్క శ్రీను ముదిరాజ్, నాయకులు రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అంబర్‌పేట ప్రేమ్ నగర్‌లోని శ్రీ వీర అభయాంజనేయ స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో కనుల పండుగగా ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పురోహితులు ఆచార్య ఆత్రేయ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బీసీ విద్యార్థి విభాగం నాయకులు రాజశేఖర్ గంగా పుత్ర పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని దేవదేవుని ప్రార్థించినట్లు తెలి పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అంబర్‌పేట నియోజక వర్గం జాయింట్ కన్వీనర్ మైలారం రాజు పాల్గొన్నారు.

'పేట్లా బుర్జ్' ఆస్పత్రిలో త్వరలో టెలి మెడిసిన్

- సంతాన సాఫల్య, క్యాన్సర్ స్క్రీనింగ్ చికిత్సలు
- వైద్య పరీక్షలు, మందులు బయటికి రాస్తే చర్యలు
- సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ





నవతెలంగాణ-ధూల్ పేట్

కార్పోరేట్ ఆస్పత్రి వైద్యులు, టీవీ, సోషల్ మీడియాలో ఫోన్ ద్వారా రోగుల సమస్యలు, వాటి సలహా సూచనలు చూశాం. ప్రస్తుతం పేట్లా బుర్జ్ ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. అనుభవజ్ఞులైన వైద్యులచే సలహా, సూచనలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పేదలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు కృషి చేస్తున్నారు. ప్రత్యేకంగా మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ కసరత్తు చేపట్టారు. పేట్లా బుర్జ్ ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి శ్రీకారం చుట్టింది. ఆస్పత్రిలో త్వరలో టెలి మెడిసిన్ ఏర్పాటు చేస్తున్నారు. రోగులు వారి సమస్యలను నేరుగా ఫోన్‌లోనే డాక్టర్లతో మాట్లాడి సలహా సూచనలు తీసుకొని తగు జాగ్రత్తలు తీసుకునేలా కృషి చేస్తున్నారు. పిల్లలు కాలేదని సంతాన సాఫల్య పేరుతో ప్రస్తుతం కార్పొరేట్ ఆస్పత్రులకు రోగులు లక్షలు ఖర్చు చేస్తున్నారు. వాటిని ఖర్చు పెట్టలేక వెనుకబడి, నిరుత్సాహనికి గురవుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు. దీంతో సగటు మనుషులు కూడా కుటుంబంతో సంతోషించేందుకు పేట్లా బుర్జ్ ఆస్పత్రి శుభ పరిణామం పలుకుతుంది. దీంతో ఎన్నో కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో అందరికి అందుబాటులో ఉండేలా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. త్వరలో మెడిసిన్ కేంద్రం ఏర్పాటు చేసి రోగులకు ఫోన్ ద్వారా వారి సమస్యలను తెలుసుకొని నివారణకు సూచనలు అందించేలా అందుబాటులో వైద్యులను ఉంటారన్నారు. వైద్యుల సలహా మేరకు సూచన మేరకు వైద్య సేవలు పొందేలా ఆరోగ్యాన్ని కాపాడుకునేలా కావాల్సినటువంటి ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో త్వరలో ఐవీఎఫ్ సంతాన సాఫల్య కేంద్రంతో పిల్లల కోసం మరింత మెరుగైన అనుభవజ్ఞ వైద్యులచే వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోజులకు అన్ని రకాలైనటువంటి వైద్య పరీక్షలు, మందులు ఉచితంగానే ఆస్పత్రిలో అందుబాటులో అందిస్తున్నామని వివరించారు. గర్భిణీ మహిళలకు టీఫా స్కాన్ ఇతరత్రా శాస్త్ర చికిత్సలు, ఫ్యామిలీ ప్లానింగ్ ఇతర మహిళ సమస్యలపై అన్ని రకాల పరీక్షలు మందులు అందిస్తున్నామని తెలిపారు. ఎవరు కూడా బయట డబ్బులు ఖర్చు పెట్టి వైద్య పరీక్షలు, మందులు తీసుకోకూడదని సూచించారు. మెడిసిన్ సప్లై లో వస్తున్న ఆరోపణ లో ఎలాంటి అవకతవకలు లేవని ఆమె పేర్కొన్నారు. టీఎస్ఎంఐడీసీ తో సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుండి ఈ ఔషధ ద్వారా మెడిసిన్ సరఫరా జరుగుతుంద న్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మెడిసిన్లు సర్జికల్ పరికరాలు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇవన్నీ సెంట్రల్ రైల్వే స్టేషన్ ద్వారానే సరఫరా కొనసాగుతుందని సూచించారు. ఆస్పత్రిలో రోగులతో డబ్బులు వసూలు చేసిన బయటకు మందులు, పరీక్షలు రాసిన తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎంఓ బాబు నాయక్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆర్ఎంవో బాబు నాయక్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ బస్ డిపోలో చార్మినార్ డివిజన్ డిప్యూటీ ఆరంభగ బాబు నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లకు డ్రైవర్లకు నగదు పారితోషకాన్ని అందించారు. ఆర్టీసీ ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు మ్యూజికల్ చైర్స్ షటిల్ బ్యాట్మెంటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డిపో అభివృద్ధి కోసం ఆర్టీసీ లాభాల్లో తీసుకొచ్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. ముషీరాబాద్ డిపో మేనేజర్ కిషన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణి, ఏఎంఈ చందర్, ఏఎంపీ జ్యోతిక, తదితరులు పాల్గొన్నారు.



మొహరం పండుగ సందర్భంగా మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలో గల ఇందిరానగర్ కాలనీలోని పీర్లకొట్టం సందర్శించి ఉత్సవాలలోస్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుందారపు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా



లైన్స్ క్లబ్ ఆఫ్ కమలానగర్ స్పూర్తి 20వ ఇన్‌స్టాలేషన్‌ను డా.ఎ.ఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ హై టెన్షన్ లైన్‌లో ఉన్న ఎం.వి.ఆర్ కన్వెన్షన్ హాల్లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ ఫస్ట్ వైస్ గవర్నర్ కె.ఇన్నారెడ్డి విచ్చేసి ప్రసంగించారు. లైన్స్ క్లబ్ అధ్వర్యంలో నిరంతరాయంగా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పేదలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. చార్టర్ ప్రెసిడెంట్‌కు మాజీ కార్పొరేటర్ పావని మైపాల్ రెడ్డి కుమార్తె కాశ్యపి రెడ్డి తన మొదటి వేతనాన్ని తండ్రి లేని నిరుపేదలైన విద్యార్థులకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేశారు. కాష్యపీ రెడ్డి తన తండ్రి పేరు మీద చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటుచేసి సేవా దక్పథంతో ముందుకు సాగుతున్న ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో సికింద్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ కల్లెం కష్టారెడ్డి, డీసీఎస్ శేఖర్ రెడ్డి ఆర్‌సీ రాజేష్ చౌదే, జెడ్పీ రమాదేవి,ప్రెసిడెంట్ భాస్కర్ రెడ్డి ,సెక్రటరీ రాజేంద్రప్రసాద్ రాజు ,ట్రెజరర్ నరేష్ కుమార్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కాప్రా

మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన అజయ్



- ప్రజాపాలన అందించాలని పలువురి హితవు
- తై బజార్ రద్దుపైనే తొలి సంతకం

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ బుధవారం తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం బోడుప్పల్‌లో చిరు వ్యాపారులు ఎదుర్కుంటున్న తై బజార్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి గాను బోడుప్పల్ కార్పొరేషన్‌లో తై బజార్ వ్యవస్థను రద్దు చేస్తున్నట్టు సదరు ఫైల్ పై తొలి సంతకం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డిలు మాట్లాడుతూ ప్రజా పాలనపై దృష్టి సారిస్తామని అన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కమిషనర్ రామలింగం, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో పాటు కాంగ్రెస్ కార్పొరేటర్లు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్‌గా తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్‌లు వారి ఛాంబర్‌లతో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు మంద్ల సురేష్ హాజరై నూతనంగా బాధ్యతలు చేపట్టిన మేయర్, డిప్యూటీ మేయర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు.



కండ్ల ముందే బహుళ అంతస్తులు..

- అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శలు
- ఖజానాకు భారీ గండి.. నిధుల లేమితో ఇబ్బందులు

నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కళ్లముందే అనుమతులు లేకుండా అనేక బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్న అధికారులకు, కార్పొరేటర్లకు పట్టింపు లేకుండా పోతుందని విమర్శలు వెలువెత్తుతున్నాయి. అనుమతి లేని నిర్మాణాలు ఎన్ని జరిగినా అధికారులకు కనపడక పోవడం ఆశ్చర్యకరంగా ఉందని, అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కాలనీల ప్రజలు ఫిర్యాదులు చేస్తే అధికారులు తూతూ మంత్రంగా మొదటి నోటీస్, రెండో నోటీస్ ఇచ్చి చేతులు దులుపుకుం టున్నారే తప్పా వాటిని ఆపడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అక్రమ నిర్మాణ దారులు అంతలోనే దర్జాగా పూర్తిచేసుకొని గృహ



ప్రవేశాలు చేస్తున్నారని.. ఇదేంటని అధికారులను నిలదీస్తే దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. ఇది టౌన్ ప్లానింగ్ అధికారుల పట్ల అనేక అనుమానాలకు తావిస్తుందని ప్రజలు వాపోతున్నారు.

నగర పరిధిలోని 21 డివిజన్ పరిధిలో ఇసుక లారీల అడ్డా వద్ద అనుమతి లేకుండా పాత ఇంటిపై నాలుగు అంతస్తులు నిర్మాణం చేపట్టారని.. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా నోటీసులతో సరిపెట్టారే తప్పా ఏ రోజు పని ఆపి పర్మిషన్ అడిగిన ధాఖలాలు లేవని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికి బిల్డింగ్ మొత్తం పూర్తి కావడానికి వచ్చిందని వారు చెబుతున్నారు. ఇక 14వ డివిజన్ మేడిపల్లి ప్రధాన రహదారిలో సబ్ రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేసినా పని ఆపలేదని, 26వ డివిజన్ పరిధిలో ఉప్పల్ డిపో నుండి బండి గార్డెన్ రోడ్డులో పీర్జాదిగూడ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌లో అపార్మెంట్ నిర్మిస్తున్నారని, చెరువులలో నిర్మాణాలు చేపట్టడం ఏంటని ప్రశ్నిస్తే తాము పర్మీషన్ ఇవ్వలేదు హెచ్ఎండీఏ ఇచ్చిందని అధికారులు చెబుతున్నారన్నారు. అయితే స్థానికంగా ఉన్న కార్పొరేషన్ అధికారులు ఎన్వోసి ఇవ్వకుండానే నిర్మాణం ఎలా చేపడుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. వర్షాకాలంలో చెరువులో నీరు పోవడానికి నిల్వ ఉండడానికి లేకుండా నిర్మాణాలు చేపడితే భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు తప్పేలా లేవని..వీటన్నింటిపై పీర్జాదిగూడ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకొని, రావల్సిన ఆదాయాన్ని సమకూర్చి ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నిర్మాణాలను ఇరిగేషన్ అధికారులు కూల్చి వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

అనుమతి లేని నిర్మాణాలపై చర్యలు తప్పవు..

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో అనుమ తులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై తప్పకుండా చర్యలుంటాయి. ఇప్పటికే అనుమ తులు లేని నిర్మాణాలకు నోటీస్‌లు జారీ చేశాము. టీఎస్‌బీ పాస్ ప్రకారం అనుమతులు తీసుకోవాలని కూడా అనేక సార్లు సూచనలు చేశాము. ఇన్ని అవకాశాలు ఉన్న కూడా కొందరు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారు. అలా చేపట్టిన నిర్మా ణాలపై తప్పకుండా చర్యలు ఉంటాయి.

-కమిషనర్ త్రిలేశ్వర్ రావు, పీర్జాదిగూడ కార్పొరేషన్.

ప్రభుత్వ విద్యాసంస్థలను కలెక్టర్ పర్యవేక్షించాలి



- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శు లు జి.కార్తీక్, రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-కాప్రా

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రభుత్వ విద్యాసంస్థలు, గురుకుల హాస్టళ్లను పర్యవేక్షణ చేయాలని, విద్యారంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.కార్తీక్, రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అద్దె భవనంలో నడుస్తున్న గురుకుల హాస్టల్స్‌కు సొంత భవనాలు నిర్మించాలని, ఒకటే బిల్డింగ్‌లో షిఫ్ట్ వైస్‌గా నడుపుతున్న జూనియర్, డిగ్రీ కళాశాలలను వేరువేరు భవన్‌లో పూర్తిస్థాయిలో కళాశాలలు నడపాలని కోరారు. జిల్లాలో గురుకుల హాస్టల్స్ అద్దె భవనంలో అరకొర వసతులతో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఈ మధ్యకాలంలో గురుకుల హాస్టళ్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థుల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని తెలియడం లేదన్నారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఒకటే బిల్డింగ్‌లో షిఫ్ట్ వైస్‌గా నడుస్తున్నాయని తెలిపారు. మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్‌లలో షిఫ్ట్ వైస్‌గా కళాశాలలు నడుపుతున్నారని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో బుక్స్, యూనిఫామ్, టై, బెల్టు విద్యార్థులకు సరిపడా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం యథావిధిగా కొనసాగించాలని, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ విద్యారంగంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా బందం ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు.సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వంశీ, అరుణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అవినాష్, తదితరులు ఉన్నారు.

పండగ సాయన్న జయంతి వేడుకలు



నవతెలంగాణ-ఘట్కేసర్

అంకుషాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా వీరుడు, సామాజిక బహుజన ఉద్యమ నేత పండగ సాయన్న ముదిరాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాలు అర్పించారు. ఈ సందర్భంగా అంకుషపూర్ ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ రాజ్యంలో అవినీతి, దోపిడీ, లైంగిక దాడులు పెరిగినప్పుడు ప్రజల నుంచి వీరులు ఉద్భవిస్తారని పేర్కొన్నారు. సాయన్న పేదలకు దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా సుపరిచితుడు అన్నారు. తన సొంత పాలనా వ్యవస్థను స్థాపించుకొని, ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించిన వీరుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గేటు నవీన్, కార్యదర్శి చిలుక గణేష్, కోశాధికారి పెంట శ్రీను, మెడబోయిన ఉపేందర్, మెడబోయిన అరుణ్, మెడబోయిన బాలి, గుండ్ల సాయికుమార్ పాల్గొన్నారు.

ఓల్డ్ సఫిల్ గూడలో సాయన్న జయంతి

మల్కాజిగిరి :పండగ సాయన్న జయంతి సందర్భంగా బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీసీ కులాల ఐక్య వేదిక అధ్యక్షులు కామల్ల ఐలన్న, మల్కాజిగిరి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చెరుకు సాంబరాజ్ ముదిరాజ్, బీసీ కులాల ఐక్య వేదిక ఉపాధ్యక్షలు బత్తిని నర్సిహ్మా గౌడ్, ప్రధాన కార్యదర్శి రొయ్యల కష్ణమూర్తి, ఉపాధ్యక్షులు జినుకుంట్ల రమేష్ గౌడ్, ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి బొల్లు సంపత్ ముదిరాజ్, కోశాధికారి దండు ప్రసాద్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



కులమతాలకతీతంగా మొహరం పండుగ



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలో బుధవారం మొహర్రం వేడుకలు కులమతాలకతీతంగా ఘనంగా జరుపుకున్నారు. మేడ్చల్ పట్టణంలోని ఇమామ్ ఖాసిం అశుర్ఖానా మేనేజింగ్ కమిటీ అధ్యక్షుడు ఖాజా ఖాలీలుద్దీన్ ఆధ్వర్యంలో అన్నదానం, షరాబత్ పంపిణీ చేసి వీధుల్లో పీర్ల ఊరేగింపును నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లాయక్ అల్లీ,రఫిక్,ఎండీ హుస్సేన్ ఖురేషీ, బద్రుద్దీన్, ఖాజా మొయినుద్దీన్, ఏమ్ఏ ముఖ్తార్, మహమ్మద్ జమాల్, అబ్రార్, కౌన్సిలర్ కౌడే మహేష్, కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని రావల్ కోల్ గ్రామంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిండ్ల రాహుల్ యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని పీర్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లింలకు మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీటీసీ నాగమణి,గ్రామస్తులు రమేష్, యూసఫ్, విరేష్ నాయక్, మోహన్, శంకర్,రాహుల్,అర్జున్ పాల్గొన్నారు.

విహాన్ కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-జవహర్ నగర్

వీధి కుక్కలు దాడిలో మృతి చెందిన బాలుడు విహాన్ కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జవహర్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థానికులతో కలిసి ప్రతిపక్షాల నాయకుల ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా కుక్కల సమస్యతో, గంజాయి తీసుకునే వ్యక్తుల గురించి మున్సిపల్ అధికారులకు, స్థానిక నాయకులకు, పోలీస్ అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నామని తెలిపారు. అయితే వారు ప్రజా సమస్యలపై ఏ మాత్రం స్పందించకుండా ఉన్నందునే రెండు రోజుల క్రితం అంబేద్కర్ నగర్‌లో ఒక వ్యక్తిపై గంజాయి గాళ్లు దాడి చేశారని, ఇప్పుడు ఒక పసికందు పై కుక్కల దాడి చేశాయని మండిపడ్డారు. ఫిర్యాదు చేసినప్పుడే మున్సిపల్ అధికారులు, పాలకవర్గం స్పందించి ఉంటే ఇప్పుడు ఈ చిన్నారి ప్రాణాలు కోల్పోకుండా ఉండేవాడన్నారు. బాధిత కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీఆర్ఎస్, ప్రజాసంఘాల కాలనీ వాసులు, స్థానికులు పాల్గొన్నారు.

ఈ ఘటనపై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం నుండి అన్ని విధాల సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉండాలని స్థానిక బీజేపీ శ్రేణులను ఆదేశించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత..

బతుకుదేరువు కోసం వలస వచ్చిన కుటుంబం కుక్కల బెడదతో కన్నా కొడుకును కోల్పోవడం చాలా బాధాకరమని మేయర్ శాంతి కోటేష్ గౌడ్ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ అన్నారు. జవహర్‌నగర్‌లో కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడి కుటుంబ సభ్యులను బుధవారం ఓదార్చి రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు జమాల్ పూర్ నవీన్, కుతాడి సాయి, మేకల లలిత, మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నా రాజకీయ ఎదుగుదల చూసి ఓరువలేకే లేనిపోని ఆరోపణలు..

నవతెలంగాణ-ఘట్కేసర్

బంజారా సోదరులను తప్పు దోవ పట్టిస్తూ నాపై లేనిపోని ఆరోపణలు చేయిస్తున్న కొంతమంది రాజకీయ నాయకులకు తగిన గుణపాఠం తప్పదని ఎన్ఎఫ్‌సీ నగర్ రెండో వార్డ్ కౌన్సిలర్ కొమ్ము గోని రమాదేవి మైపాల్ గౌడ్ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రెండో వార్డ్‌లో బ్యూటీ నెక్స్ పార్కులో బంజారా సోదరులు కిందటి మంగళవారం సీత్ల పండుగ చేసుకున్నారని తెలిపారు. అయితే మంగళవారం మున్సిపాలిటీ సిబ్బంది బంజారా సోదరులు ఏర్పాటు చేసుకున్న దేవత విగ్రహాలను తొలగించినట్టు, తానే తొలగించినట్టు కొంతమంది రాజకీయ నాయకులు ఆరోపించారని తెలిపారు. కానీ ఆ తొలగింపునకు తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బంజారా సోదరులకు నాలుగేండ్లుగటా ఎంతో సపోర్టుగా ఉన్నానని తెలిపారు. తనపై ఎవరో దురుద్దేశంతో బంజారా సోదరులను ఉసిగొల్పి ఘట్కేసర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం ఎంతవరకు న్యాయమన్నారు. కొందరు తన రాజకీయ ఎదుగుదల గిట్టని వాళ్లు బంజారా సోదరుల్లో తనపై దురుద్దేశం నింపడం సరికాదన్నారు. తనపై ఫిర్యాదు చేసినప్పటికీ చట్టం తన పని తాను చేసుకుంటుందన్నారు. పోలీసులు పూర్తిస్థాయి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.



చర్లపల్లి-రాంపల్లి రోడ్డు పనులు ప్రారంభించాలి



- ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

పెద్ద చర్లపల్లి నుంచి రాంపల్లి వెళ్లే రోడ్డు పనులు ప్రారంభించాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆ రోడ్డును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోడ్డు గుండా రాంపల్లి చర్లపల్లికి రాకపోకలతో పాటు అటు అవుటర్ రింగ్ రోడ్డుకు వందలాది వాహనాలు నిత్యం ప్రయాణిస్తాయని తెలిపారు. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ, ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే రోడ్డు పనులను ప్రారంభించాలని కోరారు. లేదంటే త్వరలోనే ప్రజలతో కలిసి భారీ ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు డి. నాదం, రైల్వే బోర్డు (ఎస్‌సీసీ) మెంబర్స్ టెర్మినల్ సలహా మండలి సభ్యులు ఎం. లక్ష్మణ్ గౌడ్, కొమ్ము నర్సింగరావు, నాగమణి, బీజేపీ నాయకులు మునిగంటి సురేష్, గొంగళ్ళ మహేష్ తదితరులున్నారు.

తొలి ఏకాదశి సందర్భంగా అల్వాల్‌లోని పందరి నాథ ఆలయంలో దర్శనానికి భక్తులు బారులు తీరారు. బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. అల్వాల్ ఎసిపి అంబికా గౌడ్ వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-అల్వాల్



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



నవతెలంగాణ-కాప్రా

ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కార్యక్రమం బుధవారం ఈసీఐఎల్ చౌరస్తాలో ఇన్‌స్పెక్టర్ సైదయ్య, రమలక్ష్మణ్ రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్ యూనియన్లతో చర్చించి, "ఫ్రీ లెఫ్ట్" లేన్‌లను అడ్డగించకుండా ఉంచడం, అనధికారిక వాహనాలు పార్క్ చేయకుండా చూడాలని స్పష్టం చేశారు. అదేవిధంగా కుషాయిగూడ బస్‌స్టాప్ వద్ద పూలు, పండ్ల వ్యాపారులను సంప్రదించి, వారి బండ్లను బస్ స్టాప్‌లో పార్క్ చేయకూడదని సూచించారు.ఈ చర్యలు రోడ్డు ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నిర్వహించడానికి, వాహనాల సాఫీగా సాగేందుకు సహాయపడతాయని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ భాస్కర్, ఏఎస్ఐ నర్సింహులు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్‌లో కేదార్‌నాథ్ ఆలయానికి శంకుస్థాపన..



నవతెలంగాణ-మేడ్చల్

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఉన్న కేదార్‌నాథ్ ఆలయాన్ని తెలంగాణలో నిర్మించబోతున్నారు. ఇందుకు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమాన్ని బుధవారం మేడ్చల్ మండల పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉత్తరాది రాష్ట్రానికి చెందిన పీఠాధిపతులు జగద్గురు శంకరాచార్యులు, కమల్ నారాయణ దాసు మహారాజ్ సమక్షంలో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు, మేడ్చల్ డివిజన్ ఏసీపీ బి.శ్రీనివాస్ రెడ్డిలు ప్రత్యేక పూజలు చేసి నిర్వాహకులకు అభినందనలు తెలిపారు.కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి,ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, గ్రామస్తులు మేకల రామకష్ణుడు,కుమార్ యాదవ్, నాగచారి, శ్రీనివాస్, లింగం, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ వాసులతో మమేకమై అభివృద్ధి చేసుకోవాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కాలనీవాసులు ప్రజలతో, ప్రజాప్రతినిధులతో మమేకమై అభివృద్ధి చేసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ.ఈటెల రాజేందర్ సూచించారు. ఈ మేరకు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ న్యూ లాల్ బహదూర్ నగర్ నూతనంగా నియమితులైన సంక్షేమ సంఘం సభ్యులు, గాజులరామారం కార్పొరేటర్,గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరితో ఎంపీ.ఈటల నివాసం వద్ద కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులుగా నిలవాలని తన వంతు సహాయ సహకారాలు అందజేస్తారని ఎంపీ.ఈటెల వారితో పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షులు ప్రభాకర్ గుప్తా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి కోశాధికారి బాలస్వామి గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డమీద భరత్ కుమార్, ముత్యాల మహేష్ కుమార్, సలహాదారులు రాజాబ్రహ్మం,యాదవ్ రెడ్డి, వెంకటేష్, కాలనీ సన్నిహి తులు సత్యనారాయణ రాచకొండ కుమార్, జగదీష్ గుప్తా, తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

మహిళా కమిషన్ చైర్మెన్‌కు కార్పొరేటర్ శుభాకాంక్షలు..



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మెన్‌గా ఎన్నికైన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు నేరెళ్ల శారద గౌడ్‌ని, ఆల్విన్ కాలని డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌మహిళా వైస్ ప్రెసిడెంట్ దుర్గారాణి, శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కిషన్ రావు, బి.సి సీనియర్ నాయకులు ఎమ్.విఠల్, పోశెట్టిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ వరం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్, శ్రీరామ్ నగర్‌కు చెందిన ఆశ యాలిగర్ అనే మహిళకు మెదడులో రక్తం గట్టడంతో, శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. చికిత్స చేయించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆమె భర్త అశోక్ యాలిగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ని ఆశ్రయించాడు. వారిది నిరుపేద కుటుంబం కావడంతో మాజీ ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, రాష్ట్ర మంత్రి వర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ.2 లక్షల 50 వేల సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సదరు భాదిత కుటుంబానికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ - ఎవోసీ పత్రాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలి కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్వాడీ కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటనను స్వాగతిస్తున్నాం..



● సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రాష్ట్రంలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్‌ను రూ.50 వేల నుంచి రూ.2 లక్షలు త్వరలోనే పెంచుతామని పంచాయతీరాజ్ మంత్రి వర్యులు దనసరి అనసూయ(సీతక్క) ప్రకటించారు. సీపీఐ, ఏఐటీయూసీగా స్వాగతిస్తున్నామని కేవలం ప్రకటనల వరకే పరిమితం కాకుండా వెంటనే జి.ఓ.జారీ చెయ్యాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ సీపీఐ, ఏఐటీయూసీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ నేతలు పత్రిక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్,ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు కే.ఏసురత్నంలు మాట్లాడుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. కానీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్వాడీ కార్మికుల పై నిర్బంధం పెంచిందని,చివరికి ఎన్నికల సమయంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకట్ రెడ్డి అంగన్వాడీ సమస్యల పై అప్పటి ఆర్థిక మంత్రి హరీష్ రావ్‌తో అనేక సార్లు చర్చలు జరిపిన శూన్యమేనని అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి 6 నెలలు గడిచినా ప్రకటించక పోవడం వల్ల గత నెల రోజులుగా అంగన్వాడీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తుంటే స్పందించిన మంత్రి సీతక్క ప్రకటించడం ఇది ముమ్మాటికి అంగన్వాడీ కార్మికుల విజయమేనని అన్నారు. ప్రభుత్వ భూముల, చెరువుల పరిరక్షణ కొరకు ఏర్పాటు చేసిన హైడ్రా నేతృత్వంలో భూములు, చెరువుల కబ్జాలను అరికట్టాలన్నారు. నిన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరికిచెరువు, మహాదేవ పురంలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని.. చెప్పాడని సీపీఐ గా స్వాగతిస్తూ ఆ రెండు నిర్మాణాలే కాకుండా సర్వే నెంబర్ 348/1, వెంకటేశ్వర దేవలయ స్థలం, సర్వే నెంబర్ 326, 342, 329, 307, 119, ఆదే విదంగా ప్యాక్స్ సాగర్, గంధం చెరువు, అంబిర్ చెరువు, సురారం చెరువు చిన్న చితక చెరువులు అనేకం కబ్జా అయ్యాయని వాటి వివరాలను హైడ్రా కమిషనర్‌కు సీపీఐ ఆధ్వర్యంలో ఇస్తామని తెలిపారు. కబ్జాదారుల పై చర్యలు తీసుకొని వారి చేతిలో మోసపోయిన బాధితులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కోశాధికారి సదానంద, కార్యవర్గ సభ్యులు ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.హరినాథ్, మున్సిపల్ అధ్యక్షుడు చర్లపల్లి రాములు, శాఖ కార్యదర్శి సహదేవ్ రెడ్డి, ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు, ఏఐటీయూసీ నాయకులు సామెల్, రామస్వామి పాల్గొన్నారు.

మాకేదీ గుర్తింపు..?

● ఏండ్లపాటు పార్టీ కోసం కష్టపడ్డాం

● ఇతర పార్టీల వారిని చేర్చుకుని అన్యాయం చేయొద్దు

● కిందిస్థాయి నాయకత్వాన్ని ప్రోత్సహించాలంటున్న కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఏండ్లపాటు కేసులకు భయపడకుండా పార్టీని కాపాడుకున్న తమకు గుర్తింపు దక్కడం లేదని కిందిస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం పని చేసిన తమను కాదని.. అధికారంలోకి రాగానే కండువా కప్పుకున్న వారిని అందలమెక్కిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఏమాత్రం గుర్తింపు దక్కకుండా కొందరు నాయకులు అడ్డుపడుతున్నారని కాంగ్రెస్ నియోజకవర్గ, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. కొందరు నాయకులు ద్వితీయ, తతీయ శ్రేణి నాయకత్వాన్ని ఏ మాత్రం ప్రోత్సహించకుండా అంతా తామే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుసగా పదేండ్లపాటు అధికారం లేకున్నా.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత అణగదొక్కినా.. కేసులు పెట్టి వేధింపులకు గురిచేసినా.. ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ.. పార్టీని అధికారంలోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగామని కార్యకర్తలు చెబుతున్నారు. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ అహర్నిశలు కష్టపడ్డామని సదరు కార్యకర్తలు అంటున్నారు. తాము పార్టీ కోసం ఇంత కష్టపడితే అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్ నుంచి పలువురు కార్యకర్తలు, నాయకులను చేర్చుకునేందుకు కొందరు నాయకులు ఉత్సాహం చూపుతున్నారని సీనియర్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు గుర్తింపు ఇవ్వకపోగా ఇలా ఇష్టం వచ్చినట్టు చేరికలను ప్రోత్సహించేందుకు ప్రయత్నించడం మానుకోవాలని కోరుతున్నారు. అధికారం ఉన్న సమయంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలను ఇబ్బందులు పెట్టారని.. ఇప్పుడు వారే కాంగ్రెస్‌లో చేరేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొంటున్నారు. అలాంటి వారి విషయంలో నియోజకవర్గం, డివిజన్, మండల, గ్రామ స్థాయి నాయకులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. ఏకపక్షంగా చేరికలను ప్రోత్సహిస్తే గ్రూపులు పెరిగి పార్టీ దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని చెబుతున్నారు.

రానున్న ఎన్నికల్లో నష్టం జరిగే అవకాశం..!

బీఆర్ఎస్ నుంచి చేరికలను ప్రోత్సహిస్తే కాంగ్రెస్ లాభం జరగకపోగా నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పార్టీ శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. గ్రూపులు పెరిగి నిబద్ధత కలిగిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతుందనీ, దీంతో చివరకు పార్టీ సైతం అభాసుపాలవుతుందని చెబు తున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో సైతం పార్టీలో కోవర్టుల కారణంగా అనేక ఇబ్బందులు పడ్డామని వాపోతున్నారు. కోవర్టులకు చెక్ పెట్టడంతోపాటు, బయట పార్టీల నుంచి వచ్చే నాయకులు, కార్యకర్తలను చేర్చుకోకుండా ఉంటేనే ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేసే అవకాశముంటుందని అంటున్నారు. ఇతర పార్టీల నాయకులను చేర్చుకుంటే రానున్న మున్సిపల్, స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో టికెట్ల విషయంలో ఆశావహుల సంఖ్య పెరిగి గందరగోళ పరిస్థితులు ఏర్పడే అవకాశం లేకపోలేదని పలువురు కాంగ్రెస్ నాయకులు వాపోతున్నారు.

నామినేటెడ్ పోస్టుల్లోనూ ప్రాధాన్యత కరువు

ఏండ్ల తరబడి పార్టీ కోసం పాటుపడిన తమకు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యత కల్పించాలని కోరుతున్నారు. పార్టీ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ద్వితీయ, తతీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని డిమాండ్ చేస్తున్నారు. పార్టీ కోసం పాటుపడిన శ్రేణులకు ఈ మేరకు భరోసా కల్పిస్తేనే మంచి ఫలితాలుంటాయని, రానున్న మున్సిపాలిటీ, స్థానిక సంస్థలు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో సైతం ఆశించిన ఫలితా లుంటా యని అంటున్నారు. రానున్న ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పిస్తేనే మేలు కలుగుతుందని చెబుతున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బీజేపీ ప్రాబల్యం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో యువ నాయకత్వాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ఆకస్మికంగా పీఎస్‌ను డీసీపీ తనిఖీ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డితో కలిసి సూరారం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి ఇన్‌స్పెక్టర్ ఎస్.భరత్ కుమార్ డీసీపీకి వివరించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ కోటిరెడ్డి మాట్లాడుతూ..పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీట్స్, హిస్టరీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్ లిస్టును తనిఖీ చేసి వారిపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. కొత్తగా రౌడీషీట్స్‌లో ఎవరైనా ఉంటే ప్రపోజల్స్ పంపించాలన్నారు. సీసీ కెమెరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించి, కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చూడాలన్నారు. ప్రజా పిర్యాదులో ఎలాంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని, నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీఎన్‌టీఎస్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు డేటాను నమోదు చేయాలని, ఈపెట్టి కేసులు, చాలన్స్ కేసులలో ఫెసియెల్, ఫింగర్ ప్రింట్స్‌లలో అవసరమని, వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, సమయ పాలన, నిబద్ధత కలిగి ఉండాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు పాటుపడాలని అన్నారు.

ఐక్యతకు నిదర్శనం మొహరం పండగ



● డీసీసీ మాజీ అధ్యక్షులు కేఎం.ప్రతాప్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీక మొహర్రం (పీర్ల)పండుగ అని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షులు కేఎం.ప్రతాప్ అన్నారు. బుధవారం పీర్ల పండుగ పురస్కరించుకొని రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని నందానగర్‌లో ముస్లిం సోదరులు నిర్వహించిన పీర్ల ఊరేగింపు వేడుకలలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకునే పండుగ మొహరం అని మతసా మరస్యానికి ప్రతీక పీర్ల పండుగ అని అన్నారు.అనంతరం ముస్లిం సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బాబుమియా,షేక్ గౌస్, మహమ్మద్ ఖాజా మియా, మొహమ్మద్ షాకీర్, షేక్ అతిల్, నందా నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు హరిబాబు, దాస్, శంకర్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీక మొహరం



● కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

త్యాగానికి ప్రతీకగా మొహర్రం పండుగను ముస్లిం సోదరులు జరుపుకుంటారని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. బుధవారం మొహర్రం(పీర్ల)పండుగ సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుమ్ నగర్‌లో ముస్లిం సోదరులు నిర్వహిస్తున్న వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన పాల్గొని ప్రార్థనలు చేసి దట్టీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా జరుపుకునే వేడుకలలో మొహర్రం ఒకటి అన్నారు. హిందూ ముస్లింల ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. మన తెలంగాణ రాష్ట్రంలో చాలా ప్రాంతాలలో ముస్లింల కంటే హిందువులే పీర్ల పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు కొలుకుల జైహింద్ కుటుంబ సభ్యులతో పాటు డివిజన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ ఎం.ఎస్.రెడ్డి నగర్‌లో మహేష్ నూతనంగా ఏర్పాటు చేసిన 'మణికంత మొబైల్ షాప్' ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి మణికంత మొబైల్ షాప్‌ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా, స్వయం ఉపాధి పై దృష్టి సాధించి ఎవరికీ నచ్చిన రంగాని వారు ఎంచుకొని ఆర్థికంగా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నందు గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నాగదీప్ గౌడ్, మానస్, మహేష్, వర్మ పాల్గొన్నారు.

బోనాల పండుగకు చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణలో వైభవంగా జరిగే బోనాల పండుగ సందర్భంగా, కూకట్‌పల్లి నియోజక వర్గంలోని 105 అమ్మవారి దేవాలయాలకు, చెక్కులు ఇచ్చే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కూకట్‌పల్లి నియో జకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహ యాదవ్, ఆవుల రవీందర్ రెడ్డి, పండాల సతీష్ గౌడ్, మందాడి శ్రీనివాస్ రావు, సబీహా గౌసుద్దీన్, మాజీ కార్పొరేటర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల సందర్భంగా ఆలయాలలో సౌకర్యాల కోసం చెక్కుల పంపిణీ..

ఆశడమాసం బోనాల పండుగ సందర్భంగా.. ఆలయాల్లో సౌకర్యాల కల్పన కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక నిధులను విడుదల చేసింది. కావున బుధవారం రోజున కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ ఆలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని కూకట్‌పల్లిలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్, సీతారామచంద్ర స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం తీర్థప్రసాదా లను స్వీకరించి, ఆలయాల ప్రతినిధులకు చెక్కులను అందచేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అమ్మవారి దేవాలయాల్లో సౌకర్యాల ఏర్పాటు కోసం రూపాయలు 37 లక్షల 40 వేలను చెక్కులను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సతీష్ రెడ్డి, నాగిరెడ్డి, పుష్ప రెడ్డి, లక్ష్మయ్య డివిజన్ అధ్యక్షులు, డివిజన్ మహిళా అధ్యక్షురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలయాల్లో తొలిఏకాదశి వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని బుధవారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, శశికళ దంపతులు ఆయన కుటుంబ సభ్యులు శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి దయతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కొలుకుల సత్యనారాయణ, లక్ష్మి, యువజన విభాగం నాయకులు కొలుకుల జైహింద్, జ్యోతి, కొలుకుల సాయి, కొలుకుల కార్తీక్, కొలుకుల శివాని, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డినగర్ డివిజన్‌లో...

తొలిఏకాదశి పురస్కరించుకుని ఆదర్శనగర్ లో గల శ్రీ పద్మావతి వెంకటేశ్వర, అభయాంజనేయ స్వామి, శివాలయంలో ఆదర్శనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్యతోపాటు ఆలయ కమిటీ సభ్యులు ఎం.ఇందిరా రెడ్డి, కాలనీ సొసైటీ సభ్యులు ఆంజనేయులు, నాగభూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ సంక్షేమ సంఘం నాయకులు కోటేశ్వరరావు, జె.శ్రీనివాస్,నారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరిస్తా



● కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ట్రాఫిక్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తా అని స్థానికులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, శుభోదయ కాలనీలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని, కార్పొరేటర్ దృష్టికి తీసుకునిరాగా.. కార్పొరేటర్ కాలనీలో పర్యటించి, ట్రాఫిక్ సమస్య గురించి కాలనీవాసులతో చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రధాన రహదారులైన ఉషా ముల్లపూడి రోడ్డు నుంచి జగద్గిరిగుట్ట పైప్ లైన్ రోడ్డు వైపుకు వెళ్లే వాహనాలు, శుభోదయ కాలనీ మీదుగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని అన్నారు. గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద సిగ్నల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నేరుగా పైప్ లైన్ రోడ్లకు మళ్లిస్తే సమస్య తగ్గుతుందని తెలియచేసారు. కాబట్టి ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ట్రాఫిక్ సమస్యను త్వరగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో పోశెట్టిగౌడ్, అల్లురయ్య, సవరయ్య, శర్మ, రత్నం, డాక్టర్ సునీల్, సుందరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

'రైతుల కష్టాలు తెలిసిన ప్రభుత్వం కాంగ్రెస్'

నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ రైతుల కష్టాలు తెలిసిన ప్రభుత్వం అని బోరబండ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు కాసుల మహేష్ తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు మూడు దఫాల్లో రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నట్టు తెలిపారు. ఇది చారిత్రాత్మకం అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన, రైతుల వెంటే నిలబడుతుందని అభిప్రాయపడ్డారు.

సీసీ రోడ్డు పనుల్లో.. నాణ్యత ప్రమాణాలు పాటించాలి



● కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

సీసీ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీలో రూ.9 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కాలనీ వాసులతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ బస్తీలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో ప్రతి బస్తీలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సురేష్ బాబు, చంద్రశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, సుబ్బారెడ్డి, టాక్ లక్ష్మణ్, స్థానిక ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

తొలి ఏకాదశి సందర్భంగా.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లిలోని రామాలయంలో శ్రీ సీత రామచంద్ర స్వామిని దర్శించుకొని, ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావు, చైర్మెన్ తులసి రావు తదితరులు పాల్గొన్నారు.

మొహరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్ ఎస్ఆర్‌టీ నగర్‌లో బుధవారం మొహరం పండుగ వేడుకల్లో భాగంగా స్థానిక ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొని షర్బత్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కృష్ణ మోహన్, విజయ్ కుమార్, మైనారిటీ ప్రెసిడెంట్ సర్ధార్, ఖలీల్, అబ్దు, ఇర్ఫాన్, మేరీ అజేయ, రమేష్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బోరబండలో ఘనంగా మొహరం వేడుకలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

మొహర్రం సంద ర్భంగా బోరబండ డివిజన్‌లో కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసి యుద్దిన్ సతీమణి హబీబా సుల్తాన ఆధ్వర్యంలో ఎస్ఆర్‌టీనగర్‌లో షర్బత్ (స్వీట్ డ్రింక్) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2024-25 దరఖాస్తు నమోదు ప్రక్రియకు సంబంధించిన గోడపత్రికను జిల్లా విద్యాశాఖధికారిని ఆర్.రోహిణి, కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి, డీఎస్‌వో సి.ధర్మేందర్ రావ్, సూపరింటెండెంట్ శ్రీకాంత్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడంతో పాటు వారి ఆలోచనలను ఆవిష్కరి చేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందన్నారు. ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు ఇన్‌స్పైర్ డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.ఇన్‌స్పైర్‌అవార్డ్స్-డీఎస్‌టీ.గొ.ఇన్ పోర్టల్‌లో నమోదు చెయాలన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులకు ఎంపికయ్యేలా ప్రోత్సహిం చాలన్నారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సూచించారు. ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడానికి గడువు సెప్టెంబర్ 15 తేదీ వరకు ఉందన్నారు. ఈ ఏడాది దరఖాస్తులు పెంచడమే లక్ష్యంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఉప విద్యాశాఖధికారులకు, ప్రధానోపాధ్యాయులకు, గైడ్ టీచర్లను ఆదేశించారు.

మహంకాళి జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



నవతెలంగాణ-బేగంపేట్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను వెస్ట్ మారేడ్ పల్లి లోని వారి నివాసంలో సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి ఆలయం ఈఓ మనోహర్ రెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 21 వ తేదీన ఆలయంలో జరిగే బోనాల ఉత్సవాలు, 22న నిర్వహించే రంగం కార్యక్రమాలకు హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యేకు ఈఓ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ. సందర్భంగా ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి ప్రసాదాలను ఎమ్మెల్యేకు అందజేశారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిమంది భక్తులు వస్తారని, వారు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్య వేక్షించాలని సూచించారు. ఏర్పాట్లలో తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ఆలయ చైర్మెన్ కామేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, ఆకుల హరికృష్ణ, శ్రీహరి తదితరులు ఉన్నారు.

దక్కన్ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న జరిగే శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి జాతర, బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని దక్కన్ మానవ సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి ఆహ్వానించారు. బుధవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను దక్కన్ మానవ సేవా సమితి కమిటీ సభ్యులు కలిసి ఆహ్వానాన్ని అందజేశారు. అధ్యక్షులు ధరం వీర్ ఆర్య, కార్య నిర్వహణ అధ్యక్షుడు కొంక రఘుమోహన్, కార్య నిర్వహణ కార్యదర్శి సీకే.నర్సింగ్ రావు, ప్రధాన కార్యదర్శి దయానంద, ప్రభాకర్, కమల్ కుమార్, వసుంధర మోహన్, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు సరైన రహదారి ఏర్పాటు చేయాలి



- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

నవతెలంగాణ-ఓయూ

దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాలకు సరైన రహదారిని ఏర్పాటు చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో మైలార్ గడ్డ చౌరస్తాలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దూద్ బాయ్ ప్రభుత్వ పాఠశాలకు ప్రధాన దారి లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రజావాణిలో కలెక్టర్ కి వినతిపత్రం ఇచ్చి సుమారు 15 రోజులు కావస్తున్నా నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో ప్రభుత్వ స్కూళ్లపై ప్రభుత్వ నిర్లక్ష్యాలను నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి పాఠశాలకు సరైన రోడ్డు మార్గం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీఎఫ్ మండల కన్వీనర్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమస్య లకు కేంద్రాలుగా మారాయని, దీంతో పేద వర్గాల విద్యా ర్థులు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున సమస్యలను పరిష్కరించే విధంగా దిద్దు బాటు చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో సీపీఐ అండ్ సీఆర్‌పీఎఫ్ నాయకులు కొమురెల్లి బాబు, సోమయ్య, సువర్ణ, వరలక్ష్మి, ప్రవీణ్ రాములు, రవి, చందర్,గౌరీ నాగరాజ్, శ్రీహరి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఓయూ జేఏసీ చైర్మెన్



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిరిసిల్ల నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కొత్తపల్లి తిరుపతి కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. అప్పటి నుండి పార్టీ కార్యక్ర మాలలో చురుకుగా పాల్గొంటూ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా పాలన గురించి ప్రజలను ఎప్పటికప్పుడు చైతన్య పరుస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని మంత్రికి తిరుపతి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్య, వైద్యం రెండూ ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలని చెప్పారు. అంతేకాకుండా నిరుద్యోగులకు ప్రభుత్వం ఎపుడూ అండగా ఉంటుందన్నారు. అందువలన ఎవరూ అధైర్య పడవద్దని తెలిపారు. నిరుద్యోగులు పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించాలని జీవితంలో స్థిరపడాలని ఆశిం చారు. ఈ కార్యక్రమంలో పులిగంటి వేణుగోపాల్ కాంగ్రెస్ నాయకులు,శివశంకర్, పులిగంటి సురేష్, రవీందర్, రాజేందర్, కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, సంతోష్, మహేష్, రాము, పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

- మైనార్టీ చైర్మెన్ దీపక్ జాన్



నవతెలంగాణ-కంటోన్మెంట్

క్రైస్తవుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని మైనారిటి చైర్మెన్ దీపక్ జాన్ ఉన్నారు. బుధవారం లాల్ బజార్ లోని గార్షన్ చర్చ్‌లో క్రిస్టియన్ డెమొక్రటిక్ మూమెంట్ ఆధ్వర్యంలో క్రైస్తవుల సమస్యలపై సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రైస్తవులకు ఎదుర్కొం టున్న సమస్యల పై తనకు అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా కన్వర్టెడ్ క్రిస్టియన్ వారికి ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.ఇంకా విద్యా వైద్య అభివృద్ధి కూడా కృషి చేస్తామని ఆయన తెలిపారు కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, పలు చర్చిల ఫాదర్లు, రెవరెండ్స్ పాల్గొని క్రైస్తవుల సమస్యలపై చర్చించారు.

ఓయూ 'ఇంజినీరింగ్'లో బీఎఫ్ఎస్ఐ పోగ్రాం

- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- బ్యాంకింగ్,ఫైనాన్స్, బీమా రంగాల నిపుణులు రూపొందించిన సిలబస్, వారే బోధన..
- పుష్కలంగా ఉపాధి అవకాశాలు.. రెట్టింపు వేతనాలు.
- ఇంటర్న్ షిప్స్ ఇవ్వనున్న కంపెనీలు



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో నూతనంగా రాష్ట్రంలో మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి సంయుక్త ఆధ్వర్యంలో బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సురెన్స్ (బీఎఫ్ఎస్ఐ) పోగ్రాం ప్రవేశపెట్టారు. బీఈ 3వ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం బీఎఫ్ఎస్ఐ, మైనర్ డిగ్రీ పోగ్రాం ను ప్రవేశ పెట్టారు. అది కూడా ఓయూ ఇంజినీరింగ్ కళాశాల నుండే ప్రారంభించడం విశేషం. ఈ మైనర్ పోగ్రాం బీఈ మూడవ సంవత్సరం అభ్యసిస్తున్న విద్యార్థులకు ఐటీ రంగాల్లో రాణించాలని, స్థిరపడలని ఆసక్తి గల విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశం అంటున్నారు ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ఆచార్యులు. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం 18 నుండి 20 క్రెడిట్స్ గాను , 4 సెమిస్టర్స్‌లలో పూర్తయ్యేలా సిలబస్‌ను పొందుపరిచారు.

నిపుణులు రూపొందించిన సిలబస్, వారే బోధన..

ఈ మైనర్ పోగ్రాం సిలబస్‌ను ప్రత్యేకంగా బ్యాంకింగ్ వ్యవహారాలలో, ఆర్థిక నిపుణులు , ఫైనాన్స్ బీమా రంగాల్లో నిష్ణాతులైన వారు అవసరమైన సిలబస్ ను రూపకల్పన చేశారు. దీనిని మెట్ట మొదటిసారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశ పెట్టారు. కళాశాల టైమ్ టేబుల్ కు అనుగుణంగా పోగ్రాం నిర్వహించనున్నారు. బ్యాంకింగ్,ఆర్థిక ,ఫైనాన్స్ రంగాల్లో నిపుణులు బోధిస్తారు. 2 సంవత్సరాల ఈ కోర్సులో థియరి , ల్యాబ్ , ప్రాజెక్టు వర్క్, కెస్ స్టడీ లాంటి అంశాలపై వారే శిక్షణ ఇస్తారు.

మైనర్ పోగ్రాం ప్రధాన ఉద్దేశం

సాఫ్ట్ వేర్ రంగాల్లో రాను రాను బ్యాంకింగ్ అప్లికేషన్స్ డెవలప్మెంట్ నిపుణుల కొరత తీవ్రంగా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఈ మైనర్ పోగ్రాం లేకపోవడం వల్ల సాఫ్ట్‌వేర్ రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తులకు కనీసం 2 లేక 3 సంవత్సరాల అనుభవం తరువాత ఈ రంగాల్లో ప్రవేశం పొందటానికి అవకాశం ఉంది. ఈ బీఎఫ్ఎస్ఐ పోగ్రాం అభ్యసించడం వల్ల విద్యార్థులకు నేరుగా బ్యాంకింగ్ అప్లికేషన్స్ పై పని చేసే నైపుణ్యం కలిగి ఉంటారు.

ఉద్యోగ అవకాశాలు భేష్

బ్యాంకింగ్, ఆర్థిక నిపుణుల సంస్థలు అయిన జేపీ మార్గాన్, యాక్సెస్ బ్యాంక్ లాంటి సంస్థలలో నేరుగా క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లలో ఉద్యోగాలు పొందుతారు. ఈ విద్యార్థులు ఎంబీఏ పూర్తి చేస్తే మరిన్ని ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

రాష్ట్ర వ్యాప్తంగా 17 అటనామస్ కళాశాలలో ప్రవేశాలు

ఈ మైనర్ పోగ్రాంను మొదట ఓయూ లో ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో గత విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించారు. ఇప్పటికే కళాశాల అత్యున్నత అకడమిక్ కౌన్సిల్ నిర్ణయం తీసుకున్నారు. జేఎన్‌టీయూతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ అటనామస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ మైనర్ పోగ్రాం ను త్వరలోనే ప్రారంభించనున్నారు.


ఉద్యోగావకాశాలు ఎక్కువ, వేతనాలు రెట్టింపు..



నేను ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గా ఉండగానే ఈ పోగ్రాంను ప్రవేశపెట్టాను. ఈ మైనర్ డిగ్రీ పోగ్రాం అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు ఉపయోగ పడుతుంది. ఉద్యోగ అవకాశాలు కాకుండా, మంచి వేతనంతో కూడిన ప్యాకేజీ ఉంటుంది. సాఫ్ట్ వెర్ జాబ్స్ కన్నా ఎక్కువ వేతనాలు ఉంటాయి. చాలా మల్టీనేషనల్ కంపెనీలు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇస్తున్నాయి. ఇలాంటి శిక్షణ కళాశాలాలో ఇస్తే నేరుగా వారి వారి సంస్థ లో జాబ్స్ పొందవచ్చు. ఈ కోర్సు ఎంచుకున్న విద్యార్థులకు సదరు కంపెనీలు ఇంటర్న్ షిప్ లు కూడా ఇస్తాయి. ఏఐసీటీఈ గైడ్‌లైన్స్ ప్రకారమే ఈ మైనర్ డిగ్రీ పోగ్రాం నిర్వహిస్తారు.

- ప్రొ.శ్రీరాం వెంకటేష్

బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగాలు పుష్కలం



ఓయూ ఇంజినీరింగ్ కళాశాలలో గత సంవత్సరమే ఈ మైనర్ డిగ్రీ పోగ్రాం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నాము. ప్రధానంగా నాన్ ఐటీ బ్రాంచ్‌లు సివిల్ , మెకానికల్ , ఎలక్ట్రికల్, మైనింగ్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ పోగ్రాంను అభ్యసించి బ్యాంకింగ్ ఆర్థిక రంగాల్లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందటానికి అవకాశం ఉంది. మా విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకొని అభ్యసించి జీవితంలో స్థిరపడాలి. రాష్ట్రంలో మొట్టమొదట ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశపెట్టడం గర్వకారణం ఉంది.

- ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. పైడిమర్రి. చంద్రశేఖర్



బస్తీల్లో పర్యటించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

బస్తీ పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం సాయిబాబా హాట్స్, ఉత్తరయ్య గుడిసెలు, కొమరయ్య గుడిసె, బస్తీలలో పర్యటించారు. బస్తీ వాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాయిబాబా హాట్స్ బస్తీ వాసులు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు అలాగే ఉత్తరయ్య గుడిసెలు కొమరయ్య ప్రాంతాల్లో మంచి నీరు, మురికి కాలువలు, విద్యుత్ సమస్యలను స్థానికులుఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు సమస్యలన్నిటినీ సత్వరం పరిష్కరించి చర్య తీసుకుంటామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా హామీ ఇచ్చారు కాగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల విషయంలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



ఓయూలో పండగ సాయన్న జయంతి

నవతెలంగాణ-ఓయూ

పండగ సాయన్న ముదిరాజ్ జయంతిని బుధవారం ఓయు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో రెడ్డి శీను ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ మాట్లాడుతూ పాలమూరు జిల్లా నవాబుపేట మండలం మెరుగుకొని పల్లిలో పేద కుటుంబంలో జన్మించిన పండుగ సాయన్న తన చిన్నతనం నుంచే పేదరికంలో ఉన్న ప్రజలకు ఆకలి తీర్చడం కోసం పాటుపడ్డారన్నారు. అక్రమార్కుల అక్రమ సొమ్మును దోచి పేదలకు పంచిన మహాయోధుడని చెప్పారు. పండగ సాయన్న జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, ట్యాంకుబండ్‌పై ఆయన విగ్రహాన్ని పెట్టాలని, ఆయన జయంతి వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ విద్యార్థి నాయకులు అల్లుడు జగన్ ముదిరాజ్, నిజ్జిన రమేష్ ముదిరాజ్, ప్రకాష్ ముదిరాజ్, అంజి ముదిరాజ్, వెంకట్ ముదిరాజ్, స్వామి ముదిరాజ్, పాల్గొన్నారు.



కోట నీలిమకు ఆహ్వానం

నవతెలంగాణ-బేగంపేట

సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో జరిగే బోనాల పండుగకు హాజరు కావాల్సిందిగా కాంగ్రెస్ సనత్ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమను బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) గుత్తా మనోహర్‌రెడ్డి కలిసి సాదర ఆహ్వానం పలికారు. డాక్టర్ కోట నీలిమను సంప్రదాయ శాలువాతో సత్కరించారు. ఈ ప్రాంతంలోకోట నీలిమ ముఖ్యమైన పాత్రను, ప్రజా సేవ పట్ల ఆమె నిబద్ధతను కొనియాడుతూ, స్థానిక సంప్రదాయాలను ప్రోత్సహించడానికి, సమాజ సామరస్యాన్ని పెంపొందించడానికి ఆమె అంకితభావం, మద్దతుకు ఆలయ కార్యనిర్వహణాధికారి కృతజ్ఞతలు తెలిపారు.

మహంకాళి అమ్మవారి జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

- 21న బోనాలు, 22న రంగం(భవిష్యవాణి) అంబారి ఊరేగింపు, మహా హారతి : జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో/బేగంపేట్

శ్రీ ఉజ్జయిని మహంకాళి జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని, 21న శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాలు, 22న రంగం(భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు, మహాహారతి కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సికింద్రాబాద్ శ్రీఉజ్జయిని మహంకాళి దేవాలయాన్ని కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్‌అండ్ బి, విద్యుత్, వైద్య, దేవదాయ, మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులతో 22న శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో జరుగు ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఏమైనా పనులు మిగిలి ఉంటే త్వరితగతిన పూర్తిచేయాలని, బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని పోలీస్ శాఖను ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఆటంకం లేకుండా సరఫరా చేయాలని, దేవస్థాన పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు చెత్తాచెదారం తీసివేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్ సింగ్, ఆలయ ఈవో, జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలి

- డీసీపీ సాధన రేష్మి పెరమాల్



నవతెలంగాణ-బేగంపేట్

భక్తులు ప్రజలు పోలీసులకు సహాయ సహకారాలు అందించాలని అప్పుడే జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు మీ వంతు కృషి చేసిన వాళ్ళు అవుతారని డీసీపీ సాధన రేష్మి పెరమాల్ అన్నారు.

బుధవారం సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహారపు బండ్ల నిర్వాహకులతో సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. లక్షలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తారని, జాతర పేరిట తాగి, డీజేలను ఏర్పాటు చేసుకుని అసభ్య నృత్యాలతో ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఫలహారం బండ్లు తీయడంలో సంస్కృతిని ప్రతిబింబించే విధంగా ఉండాలి కానీ అసభ్యంగా ఉండవద్దని సూచించారు. ఫలహారపు బండ్ల ఊరేగింపులలో ఎదురయ్యే పలు సమస్యలను నిర్వాహకులు పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో అదనపు డీసీపీ అశోక్ మహంకాళి ఏసీపీ సర్దార్ సింగ్, ట్రాఫిక్ ఏసీపీ, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపశంకర్ లతోపాటు సేవకులు, వివిధ సంఘాల నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నాం



- కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్

నవతెలంగాణ-ఓయూ

సీజనల్ వ్యాధులను నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ తెలిపారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ సర్కిల్ పరిధిలోని హబ్సిగూడ, డివిజన్‌లో గాంధీ గిరిజన బస్తీలో మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారం, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డీఈ చందన, ఎంటమాలజీ ఏఈ నరేష్ రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శులు చెల్లోజు ఎల్లాచారి, చింతకింది ప్రవీణ్ బానోత్, రమేశ్ నాయక్, కొండేరు స్రవంతి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బానోత్ ఉమా తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి ఓవరాక్షన్..

పోలీస్ లాకప్‌లో ఉన్నా.. ఫ్రెండ్స్‌తో రీల్స్..



నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

నేరస్తులను అరెస్ట్ చేసి లాకప్‌లో పెట్టినా భయమనేదే ఉండటం లేదా..? అంటే హైదరాబాద్ బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఓ నిందితుడి ఓవరాక్షన్ చూస్తే అలాగే అనిపించక మానదు. ప్రేమ పేరుతో తమ అమ్మాయిని ఎత్తుకెళ్లాడంటూ బండ్లగూడ పోలీసులను ఆశ్రయించింది ఓ తల్లి. స్థానిక యువకుడు దస్తగిరిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు.. బాలికను ఇంకా కనిపెట్టలేకపోయారు. దీంతో బాలిక తల్లి పోలీసు ఉన్నతాధికారులను ఆశ్రయించడంతో నిందితుడు దస్తగిరిని తీసుకొచ్చి లాకప్‌లో పడేశారు బండ్లగూడ పోలీసులు. ఇక లాకప్‌లో ఉన్న బాలిక కుటుంబంపై బెదిరింపులకు దిగాడు దస్తగిరి. పోలీస్‌స్టేషన్ లోనే ఫ్రెండ్స్‌తో రీల్స్ చేయిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే నిందితుడు దస్తగిరికి పోలీసులు రాచ మర్యాదలు చేస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది. అందుకు, పోలీస్‌స్టేషన్‌లో చేసిన రీల్సే రుజువు అంటున్నారు. పోలీస్‌స్టేషన్‌లో రీల్స్ చేస్తుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తోంది బాలిక ఫ్యామిలీ. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా పోలీసులు ఉన్నతాధికారులకు పాతబస్తీ వాసులు ఫిర్యాదు చేశారు.

వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి

- కుక్కల దాడులు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు
- కుక్కల యజమానులు, ప్రభుత్వం బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా



నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజూ రోజుకు వీధి కుక్కల దాడులు పెరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా తెలిపారు. బుధవారం అశోక్‌నగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జవహర్ నగర్ పరిధిలోని ఆదర్శనగర్ కాలనీలో 18 నెలల విహాన్(2) అనే బాలుడిపై కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలై చికిత్సపొందుతూ మృతి చెందాడని, 24 గంటలు గడవక ముందే జగిత్యాల జిల్లాలో ఇంటిముందు ఆడుకుంటున్న దేవేందర్ అనే ఏడేళ్ల బాలుడిపై కుక్క దాడి చేశాయని గుర్తు చేశారు. వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలేమిటో నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి నివేదిక ఇవ్వాలంటూ స్వయంగా హైకోర్టు ఆదేశించినా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా వీధికుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కుక్క యజమానితోపాటు ప్రభుత్వం సైతం బాధితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు వెంటనే చర్యలు చేపట్టాలని, లేనట్లయితే మానవ హక్కుల కమిటీని ఆశ్రయిస్తామని సాయిబాబా హెచ్చరించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో షర్బత్ పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ శాసనసభ్యులు బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ బుధవారం, శ్రీనగర్ కాలనీ డివిజన్‌లో మొహర్రం పండుగ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి, షర్బత్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ అప్పు ఖాన్, తన్ను ఖాన్, మధు, శ్రీనివాస్, అభినాష్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా నగర్, ఇంద్రనగర్ బస్తీలలో 'బస్తీ బాట' కార్యక్రమం నిర్వహించారు. మహాత్మానగర్ ప్రజలు 200 యూనిట్స్ లోపు తమకు జీరో బిల్లు ఇచ్చిన తర్వాత బిల్లు చెల్లించని గృహాలకు విద్యుత్ కనెక్షన్ కట్ చేశారని ఈ సందర్భంగా తమ ఎదుట వారు ఆవేదన వ్యక్తం చేసినట్టు సీపీఐ(ఎం) నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పి. ఐలయ్య, టి. శంకర్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

తుర్రేబాజ్ ఖాన్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలి



- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

బ్రిటిష్, నిజాం సైన్యాలకు వ్యతిరేకంగా 1857 జూలై 17న తుర్రేబాజ్ ఖాన్ నాయకత్వన హైదరాబాద్ బ్రిటిష్ రెసిడెన్సీపై దాడిలో ఆనాటి తొలి స్వతంత్ర సమరయోధుడు తుర్రేబాజ్‌ఖాన్‌తో సహా అనేక మంది అమరత్వం పొందారు. వారిని స్మరించుకుంటూ సీపీఐ హైదరాబాద్ జిల్లా కౌన్సిల్, భారత జాతీయ ఉద్యమం ఆధ్వర్యంలో కోఠి లోని మొదటి స్వాతంత్ర సమరయోధుల స్మారకార్థం నిర్మించిన స్థూపం దగ్గర నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. "బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా భారతీయ సైనికులు ఆంగ్లేయులపై తిరుగుబాట్లు చేశారు. హైదరాబాద్ సంస్థానంలో నిజాం, ఆంగ్లేయులతో సైనిక సహకార ఒప్పందాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. దీనితో ఆంగ్లేయుల ఆధిపత్యం నిజాం సైన్యంలో పెరిగింది. దీన్ని వ్యతిరేకిస్తూ మౌల్వి అల్లావుద్దీన్, తుర్రే బాజ్ ఖాన్ నాయకత్వంలో బ్రిటిష్ రెసిడెన్సీ పై 500 మంది సైన్యంతో యుద్ధం చేశారు. ఎటువంటి ఆయుధ సంపత్తి లేకున్నా ధైర్యం తో అత్యంత సాహసంతో దాడిలో సైన్యం పాల్గొని నిజాం, బ్రిటిష్ కోట ద్వారాలను ధ్వంసం చేసింది. ఊహించని బ్రిటిష్ సైన్యం ఈ దాడిని తిప్పికొట్టేందుకు తన సైనిక బలగంతో మూకుమ్మడిగా దాడి చేసి 32 మందిని హత్య చేయడం జరిగింది. అదేవిధంగా అనేక మందిని బందీలుగా పట్టుకున్నారు. తుర్రె బాజ్ ఖాన్ నాయకత్వాన జరిగిన ఈ దాడి మొత్తం నిజాం సైన్యంలో తిరుగుబాటుదారులకు, స్వాతంత్రం కోసం పోరాటం చేయాలనుకున్న ప్రజలకు ఒక ఉత్తేజాన్ని పోరాట స్ఫూర్తిని రగిలించింది. ఇలాంటి వీరోచిత పోరాటయోధుని విగ్రహాన్ని ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. భారత జాతీయ ఉద్యమ కన్వీనర్ మోటూరి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానంలో మొట్టమొదటి సారిగా స్వాతంత్ర పోరాట ఆకాంక్షను రగిలించిన యోధుడు తుర్రె బాజ్ ఖాన్ అని కొనియాడారు. హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన తుర్రె బాజ్ ఖాన్‌కు చరిత్రలో చాలా అన్యాయం జరిగిందని దాన్ని గుర్తించి ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆయన త్యాగాన్ని పోరాట స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు తెలియజేయాలంటే పాఠ్యపుస్తకాలలో చరిత్రగా పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టీ నరసింహ, తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ కలవేణి శంకర్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కె.బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి జ్యోతి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ, హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి స్టాలిన్, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, నెర్లకంటి శ్రీకాంత్ ,మామిడి చెట్ల వెంకటస్వామి, కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, చెట్టు కింది శ్రీనివాస్, గ్యార నరేష్, కిషన్ లక్ష్మినజీబ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.




మొహరం పండుగను పురస్కరించుకొని ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్ డివిజన్‌లో గల బీజేఆర్ నగర్, బంజారాహిల్స్‌లోని వెంకటేశ్వర నగర్‌లో ఏర్పాటు చేసినటువంటి అలం (పీర్లు) ను ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి దర్శించుకున్నారు. ఆమెతో పాటు మాజీ కార్పొరేటర్లు ముస్లిం సోదరులతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

23, 24న
సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యం

నవతెలంగాణ-నాగోల్

ఈ నెల 23, 24వ తేదీలలో కూకట్‌పల్లిలోని వై జంక్షన్ వద్ద ఉన్న ఆమోర్ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో సింగరేణి విశ్రాంత ఉద్యోగ కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఆలందార్ వేణుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23, 24వ తేదీలలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి.. వైద్యులచే సలహాలు, సూచనలను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకునేందుకు నాగేంద్రప్రసాద్ 04066069999, 9848123822 ఫోన్ నెంబర్ల ద్వారా ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్



నవతెలంగాణ-నాగోల్

ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. తర్వాత ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి భూక్యా జాన్సన్ నాయక్, సుధీర్ రెడ్డి సతీమణి కమలా సుధీర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి
ది భాగ్యనగర్ కృషి

బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి







నవతెలంగాణ-బడంగ్‌పేట్

రైతుల సంక్షేమానికి ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు నిరంతరం ఎంతో కృషి చేస్తుందని ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు చైర్మెన్ మర్రి నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్ గుల్ గ్రామంలోని బ్యాంకు కార్యాలయంలో ఆయన నవతెలంగాణ విలేకరితో మాట్లాడారు. రూ.37కోట్ల లావాదేవీలు, రూ.6 కోట్ల నిధుల లాభాల బాటలో బ్యాంకు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ది భాగ్యనగర్ రైతు సేవ సహకార సంఘం బ్యాంకు డైరెక్టర్లు, ఖాతాదారుల, బ్యాంకు సిబ్బంది సహకారంతో నిరంతరం రైతుల ఆర్థికాభివృద్ధి కోసం పనిచేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ద్వారా రైతులకు కావాల్సిన అన్ని విత్తనాలు, ఎరువులు ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంచడంతో పాటు ప్రభుత్వం ద్వారా లభించే అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు రైతు బీమా, రైతుబంధు, ఉచిత విద్యుత్ సౌకర్యం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడం వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వ ఆదేశం మేరకు బ్యాంకు రైతులకు అమలు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఏర్పడిన నాటి నుండి నేటి వరకూ రైతులకు కావాల్సిన అన్ని రకాల రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. రైతులకు కావాల్సిన బంగారు ఆభరణాలపై రుణాలు, వివిధ రకాల వ్యాపారం చేసుకోవడం కోసం రుణాలు, వ్యవసాయ రుణాలను రైతులకు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. వ్యవసాయం చేసే సమయంలో రైతులకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా పంట రుణాల కోసం ప్రైవేటు వ్యక్తుల నుండి వడ్డీ రుణాలు తీసుకోకుండా అదును సమయంలో పంట రుణాలను మంజూరు చేయడం వలన రైతులు ఆర్థిక ఇబ్బందులకు గురి కాకుండా అనేక రకాల చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికీ బ్యాంకు ద్వారా 6వందల మందికి బంగారు రుణాలు, 3వందల మందికి వ్యవసాయ, 3వందల మందికి వ్యాపార రుణాలను అందజేసినట్టు వెల్లడించారు. 6 నెలలకు ఒకసారి రైతులతో సర్వ సభ్య సమావేశం నిర్వహించి అందులో భాగంగా రైతుల సమస్యలు, సూచనలు, సలహాలను పాటించి.. వారికి ఎల్లపుడు అందుబాటులో బ్యాంకు సిబ్బంది సహాయ సహకారాలు అందిండం జరుగుతుందన్నారు. మా బ్యాంకు ద్వారా 3వందల మంది రైతులకు రూ.2కోట్ల వరకు రుణమాఫీ అమలు చేసినట్టు తెలిపారు. బ్యాంకు నిరంతరం రైతుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

ఆవిష్కరణలకు అవకాశం

'ఇంటింటా ఇన్నోవేటర్'కు దరఖాస్తుల ఆహ్వానం

వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు

నవతెలంగాణ-సిటీబ్యూరో

సృజనాత్మకతను ప్రోత్సహించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సరికొత్త ఆవిష్కరణలకు అవకాశం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇంటింటా ఇన్నోవేటర్స్‌కు నేటి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. వచ్చే నెల 3వ తేదీ వరకు గడువు విధించారు.

అందరికీ అవకాశం

ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసింది. గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఇలా ఎవరైనా ఇందులో పాల్గొనవచ్చు. అలాగే ఆవిష్కరణల నైపుణ్యం ఉన్నవారు, ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్, రాష్ట్ర బాల్ వైజ్ఞానిక్ ప్రదర్శిని, స్కూల్ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొన్న విద్యార్థులు ఇంటింటా ఇన్నోవేటర్‌కు అర్హులు. ఆసక్తికలవారు వచ్చేనెల 3వ తేదీ నాటికి రెండు నిమిషాల నిడివితో కూడిన వీడియో, ఆవిష్కరణకు సంబంధించిన నాలుగు ఫొటోలు, ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాల్లో 9100678543 నంబర్‌కు వాట్సాప్ పంపించవచ్చు. జిల్లా నుంచి అత్యుత్తమ ఆవిష్కరణలను ఎంపిక చేసి ఆగస్టు 15వ తేదీన ప్రదర్శించనున్నారు. అలాగే ఆవిష్కర్తల పేరు, వయసు, ప్రస్తుత వృత్తి, మొబైల్ నంబర్, ఏరియా, మండలం, జిల్లాతో కూడిన వివరాలను 9100678543కు వాట్సాప్‌లో పంపాలని సంబంధిత అధికారి సూచించారు.



కొత్త ఆవిష్కరణలకు ఇంటింటా ఇన్నోవేటర్ చక్కటి వేదిక



ప్రతి ఒక్కరిలో ఏదోక ప్రతిభ దాగి ఉంటుంది. దానిని వేలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చక్కని అవకాశం కల్పించింది. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు నిత్య జీవితంలో ఉపయోగపడే ఆవిష్కరణల కోసం ఇదో మంచి అవకాశం. మరిన్ని వివరాల కోసం 7799171277 లేదా 8712824996 నంబర్‌ను సంప్రదించాలి.

సి.ధర్మేందర్ రావ్, సైన్స్ అధికారి, హైదరాబాద్

అభివృద్ధిని చూసి
ఓర్వలేకనే ఆరోపణలు : మహమ్మద్

నవతెలంగాణ - చైతన్యపురి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్కే మహమ్మద్ అన్నారు. ఆర్కే పురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖిల్లా మైసమ్మ దేవాలయంలో సోమవారం జరిగిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిం



చినట్టు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో కొత్త నగరంగా తీర్చి దిద్దు తామని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే.. ప్రజా ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనేక సార్లు ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగాయని, ఇప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదని నిరసన తెలపడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో హైమద్, యూసఫ్, మొయిన్, షోహెబ్ అక్తర్, గౌస్, రఫిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను కలసిన నాయకులు



నవతెలంగాణ-బడంగ్ పేట్

బుద్ధ భవన్‌లో తెలంగాణ మహిళా కమీషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరేళ్ళ శారదను రాష్ట్ర ఇరిగేషన్, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆమెను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ - సంతోష్‌నగర్

తెలంగాణ రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మెన్‌గా నేరెళ్ల శారద బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పలు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు నూతన మహిళా కమీషన్ చైర్మెన్ శారదను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి, నిజాయితీ పరులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తింపు ఇస్తారన్నారు. రాజకీయాల్లో ఓపిక అవసరమని, సమయ సందర్భాలను బట్టి అందరికీ అవకాశాలు వస్తాయన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఆమెను సన్మానించిన వారిలో సీనియర్ నాయకులు తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కర్ణాకర్ రెడ్డి, చైతన్య రెడ్డి, జైపాల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.



మంత్రి కోమటిరెడ్డికి
చిత్రపటం బహూకరణ



నవతెలంగాణ- సంతోష్‌నగర్

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కర్ణాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని పూలమాలలు, శాలువాతో ఘనంగా సత్కరించారు. తర్వాత మంత్రికి చిత్రపటాన్ని బహూకరించాడు.

మంత్రిని కలిసిన వారిలో తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గోపాల్ ముదిరాజ్, చైతన్య రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రాఘవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ - సంతోష్ నగర్

సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, చంపాపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలో మాధవనగర్ కాలనీలో రూ.93 లక్షల జీహెచ్ఎంసీ నిధులతో చేపట్టిన ఇంటర్నల్ సీసీ రోడ్డు నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కాంట్రాక్టర్‌ను కోరారు.

ఈ పరిశీలనలో జీహెచ్ఎంసీ అధికారులు వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజు, బీజేపీ సీనియర్ నాయకులు లింగాల దశరథ్ గౌడ్, మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు హనుమంత్ రెడ్డి, కాలనీ సభ్యులు మణిపాల్ రెడ్డి, అనసూయ, శంభుప్రసాద్, మోహన్ రెడ్డి, ముత్యాలు, జంగయ్య, కోదండ రామారావు, పాండయ్య, పర్వత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, వానం రెడ్డి, చంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా
ఏకలవ్యుడి జయంతి వేడుకలు



నవతెలంగాణ-హయత్‌నగర్

ఏకలవ్యనగర్ కాలనీ మన్సూరాబాద్ డివిజన్ ఎల్బీనగర్ ఎరుకల సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనం గంగయ్య ఆధ్వర్యంలో బుధవారం ఏకలవ్యుడి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గిరిజన కార్పొరేట్ ఫెడరేషన్ లిమిటెడ్ చైర్మెన్ బెల్లయ్య నాయక్ ముఖ్య అతిథిగా హాజరై.. ఏకలవ్య చిత్ర పటానికి పూలమాలల వేసి జెండా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాభారతంలో మహావీరుడు, విలువిద్యలో సాటిలేని మగధీరుడు, ఆధిపత్య కులాల చేతిలో మోసానికి గురి అయిన గిరి పుత్రుడు, ఎరుకల జాతి ఆరాధ్యుడు ఏకలవ్యుడు అని అని అన్నారు. ఏకలవ్యుని వారసులు ఎరుకల కులం అభివృద్ధి కోసం ఏకలవ్య కార్పొరేషన్ చైర్మెన్ ఏర్పాటు చేసి, 500 కోట్ల రూపాయలు బడ్జెట్ కులం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ, ఎస్టీ సెల్ నియోజకవర్గ చైర్మెన్ రమేష్ నాయక్, టీవైపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలమర్తి శేఖర్, ఎస్టీసెల్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మెన్ చర్ల రమేష్, వెంకన్న, సమ్మయ్య, మల్లేశ్, సిద్ధిని స్వామి, కోనేటి చిన్న నరసింహ, అనిత, భారతమ్మ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సమయ స్ఫూర్తితో
వ్యక్తి ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీసులు

ప్రత్యేకంగా అభినందించిన రాచకొండ సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-సిటీబ్యూరో

విధి నిర్వహణలో సమయ స్ఫూర్తిని ఇలాగే కొనసాగించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. ఓ వ్యక్తి ప్రాణాలను కాపాడిన వనస్థలిపురం ట్రాఫిక్ సిబ్బందిని రాచకొండ కమిషనరేట్ నేరేడ్‌మెట్ కార్యాలయంలో సీపీ ప్రత్యేకంగా అభినందించారు. వారికి రివార్డులను అందజేశారు. ఈ నెల 15న మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లేలగూడ ఆర్‌సీఐ రోడ్డు వద్ద కడ్తాల్ వెళ్తున్న వెంకటేష్ అనే వ్యక్తి తన మహేంద్ర కారులో వెళ్తున్నారు. అయితే ఆకస్మాత్తుగా ఏసీ నుండి మంటలు చెలరేగాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న వనస్థలిపురం ట్రాఫిక్ సిబ్బంది నర్సింగ్ రావు, కృష్ణ, సాయిరామ్‌లు గమనించారు. వెంటనే కారు నడుపుతున్న వెంకటేష్‌ను అప్రమత్తం చేశారు. కారు ఆపి అతని ప్రాణాలు కాపాడారు. క్షణాలల్లో మంటలు విస్తరించడంతో ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులను అప్రమత్తం చేశారు. వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చి, ఆలస్యం చేయకుండా, అటుగా వెళ్తున్న ఒక వాటర్ ట్యాంకర్‌తో మంటలు అదుపులోకి తీసుకుని రావడానికి కృషి చేశారు. తక్షణమే స్పందించి, ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా వ్యవహరించిన ట్రాఫిక్ సిబ్బంది సమయస్ఫూర్తిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ ట్రాఫిక్ డీసీపీ వీ. శ్రీనివాస్, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డీ. వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ తదితరలు పాల్గొన్నారు.



చనిపోయాడనుకున్న వ్యక్తిని కుటుంబానికి అప్పగింత





నవతెలంగాణ-బడంగ్‌పేట్

కుటుంబ సభ్యులు చనిపోయాడనుకున్న రమేష్ అనే వ్యక్తిని మాతృదేవోభవ ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు గిరి బుధవారం అతని కుటుంబ సభ్యులకు అప్పగించాడు. ఈ సందర్భంగా గట్టు గిరి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల కిందట చర్లపల్లి ప్రాంతంలో పెరిగిన గడ్డంతో మతిస్థిమితం కోల్పోయి అనాథగా రోడ్డు పక్కన పడుకుని ఉన్న వ్యక్తిని మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ ఆశ్రమానికి తీసుకొచ్చినట్టు తెలిపారు. అతడి వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా.. అతని పేరు విఠల్ అని మాత్రమే చెప్పాడని, అతని కుటుంబ వివరాలు, అడ్రస్ చెప్పలేదన్నారు. ఈ ఐదేండ్లు అతనికి వైద్యం అందించినట్టు తెలిపారు. వారం రోజుల కిందట మరల అతని వివరాలు అడగగా..అతని పేరు రమేష్ అని వరంగల్ జిల్లా, ఏటూరునాగారం మండలం, శివపురం అనే గ్రామం అని చెప్పాడన్నారు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు. ఆశ్రమానికి చేరుకున్న కుటుంబ సభ్యులు తప్పిపోయి చనిపోయాడనుకున్న రమేష్‌ను చూసి ఆయన అక్కయ్య కన్నీటి పర్యంతమైనట్టు తెలిపారు. మాతృదేవోభవ అనాథ ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరికి రమేష్ కుటుంబ సభ్యులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిని గుర్తుచేసే నటన

సినీ రంగంలో అతి తక్కువ కాలంలో గొప్ప పేరు తెచ్చుకోవడం అంత తేలికైన పని కాదు. అలాగే ఒక్కసారి ఫేమ్ వచ్చిన తర్వాత దాన్ని ఎక్కువ కాలం నిలుపుకోవడం కూడా అంత సులువు కాదు. ఇలాంటి నటులు అతి తక్కువ మంది ఉంటారు. అలాంటి వారిలో సౌందర్య ఒకరు. తెలుగు సినీ పరిశ్రమలో ప్రభావవంతమైన నటీమణులలో ఆమె కూడా ఒకరు. తన అద్భుతమైన నటన, చెరగని చిరునవ్వుతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్రవేశారు. ఈ రోజు ఆమె జన్మదినం సందర్భంగా ఆమె నటనా ప్రస్థానం నేటి మానవిలో...



సౌందర్య సొంతూరు బెంగుళూరు. తండ్రి కె.ఎస్. సత్యనారాయణ అయ్యర్, కన్నడ సినీ నిర్మాత. తల్లి మంజుల. ఈమె అసలు పేరు సౌమ్య. సినీరంగంలోకి ప్రవేశించిన తర్వాత సౌందర్యగా మార్చుకున్నారు. తండ్రి సినీ రంగంలో ఉండడంతో పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆమె మొదటి చిత్రంలో నటించారు. ఎంబీబీఎస్ మొదటి ఏడాదిలో ఉండగా ఆమె తండ్రి స్నేహితుడు గంధర్వ చిత్రంలో నటించేందుకు ఆమెకు అవకాశం ఇచ్చారు. తర్వాత 'మనవరాలి పెళ్లి' సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయ్యారు. ఆ తర్వాత తెలుగులో నటించిన అమ్మోరు విజయవంతంగా కావడంతో చదువు మధ్యలోనే ఆపేసి సినీ రంగంలోకి వచ్చేశారు. ఈ చిత్రానికి ఉత్తమ నటిగా ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకున్నారు. తెలుగు చిత్రపరిశ్రమలో మంచి పేరు ప్రఖ్యాతులు గడించి విజయఢంకా మోగించారు.

ఆరు ఫిల్మ్‌ఫేర్‌లు...

వెంకటేష్ సరసన రాజా, జయం మనదేరా, పెళ్లి చేసుకుందాం, పవిత్రబంధం వంటి సూపర్ హిట్ సినిమాలలో నటించి ప్రశంసలందుకున్నారు. వారిద్దరూ తెలుగు సినిమా పరిశ్రమలో అత్యంత విజయవంతమైన జంటగా గుర్తింపబడ్డారు. సౌందర్య మొదటి నుండి అందాల ప్రదర్శనకి బద్ధ వ్యతిరేకి. తెలుగు ప్రజలు ఆమెనెప్పటికీ మరువలేరు. పన్నెండ్ల అచిరకాలంలోనే సౌందర్య ఆరు ఫిల్మ్ ఫేర్ పురస్కారాలను అందుకున్నారు. అవి అమ్మోరు (1994), అంత:పురం (1998), రాజా (1999), ద్వీప (2002) (ఉత్తమ నిర్మాత విభాగాల్లో రెండు పురస్కారాలు), ఆప్తమిత్ర (2004), కర్ణాటక ప్రభుత్వం నుండి నాలుగు ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకున్నారు.

పరిశ్రమలో లైట్ బాయ్ స్థాయి నుండి ప్రతి ఒక్కరినీ ఆదుకునే మనిషిగా సౌందర్యకు మంచి పేరు ఉంది. వీటన్నింటి మూలంగానే కాక అభిమానుల హృదయాలలోనూ సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది. సౌందర్యని తెలుగింటి ఆడపడుచుగా ఆదరించారు. ఆమెను జూనియర్ సావిత్రి అంటారు. సౌందర్యకు నవరసనటన మయూరి అనే బిరుదు గలదు.

సేవచేయడమంటే ఇష్టం

హిందీ చిత్రం సూర్యవంశంలో అమితాబ్ బచ్చన్‌తో నటించి మెప్పించారు. అన్ని దక్షిణాది భాషల్లో ప్రముఖ హీరోలతో నటించారు. పేరుకు తగ్గట్టుగా ఆమె మనసు కూడా సౌందర్యమే. చిన్నతనం నుండి ప్రజలకు సేవ చేయాలనే భావన ఎక్కువగా ఉండేది. అందుకే చిత్ర పరిశ్రమలోకి వచ్చిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు కూడా చేసేవారు. ఈమె మేనమామ, తన బాల్య స్నేహితుడు, సాఫ్ట్‌వేర్ ఇంజనీరు అయిన జి.ఎస్.రఘును ఏప్రిల్ 27న వివాహం చేసుకున్నారు. భర్త, ఆడపడుచు సహకారంతో 'అమర సౌందర్య సోషియల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్' ద్వారా ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టారు. కర్ణాటక ములబాగల్ తాలూకాలోని తమ గ్రామం గంగికుంటను అభివృద్ధి పరిచారు. ఓ అనాధ ఆశ్రమాన్ని, 'అమర సౌందర్య విద్యాలయం' పేరుతో ఓ పాఠశాలను కూడా ప్రారంభించారు. ఆమె మరణించిన తర్వాత కూడా వీరి కుటుంబం ఇప్పటికీ ఈ విద్యాలయాలకు ధన సహాయం చేస్తూనే ఉంది.

నటనకు పట్టాభిషేకం


తెలుగుతో పాటు కన్నడ, తమిళం, మలయాళం చిత్రాలతో పాటు ఒక హిందీ చిత్రంలోనూ నటించారు. పవిత్రబంధం చిత్రంలో ఆమె స్వాభిమానం కల యువతిగా రాధ పాత్రలో అద్భుతంగా నటించి ప్రేక్షకుల మనసు దోచుకోవడమే కాక ఈ చిత్రానికి బంగారు నంది అవార్డును అందుకున్నారు. గిరీష్ కాసరవల్లి దర్శకత్వంలో ద్వీప అనే కన్నడ చిత్రాన్ని నిర్మించారు. ఈచిత్రం జాతీయ పురస్కారాలలో ఉత్తమ చిత్రానికి గాను స్వర్ణకమలంతో పాటు పలు పురస్కారాలు అందుకుంది. ఈ చిత్రానికి కర్ణాటక ప్రభుత్వం నుండి ఉత్తమ నటి, ఉత్తమ చిత్రం, ఉత్తమ ఛాయా చిత్రగ్రహణానికిగాను పురస్కారాలు లభించాయి. పలు అంతర్జాతీయ చిత్రోత్సవాలలో కూడా ప్రదర్శింపబడింది. పెళ్లి చేసుకుందాం రా సినిమాలో అత్యాచారానికి గురైన శాంతి పాత్రలో సమాజం నుండి ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలు, వాటిని అధిగమించడానికి ఆమె పోరాటం ఈ చిత్రంలో హైలైట్ అని చెప్పవచ్చు.

ఎప్పటికీ నిలిచి ఉంటారు

2004లో లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం చేసేందుకు ఏప్రిల్ 17వ తేదీన బెంగుళూరులోని జక్కూరు విమానాశ్రయం నుండి తెలంగాణలోని కరీంనగర్ వచ్చేందుకు చార్టెర్డ్ విమానంలో బయలుదేరారు. ఆ విమానంలో సౌందర్య, ఆమె సోదరుడు అమరనాథ్ ఉన్నారు. విమానం గాలిలోకి ఎగిరిన కొన్ని క్షణాలకే పక్కనే ఉన్న గాంధీ విశ్వవిద్యాలయం ఆవరణలో కుప్పకూలిపోవడంతో సజీవ దహనం అయ్యారు. అలా సహజ నటి నటనకు తెలుగు ప్రేక్షకులు దూరమయ్యారు.

సౌందర్య మరణించిన తర్వాత కుటుంబ సభ్యుల మధ్య కొన్ని ఆస్తి తగాదాలు జరిగి కోర్టు వరకు వెళ్లారు. చివరకు ఆ సమస్యలు సద్దుమణిగాయి. ఏది ఏమైనా అలనాటి మహానటి సావిత్రిని గుర్తు చేసే నటన సౌందర్యది. 100కు పైగా చిత్రాలలో నటించి అనేక అవార్డులు గెలుచుకున్నారు. భౌతికంగా ఆమె మనకు దూరమైనా ఆమె చేసిన పాత్రలతో ఎప్పుడు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయారు.

- పాలపర్తి సంధ్యారాణి.



ఇట్లు చేద్దాం

ఎండు కొబ్బరి సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి.



కంటి జాగ్రత్తలు ఇలా!

మీ చేతులను తరచుగా సబ్బుతో కడుక్కోండి, మీ కళ్ళను చేతితో తాకకుండి. టవల్, కాంటాక్ట్ లెన్స్‌లను వేరే వారితో షేర్ చేసుకోవద్దు. వర్షం, గాలి నుంచి మీ కళ్ళను రక్షించడానికి సన్ గ్లాసెస్ లేదా గ్లాసెస్ ఉపయోగించండి. మీ కళ్ళు తడిగా ఉంటే వాటిని శుభ్రమైన, పొడి గుడ్డతో తుడవడం ద్వారా వాటిని పొడిగా ఉంచండి. అవసరమైతే శుభ్రమైన, ఫిల్టర్ చేసిన నీటితో మీ కళ్ళను కడగాలి. పరిశుభ్రత సరిగా లేని కొలనుల వంటి నీటి ప్రదేశాల్లో ఈత కొట్టకూడదు. బ్యాక్టీరియా పెరుగుదలను నివారించడానికి మీ నివాసం, పని ప్రదేశాలను శుభ్రంగా ఉంచండి. మీ లెన్స్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోండి.

వర్షాకాలంలో కంటి ఇన్‌ఫెక్షన్లు కూడా పెరుగుతాయి. తేమ, వర్షపు నీరు, బాక్టీరియా, వైరస్‌ల పెరుగుదల చాలా ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. వర్షాకాలంలో వచ్చే కొన్ని సాధారణ కంటి ఇన్ఫెక్షన్లను తెలుసుకుందాం.

కంజెక్టివైటిస్

దీనినే పింక్ ఐ అని కూడా పిలుస్తారు, ఇది సాధారణంగా వైరస్‌లు లేదా బ్యాక్టీరియా వల్ల వస్తుంది. కండ్లు ఎరుపు రంగులోకి మారి దురద వస్తుంది. ఇది ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది.

డాక్రియోసిస్టిటిస్

ఈ రకమైన ఇన్ఫెక్షన్, టియర్ (లాక్రిమల్) గ్రంథిలో ఏదైనా అడ్డుపడటం వల్ల ఏర్పడుతుంది. కన్ను నొప్పిగా ఉండటం, ఎర్రగా అవ్వడం, కన్ను లోపల వాపు ఉండటం దీని లక్షణాలు.

బ్లెఫరిటిస్(కనురెప్పల ఉబ్బడం)

బ్లెఫారిటిస్ వల్ల కనురెప్పలు వాపుగా ఉంటాయి. ఈ రకమైన ఇన్‌ఫెక్షన్‌లో కన్ను ఎర్రగా అవుతుంది. కన్ను దురదగా ఉండటం, కనురెప్పలు ఉబ్బి ఉంటాయి.

కంటికురుపు

హార్డియోలమ్ అని కూడా పిలుస్తారు. ఇది కనురెప్పలో తైల గ్రంథుల ఇన్ఫెక్షన్ వల్ల వస్తుంది. సాధారణంగా స్టెఫిలోకాకస్ బ్యాక్టీరియా వల్ల ఇన్‌ఫెక్షన్ వస్తుంది. దీని వల్ల కన్ను ఎరుపు రంగులోకి మారి, కురుపు ఏర్పడి నొప్పి ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే కంటి వైద్యులను సంప్రదించాలి.

మేడి పండు చందంగా ఆర్థిక వ్యవస్థ

(మొదటిపేజీ తరువాయి)

వేమన పద్యం గుర్తుంది కదా. భారత ఆర్థిక వ్యవస్థ కూడా ఇప్పుడు అలాంటి సమస్యలనే ఎదుర్కొంటోంది. అవి చిన్నా చితకా సమస్యలు కావు. పెద్దవే. దేశ ఆర్థిక వ్యవస్థ పరిణామాన్ని లెక్కించే స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) గడచిన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణ సర్దుబాటుతో 8.2 శాతం పెరిగింది. అయితే అదే సంవత్సరంలో ప్రైవేటు వినియోగ వ్యయం (వస్తువులు, సేవల కొనుగోలు కోసం మనం పెట్టే ఖర్చు) కేవలం 4 శాతం మాత్రమే పెరిగింది. 2002-03 తర్వాత వినియోగ వ్యయం ఈ స్థాయిలో నెమ్మదించడం ఇదే మొదటిసారి.



పడిపోయిన ఆర్థికేతర సంస్థల అమ్మకాలు

దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రైవేటు వినియోగ వాటా 55-60 శాతం ఉండడం ఆందోళన కలిగించే విషయం. అయితే ప్రజల వినియోగ వృద్ధిలో మందగమనం కార్పొరేట్ సంస్థల ఆర్థిక ఫలితాల్లో కన్పించదు. 2023-24లో స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన 3,900కు పైగా ఆర్థికేతర సంస్థల నికర అమ్మకాలు కేవలం ఒక శాతం మాత్రమే పెరిగాయి. ఈ పెరుగుదల 2021-22లో 34.9 శాతం, 2022-23లో 22.6 శాతంగా నమోదైంది.

గొప్పంగా జీఎస్టీ వసూళ్లు

ఇటీవలి కాలంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మందగించాయి. మేలో జీఎస్టీ వసూళ్లు కేవలం 9.96 శాతం మాత్రమే పెరిగాయి. 2021 తర్వాత జీఎస్టీ వసూళ్లలో వృద్ధి పది శాతం కంటే తగ్గడం ఇదే మొదటిసారి. జూన్‌లో ఈ పెరుగుదల కేవలం 7.8 శాతంగానే నమోదైంది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇప్పుడు జీఎస్టీ వసూళ్ల సమాచారాన్ని విడుదల చేయడం లేదు. జీఎస్టీ వసూళ్లలో తగ్గుదలను గమనిస్తే జనాభాలో ఎక్కువ మంది వినియోగ వస్తువుల కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారని అర్థమవుతోంది. ద్రవ్యోల్బణం అధికంగా ఉండడమే దీనికి కారణం. పట్టణ ప్రాంతాల్లో ద్రవ్యోల్బణం తగ్గుతుండగా గ్రామీణ ప్రాంతాల్లో అధికంగానే ఉంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో పట్టణ ద్రవ్యోల్బణం 5.1 శాతం ఉండగా గ్రామీణ ద్రవ్యోల్బణం 5.6 శాతంఉంది.

రెండు వేల ఉద్యోగాలు.. 25 వేల మంది హాజరు

(మొదటిపేజీ తరువాయి)

లోడర్స్ అవసరం ఉంటుంది. వారికి నెలకు రూ.20వేల నుంచి 25 వేలకు వేతనం అందిస్తారు. ఓవర్‌టైమ్ చేసి చాలామంది రూ.30వేల వరకు సంపాదిస్తుంటారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హతలు ఉంటే సరిపోతుంది కానీ, అభ్యర్థులు శారీరకంగా ధృఢంగా ఉండటం తప్పనిసరి. అయితే ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు కొందరు 400 కి.మీ. ప్రయాణించి రావడం గమనార్హం. వారిలో పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా ఇప్పటివరకు ఉద్యోగం లభించని వారూ ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చారు. మరికొందరు రాజస్థాన్ నుంచి వచ్చిన వారున్నారు.

రుణమాఫీ మార్గదర్శకాలు సవరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఉండదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అందరికీ రుణమాఫీని వర్తింపజేస్తామని ఎన్నికలకు ముందు ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పుడు వారిని విస్మరించిందన్నారు. చిన్న, సన్నకారు రైతులందరూ ఈ పథకంలో లబ్దిపొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ లియబిలిటీ గ్రూపులుగా కౌలుదార్లను రూపొందించి ఈ పథకాన్ని వారికి వర్తింపజేయాలన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టాలు వచ్చినప్పుడు ప్రభుత్వం రుణాలను రీషెడ్యూల్ చేస్తుందని, అలాంటప్పుడు రీషెడ్యూల్‌కు రుణమాఫీ వర్తింపజేయకపోవడమేమిటని రాఘవులు ప్రశ్నించారు. రీషెడ్యూల్ చేసిన రుణాలను కూడా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుమిత్ర గ్రూపుల్లో చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులున్నారన్నారు. రైతుమిత్ర గ్రూపులు రుణాలు తీసుకోవడానికి అర్హులవుతారు కానీ, రుణమాఫీకి అనర్హులవుతారా ? అని ప్రశ్నించారు. తొలుత రేషన్‌కార్డు ప్రామాణికమని ప్రకటించారని, విమర్శలు రాగానే పట్టాదారు పాసుపుస్తకమని చెబుతున్నారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసుకుంటున్న గిరిజన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేవన్నారు. వీరంతా నష్టపోయే ప్రమాదముందని, పట్టాదారు పాసుపుస్తకాలు లేకపోయినా, పహాణీలో పేరున్న రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

త్వరితగతిన కులగణన చేపట్టాలి..

ముఖ్యమంత్రి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో కులగణనకు ఐదు నెలలు పట్టే అవకాశముందని అధికారులు చెప్పినట్టు తెలిసిందని, అవసరమైతే ఎక్కువ మంది సిబ్బందిని పెట్టి త్వరితగతిన కులగణన పూర్తి చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని రాఘవులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ పార్టీ జనగణనకు సంబంధం లేకుండా కులగణన చేపడతామని హామీనిచ్చిందని గుర్తు చేశారు. 2021లో కేంద్రం జనగణన చేయాల్సి వుండగా చేయలేదన్నారు. జనగణనతో పాటు కులగణన చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తూ వచ్చిందన్నారు. బీసీల రిజర్వేషన్లు వివాదాస్పదం అవుతున్నందున వెంటనే కుల గణన చేసి రిజర్వేషన్లను నిర్ణయించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు. కులగణనకు ఎక్కువ సమయం పడుతున్నందున.. ముందుగా ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సందేహాలు వ్యక్తమవుతున్నాయన్నారు. అందువల్ల వెంటనే కులగణన షెడ్యూల్ ప్రకటించి.. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

సీఎం రేవంత్ జోక్యం చేసుకోవాలి

వరంగల్, హన్మకొండ, కాజీపేట నగరాల్లో చెరువులను ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్నారంటూ మున్సిపల్ అధికారులు నోటీసులివ్వడాన్ని రాఘవులు తప్పుపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. హైకోర్టు తీర్పు పేరిట ఇలాంటి చర్యలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వమే పట్టాలిచ్చి, వారందరూ ఇండ్లను నిర్మించుకున్నాక.. అనర్హులని ఖాళీ చేయాలనడం సరైంది కాదన్నారు. అవసరమైతే ప్రభుత్వం కోర్టులో మళ్లీ అప్పీల్ చేయాలన్నారు. ఈ విషయం కేవలం వరంగల్ నగరానికే పరిమితం కాదని, భవిష్యత్‌లో మరిన్ని నగరాలకు వ్యాపించే అవకాశం లేకపోలేదన్నారు.

ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు ఈ విషయంలో తొందరపాటుతో వ్యవహరించొద్దన్నారు. ప్రభుత్వం పట్టాలిస్తేనే అక్కడ నిరుపేదలు వేలాది రూపాయలు వెచ్చించి ఇండ్లను నిర్మించుకున్నారని, స్వాతంత్ర్య సమరయోధులు, వితంతువులు, జర్నలిస్టులు, మాజీ సైనికుల కుటుంబాలకు ఇచ్చిన పట్టా స్థలాల్లోనే ఇండ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) హన్మకొండ జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, ఎం.చుక్కయ్య, జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, కాడబోయిన లింగయ్య, జి.రాములు, దీప ఉన్నారు.

ఆ ఎమ్మెల్యేలు మాజీలయ్యే వరకు నిద్రపోం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం రామచంద్రాపురం పట్టణంలోని భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 2001లో కేసీఆర్ పిడికెడు మందితో ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. "అప్పుడు కూడా కుట్రలు జరిగాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 12మంది ఎమ్మెల్యేలను లాక్కున్నారు.. కానీ న్యాయం గెలిచింది. కేసీఆర్ 14 ఏండ్లు పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందన్న వాళ్లు తర్వాత కనిపించకుండా పోయారు. పార్టీకి కష్టాలు వస్తాయి. మీరు ధైర్యంగా ఉండండి. మీ బాధ్యత నేను తీసుకుంటా.." అని కార్యకర్తలకు హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పోతే పార్టీకి ఎటువంటి నష్టం లేదని.. ఇక్కడ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా మళ్లీ ఎగిరేది గులాబీ జెండానే అని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడితేనే మహిపాల్ రెడ్డి గెలిచారని, పటాన్‌చెరుకు ఏం కావాలంటే అది ఇచ్చామని, రోడ్లు, తాగునీళ్లు, స్టేడియం వంటి ఎన్నో అందించామని.. అయినా ఎమ్మెల్యే పార్టీ మారడం సరైన పద్ధతి కాదన్నారు. మహిపాల్ రెడ్డికి మూడుసార్లు టికెటిచ్చి గెలిపిస్తే పార్టీ మారడానికి మనసెలా వచ్చిందని ప్రశ్నించారు. కార్యకర్తలకు ధైర్యం చెబుదామని వచ్చిన.. కానీ నాకే మీరు వేలాది మందిగా తరలివచ్చి ధైర్యం చెప్పారని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసుకుందాం.. మళ్లీ గులాబీ జెండా ఎగిరేవరకు కష్టపడి పనిచేద్దామని అన్నారు. పార్టీ మారితే రాళ్లతో కొట్టండి అన్న రేవంత్.. ఇప్పుడు తానే ఇండ్లకు వెళ్లి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యేలు పార్టీ మారిన చోట ఉప ఎన్నికలు కచ్చితంగా వస్తాయి. దానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని సూచించారు.

రేషన్ కార్డు ఆధారంగా రైతు రుణమాఫీ అని చెప్పి.. వ్యతిరేకత వస్తుందని మాట మార్చుతున్నారని అన్నారు. పాస్ బుక్ ఉంటే సరిపోతుందని నోటి మాటతో చెప్పడం కాదు.. అదే నిజమైతే జీవో మార్చాలని డిమాండ్ చేశారు. రుణమాఫీకి పీఎం కిసాన్ నిబంధనలు ఎందుకు? రేషన్ కార్డు నిబంధనలు ఎందుకు? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు, కార్పొరేటర్, మున్సిపాలిటీ, అసెంబ్లీ ఎన్నికలు ఇలా ఏ ఎన్నికలు వచ్చినా కష్టపడి పనిచేసి పార్టీని గెలుద్దామని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, సత్యనారాయణ, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్, బొల్లారం మున్సిపాలిటీ చైర్మెన్ రోజా బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ రెడ్డి, సోమిరెడ్డి, రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో 'నైనీ' బొగ్గు ఉత్పత్తి

(మొదటిపేజీ తరువాయి)

ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నైనీ బొగ్గు బ్లాకు పనుల పురోగతిపై ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్, సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్, స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, ఇంధన శాఖ ఓఎస్డీ సురేందర్ రెడ్డి, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్) దేవేందర్ తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నైనీ బొగ్గు ఉత్పత్తి ప్రారంభానికి ఒడిశా ప్రభుత్వం పూర్తి సహకారాన్ని అందించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసిన నేపథ్యంలో పనుల్ని వేగవంతం చేయాలని చెప్పారు. 135 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ తొలిసారిగా తెలంగాణ వెలుపల ఈ ప్రాజెక్టు చేపడుతున్నదని తెలిపారు. మైనింగ్ సందర్భంగా స్థానికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. పనుల వేగవంతం కోసం నైనీ జనరల్ మేనేజర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి, బాధ్యతలు అప్పగించాలని సూచించారు. హై టెన్షన్ విద్యుత్ లైన్ నిర్మాణం కోసం ఆ రాష్ట్ర విద్యుత్ శాఖతో సంప్రదింపులు చేస్తూ ముందుకు సాగాలని చెప్పారు. పునరావాసం, నష్టపరిహారం అంశాలపై చర్చించే ఆర్పీడీఏసీ సమావేశాన్ని త్వరగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు.

ఒమెన్ తీరంలో

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



ఒమన్: గల్ఫ్ దేశమైన ఒమన్ సముద్ర తీరంలో విషాదం చోటుచేసుకుంది. కొమొరోస్ జెండాతో వెళ్తున్న చమురు ట్యాంకర్ బోల్తా పడి సముద్రంలో మునిగిపోయింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో 16 మంది నౌక సిబ్బంది గల్లంతు అయ్యారు. వీరిలో 13 మంది భారత సిబ్బంది, ముగ్గురు శ్రీలంక వాసులు ఉన్నారు. మునిగిపోయిన ఓడను ప్రెస్టీజ్ ఫాల్కాన్‌గా గుర్తించారు. పోర్టు టౌన్ దుకమ్‌కు సమీపంలోని రాస్ మద్రాకకు ఆగ్నేయంగా 25 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన జరిగినట్లు ఆదేశ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ పేర్కొంది. ఆయిల్ ట్యాంకర్ మునిగిపోవడానికి కారణాలు వెల్లడించలేదు. ఘటన జరిగిన సమయంలో ఓడలో 16 మంది సిబ్బంది ఉన్నట్లు తెలిపింది. సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పేర్కొంది. ఓడ మునిగిపోయి తలకిందులైనట్లు సమాచారం. అయితే సముద్రంలో చమురు ఉత్పత్తులు లీకైన విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. బుధవారం కూడా సహాయక చర్యలు కొనసాగాయి. ఈ చర్యల్లో పాల్గొనడం కోసం భారత సైన్యానికి చెందిన పి-81 అనే యుద్ధ నౌక కూడా బయలుదేరి వెళ్లింది.

కర్నాటకలో

'స్థానికులకే ఉద్యోగాలు'

బెంగళూరు: కర్నాటకలో 'స్థానికులకే ఉద్యోగాలు' బిల్లుపై ఆ రాష్ట్ర కార్మిక మంత్రిత్వ శాఖ స్పష్టత ఇచ్చింది. ఈ బిల్లు ప్రకారం ప్రయివేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ కోటాలో 70 శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని చెప్పినట్టు వెల్లడించింది. కర్నాటక ప్రయివేట్ సంస్థల్లోని గ్రూప్ సీ, డీ గ్రేడ్ పోస్టుల్లో కన్నడిగులకే 100 శాతం రిజర్వేషన్లకు వీలు కల్పించే బిల్లుకు ఆమోదం తెలుపుతూ కర్నాటక మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం ఈ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం లభించిన తర్వాత సీఎం సిద్ధరామయ్య ఎక్స్‌లో పోస్టు చేశారు. 'రాష్ట్రంలో నెలకొల్పిన అన్ని ప్రయివేట్ పరిశ్రమల్లో సీ, డీ గ్రేడ్ పోస్టులకు సంబంధించి 100 శాతం కన్నడిగుల నియామకాన్ని తప్పనిసరి చేసే బిల్లు కోసం మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వాసులు సుఖవంతమైన జీవనం గడిపేందుకు అవకాశం కల్పించాలని, ఈ గడ్డపై ఉద్యోగాలు కోల్పోకుండా చూడాలనేదే మా ప్రభుత్వ ఆకాంక్ష. మాది కన్నడ అనుకూల ప్రభుత్వం. వారి సంక్షేమమే మా ప్రాధాన్యం" అని ఈ పోస్టులో ముఖ్యమంత్రి తెలిపారు. దీంతో ఈ బిల్లుపై పారిశ్రామిక వేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో తాను చేసిన పోస్టును సీఎం తొలగించారు. ప్రయివేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 70 శాతం, మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని తాము చెప్పినట్టు కర్నాటక కార్మిక శాఖ వివరణ ఇచ్చింది. అలాగే ముఖ్యమంత్రి కూడా రాష్ట్రంలోని ప్రయివేటు పరిశ్రమలు, ఇతర సంస్థల్లో అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో 50శాతం, నాన్- అడ్మినిస్ట్రేటివ్ ఉద్యోగాల్లో 75శాతం చొప్పున కన్నడిగులకు రిజర్వేషన్లు కల్పించాలనే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్టు తాజాగా మరో పోస్ట్‌లో వెల్లడించారు. కోటాపై దుమార చేలరేగటంతో సిద్ధరామయ్య సర్కార్ వెనకడుగు వేసిందని సమాచారం. ఈ నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్టు లీకులు వస్తున్నాయి.

నేను ఆరోగ్యంగానే ఉన్నా..



ఆర్.నారాయణమూర్తి

నటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్. నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన నిమ్స్ హాస్పిటల్‌లో డాక్టర్ బీరప్ప నేతృత్వంలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్య నిమిత్తమై భయపడాల్సిన అవసరం లేదని, సాధారణమైన టెస్ట్‌లు మాత్రమే చేస్తున్నామని డాక్టర్ బీరప్ప తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని పేర్కొన్నారు.

బుధవారం ప్రసాద్ ల్యాబ్ వద్ద ఉన్న ఆర్ నారాయణమూర్తికి సడెన్‌గా నీరసం రావడంతో, వెంటనే అక్కడి నుంచి నిమ్స్ హాస్పిటల్‌కి చేరుకున్నారు. రెండు నెలల క్రితం ఆయన బైపాస్ సర్జరీ చేయించుకుని ఉండటంతో, డాక్టర్లు ఆయన ఆరోగ్యాన్ని క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు. అయితే తన ఆరోగ్యం బాగోలేదని మీడియాలో వస్తున్న పలు వార్తల నేపథ్యంలో ఆర్.నారాయణమూర్తి స్పందించారు.

'నేను ఆరోగ్యంగానే ఉన్నా.. నా ఆరోగ్యం గురించి అభిమానులు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నా. దేవుడి దయతో బాగానే కోలుకుంటున్నా. పూర్తిగా కోలుకున్నాక అన్ని వివరాలు చెబుతాను. అప్పటివరకు ఎలాంటి వదంతులు నమ్మవద్దు' అని నారాయణమూర్తి తెలిపారు.

ఆద్యంతం వినోదాత్మకం



ప్రియదర్శి

ప్రియదర్శి, నభా నటేష్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్'. అశ్విన్ రామ్ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించిన ఈ చిత్రం ఈనెల 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో ప్రియదర్శి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'కమెడియన్‌గా మొదలై సీరియస్ కథలు చేస్తూ ఈసినిమాతో లవర్ బాయ్‌గా రావడం చాలా హ్యాపీగా ఉంది. ఎందుకంటే కంటెంట్‌కి మంచి రోజులు వచ్చాయని భావిస్తున్నాను. కొత్త కథలు, వినూత్నమైన ఆలోచనలని ప్రేక్షకులు ఇష్టపడుతున్నారు. 'మల్లేశం, బలగం, సేవ్ ది టైగర్స్'కి వచ్చిన రెస్పాన్స్ చూస్తుంటే... ఫ్యామిలీ డ్రామాకి ఎప్పుడూ స్పేస్ ఉందని నిరూపించాయి. ఫ్యామిలీ డ్రామాలు ఇండియన్ సొసైటీలో ఎవర్ గ్రీన్. జనరల్‌గా మ్యారేజ్‌ని చాలా స్టీరియోటిపికెల్ అప్రోచ్‌లో చూస్తాం. డార్లింగ్ విషయానికి వస్తే.. ఉమన్ క్యారెక్టర్ స్ప్లిట్ పర్సనాలిటీ అనే స్పెషల్ కండీషన్ ఉంటుంది. దీన్ని ప్రజెంట్ చేసిన తీరు చాలా వైవిధ్యం. రెండు క్యారెక్టర్‌లు సీరియస్‌గా బాధపడుతుంటే ప్రేక్షకుడికి నవ్వొస్తుంది. డార్క్ కామెడీలో ఉన్న మ్యాజిక్ ఇది. ఇందులో అది చాలా అద్భుతంగా ఎక్స్‌ప్లోర్ చేశాం. నభా లాంటి యాక్టర్‌తో నేనెప్పుడూ పని చేయలేదు. నాలాంటి యాక్టర్‌తో తనూ ఎప్పుడూ వర్క్ చేయలేదు. మా ఇద్దరి పెయిరింగ్ చాలా ఫ్రెష్‌గా ఉందని చాలా మంది అన్నారు. ఇందులో నా క్యారెక్టర్, నభా క్యారెక్టర్ చాలా డిఫరెంట్‌గా ఉంటాయి. మా నిర్మాతలు నిరంజన్, చైతన్య ట్రూ డార్లింగ్స్. ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చారు. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. డైరెక్టర్ అశ్విన్ రామ్‌లో మంచి లీడర్ షిప్ క్వాలిటీస్, కమ్యునికేషన్ స్కిల్స్, క్లియర్ విజన్ ఉన్నాయి. రానున్న రోజుల్లో పెద్ద డైరెక్టర్ అవుతాడు. ఈ సినిమాని అద్భుతంగా తీశాడు'.

100 రూపాయలకే సినిమా



క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ సంస్థ నుంచి నిర్మాత రాకేష్ వర్రే నిర్మించిన చిత్రం 'పేక మేడలు'. వినోద్ కిషన్ హీరోగా, అనూష కృష్ణ హీరోయిన్‌గా నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో వస్తున్న సినిమా ఇది. ఇటీవలే వైజాగ్, విజయవాడలో వేసిన స్పెషల్ షోస్‌లో పబ్లిక్ రెస్పాన్స్ చాలా వచ్చింది. ప్రతి ఒక్కరూ సినిమా చూసే విధంగా రూ100కే టికెట్లు రేట్లు ఉండడం సినిమాకి ప్లస్. ఈ సినిమాని తెలుగులో నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

ఈ సందర్భంగా నిర్మాత డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ, 'ఈ సినిమా చూసి నచ్చి ఇంకా బాగా ప్రమోట్ చేయొచ్చు అనిపించింది. ఇలాంటి సినిమాని మంచిగా ప్రమోట్ చేసి ప్రేక్షకుల ముందు తీసుకెళ్తే ఇంకా పెద్ద విజయం అవుతుంది. పెద్ద సినిమాలు ఏ రేట్ పెట్టిన ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు కానీ చిన్న సినిమాలకి తక్కువ రేట్లు ఉంటే కానీ రారు. ఈ సినిమా కోసం టికెట్ రేట్లను రూ.100కు తగ్గించాం. పెద్ద సినిమాలతో పోటీ పడలేక చిన్న సినిమాలు ఇబ్బందులు పడుతున్నాయి. ప్రేక్షకులకు మంచి సినిమాని అందించే ప్రయత్నంలోనే విజయవాడ, వైజాగ్, హైదరాబాద్‌లో పలు ప్రదేశాల్లో పెయిడ్ ప్రీమియర్స్ 50 రూపాయలకే టికెట్ రేట్ పెట్టి ఎక్కువమంది సినిమా చూసేలాగా ప్లాన్ చేశాం. చూసిన ప్రతి ఒక్కరూ కూడా సినిమా బాగుందని ప్రశంసిస్తున్నారు' అని అన్నారు.

'పెయిడ్ ప్రీమియర్స్‌కి వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉంది. 'పేక మేడలు' టీమ్ అని గుర్తుపట్టి సినిమా గురించి చాలా పాజిటివ్‌గా చెబుతున్నారు. ధీరజ్ నాకు ముందు నుంచే పరిచయం ఉన్నప్పటికీ ఈ సినిమా చూసి నచ్చి, నేను రిలీజ్ చేస్తానని ముందుకు వచ్చారు. అదేవిధంగా మా సినిమాను సపోర్ట్ చేస్తున్న రానా దగ్గుబాటి, అడివి శేష్, విశ్వక్ సేన్‌కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ఓ మంచి సినిమాని తీశామని గర్వంగా ఫీల్ అవుతున్నాం. ప్రేక్షకులకు కచ్చితంగా ఈ సినిమా నచ్చుతుంది అని ఆశిస్తున్నాను' అని నిర్మాత రాకేష్ వర్రే చెప్పారు.

భారత్ తొలి ప్రత్యర్థి పాకిస్తాన్

రేపటి నుంచి మహిళల ఆసియా కప్



ధంబుల్లా (శ్రీలంక): మహిళల ఆసియాకప్‌కు రంగం సిద్ధమైంది. మొత్తం 8జట్ల మధ్య జరిగే 2024 మహిళల ఆసియాకప్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీలంక ఆతిథ్యమిస్తోన్న ఈ టోర్నమెంట్‌లో దంబుల్లా వేదికగా మొత్తం మ్యాచ్‌లు జరగనున్నాయి. గ్రూప్-ఎలో భారత్‌తోపాటు పాకిస్తాన్, యుఎఇ, నేపాల్... గ్రూప్-బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడనుంది. మూడు లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ టాప్-2 జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. గ్రూప్-ఎలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-బిలో రెండోస్థానంలో నిలిచి జట్టుతో, గ్రూప్-బిలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్-ఎలో రెండోస్థానంలో నిలిచిన జట్టుతో తలపడనున్నాయి. 2022లో బంగ్లాదేశ్ వేదికగా జరిగిన చివరి ఆసియాకప్‌లో భారతజట్టు విజేతగా నిలిచింది. ఇప్పటి వరకు 8సార్లు మహిళల ఆసియాకప్ టోర్నీ జరగ్గా భారత్ ఏకంగా 7సార్లు విజేతగా నిలిచింది. 2018లో బంగ్లాదేశ్ ఫైనల్లో భారత్‌ను చిత్తుచేసి తొలిసారిగా విజేతగా నిలువగా.. భారత్ రన్నరప్‌తో

గ్రూప్-బి: శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ షెడ్యూల్...

19(శుక్ర)	నేపాల్ × యుఎఇ	మ.2.00గం॥
	ఇండియా × పాకిస్తాన్	రా.7.00గం॥
20(శని)	మలేషియా × థాయ్‌లాండ్	మ.2.00గం॥
	శ్రీలంక × బంగ్లాదేశ్	రా.7.00గం॥
21(ఆది)	ఇండియా × యుఎఇ	మ.2.00గం॥
	నేపాల్ × పాకిస్తాన్	రా.7.00గం॥
22(సోమ)	శ్రీలంక × మలేషియా	మ.2.00గం॥
	బంగ్లాదేశ్ × థాయ్‌లాండ్	రా.7.00గం॥
23(మంగళ)	పాకిస్తాన్ × యుఎఇ	మ.2.00గం॥
	ఇండియా × నేపాల్	రా.7.00గం॥
24(బుధ)	బంగ్లాదేశ్ × మలేషియా	మ.2.00గం॥
	శ్రీలంక × థాయ్‌లాండ్	రా.7.00గం॥
26(శుక్ర)	సెమీఫైనల్-1	మ.2.00గం॥
	సెమీఫైనల్-2	రా.7.00గం॥
28(ఆది)	ఫైనల్	రా.7.00గం॥

వెస్టిండీస్‌తో రెండోటెస్ట్‌కు ఇంగ్లండ్ రెఢీ

ఇంగ్లండ్ బౌలింగ్ మెంటార్‌గా అండర్సన్



లార్డ్స్: వెస్టిండీస్‌లో ట్రెంట్‌బ్రిడ్జ్ వేదికగా రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు సిద్ధమైంది. తొలిటెస్ట్‌లో వెస్టిండీస్‌పై ఇన్నింగ్స్ 114పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన ఇంగ్లండ్ జట్టు రెండో టెస్ట్ బరిలోకి దిగుతోంది. మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు 1-0 ఆధిక్యతలో ఉండగా.. 2012 తర్వాత ఇంగ్లండ్ క్రికెట్ జట్టు టెస్టుల్లో స్టువర్ట బ్రాడ్, అండర్సన్ లేకుండా బరిలోకి దిగడం ఇదే తొలిసారి. మరోవైపు వెస్టిండీస్ టెస్టుల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. ఆ జట్టు అన్ని విభాగాల్లోనూ రాణిస్తేనే ఇంగ్లండ్‌కు గట్టి పోటీ ఇవ్వనుంది.

బౌలింగ్ మెంటార్‌గా అండర్సన్..

మాజీ పేసర్ జేమ్స్ అండర్సన్ మళ్లీ జాతీయ జట్టుతో చేరాడు. 41ఏళ్ల అండర్సన్ వెస్టిండీస్‌తో గురువారం నుంచి లార్డ్స్ వేదికగా జరిగే రెండో టెస్ట్‌కు ఇంగ్లండ్ జట్టు మెంటార్‌గా ఎంపికయ్యాడు. వెస్టిండీస్‌తో తొలి టెస్టు ముగిసిన తర్వాత అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. అయితే రిటైర్మెంట్ ప్రకటించిన మూడు రోజులకే మళ్లీ జాతీయ జట్టుకు సేవలందించనున్నాడు. రెండో టెస్టుకు ఇంగ్లండ్ మార్క్‌వుడ్‌ను తుది జట్టులోకి తీసుకుంది.

117మంది అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది

పారిస్ ఒలింపిక్స్ జాబితాకు కేంద్రం ఆమోదం

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే 117మంది భారత అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది వెళ్లనున్నారు. ఆ జాబితాకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఒలింపిక్స్‌కు క్వాలిఫై అయిన మహిళా షాట్ పుటర్ అబా కథువా పేరును ఈ జాబితా నుంచి తొలగించారు. కేంద్రం ఆమోదించిన జాబితాలో ఆమె పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వీరితోపాటు 140మందితో కూడిన సహాయక సిబ్బంది, అధికారుల బృందం కూడా పారిస్ వెళ్లనుంది. ఈసారి అందరి దృష్టి భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే ఉండనుంది. చోప్రా 2021 ఒలింపిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో స్వర్ణం చేజిక్కించుకుని చరిత్ర సష్టించడం తెలిసిందే. ఇటీవల కొంతకాలంగా ప్రపంచ ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలోనూ భారత అథ్లెట్లు రాణిస్తుండ డంతో... పారిస్ ఒలింపిక్స్‌లో మరికొన్ని క్రీడాంశాల్లో పతకాలపై ఆశలు చిగురించాయి. ప్రధానంగా భారత్ రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, బ్యాడ్మింటన్, హాకీ, ఆర్చరీ క్రీడాంశాల్లో పతకాలు దక్కే ఛాన్స్ ఉంది. ఈనెల 26నుంచి పారిస్ వేదికగా 2024 ఒలింపిక్స్ జరగనున్నాయి.

అది అనాలోచిత నిర్ణయం

100 శాతం విద్యుదీకరణ అనర్థదాయకం

కాలుష్యం మరింత పెరుగుతుంది

చార్జీలు పెంచక తప్పదు

రైల్వేల నిర్ణయంపై నిపుణుల హెచ్చరిక



న్యూఢిల్లీ : 2018కి ముందు ఏదైనా ఓ మార్గంలో విద్యుదీకరణ పనులు చేపట్టాలంటే భారతీయ రైల్వేలు ఎన్నో జాగ్రత్తలు తీసుకునేవి. అనేక మార్గదర్శకాలు పాటించేవి. అయితే 2018 తర్వాత వాటన్నింటినీ గాలికి వదిలేశాయి. దేశంలోని బ్రాడ్‌గేజ్ మార్గాలన్నింటికీ విద్యుదీకరణ చేయడమే తన లక్ష్యమని 2018 సెప్టెంబరులో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ప్రకటించింది. విద్యుదీకరణతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని తెలిపింది. నిర్వహణ వ్యయం తగ్గుతుందని, భారీ సరకు రవాణా రైళ్లు, ఎక్కువ బోగీలున్న ప్యాసింజర్ రైళ్లు ప్రయాణించడానికి అనువుగా ఉంటుందని, పర్యావరణానికి మేలు కలుగుతుందని, ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవచ్చునని వివరించింది. అయితే ప్రభుత్వం చెబుతున్న మాటల్లో పస లేదని రైల్వే రంగ నిపుణులు అభిప్రాయపడ్డారు. పైగా 100 శాతం విద్యుదీకరణ అనర్థదాయకమని, దీనివల్ల కాలుష్యం మరింత పెరుగుతుందని హెచ్చరించారు.

ఆ రైళ్లకు డీజిల్ లోకోలూ అనువైనవే

భారీ సరకు రవాణా రైళ్లు, ఎక్కువ బోగీలున్న ప్యాసింజర్ రైళ్లు ప్రయాణించడానికి విద్యుదీకరణ అనువుగా ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ వాదనలోనూ పస లేదు. రైల్వే మార్గాలను ఐదు కేటగిరీలుగా వర్గీకరించారు. గంటకు 160 కిలోమీటర్ల వేగంతో రైళ్లు ప్రయాణించే మార్గాన్ని 'ఏ' కేటగిరీగా, 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే మార్గాన్ని 'బీ' కేటగిరీగా వర్గీకరించారు. జల్పాయిగురి లైను మినహా ఈ రెండు కేటగిరీల్లోని మార్గాల్లో 90% లైన్లను 2018కి ముందే విద్యుదీకరించారు. 'సీ' కేటగిరీలో సబర్బన్ సెక్షన్లు ఉంటాయి. డీ, డీ స్పెషల్ కేటగిరీల్లోని మార్గాల్లో రైళ్ల వేగం గరిష్టంగా గంటకు 110 కిలోమీటర్లు. ఈ మార్గాల్లో చాలా వరకూ 2018కి ముందు విద్యుదీకరణ జరగలేదు. దీంతో ఈ లైన్లలో డీజిల్ లోకోలు నడపడం తప్పనిసరి అయింది. కాబట్టి ఏ, బీ కేటగిరీ రూట్లలో మినహా మిగిలిన లైన్లలో ఎలక్ట్రిక్ లోకోల కంటే డీజిల్ లోకోలను నడపడం ఏ విధంగానూ తక్కువ కాదు. ఆయా మార్గాల్లో భారీ సరకు రవాణా రైళ్లు, ఎక్కువ బోగీలున్న ప్రయాణికుల రైళ్లు నిక్షేపంగా గరిష్ట వేగంతో ప్రయాణిస్తాయి.



ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్నప్పుడే...

ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న మార్గాల్లో మాత్రమే విద్యుదీకరణ లాభదాయకంగా ఉంటుంది. మిగిలిన మార్గాల్లో రైళ్లను డీజిల్‌తో నడపడమే మేలు. ఆ మార్గాల్లో విద్యుదీకరణ కార్యకలాపాలు నిర్వహించడం ఖర్చుతో కూడిన పని. ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చులు తగ్గుతాయని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అవుతుంది.

కాలుష్యాన్ని నివారించలేవు

డీజిల్ లోకోలో కాలుష్యాన్ని విడుదల చేస్తాయని, ఎలక్ట్రిక్ రైళ్లతో ఆ ఇబ్బంది ఉండదని మరో వాదన ఉంది. అయితే ఇందులోనూ వాస్తవం లేదు. దురదృష్టవశాత్తూ 2021-22లో దేశంలో ఉత్పత్తి అయిన విద్యుత్‌లో మూడో వంతు శిలాజ ఇంధనాల నుండి జరిగినదే. ఈ విద్యుత్ ప్లాంట్ల నుండి విడుదలవుతున్న పొగ డీజిల్ లోకో వెదజల్లే పొగ కంటే తక్కువేమీ కాదు. పునరుద్పాదక ఇంధన వనరుల ఉత్పత్తి గురించి ఎన్ని గొప్పలు చెబుతున్నప్పటికీ 2021-22లో దేశంలో ఉత్పత్తి అయిన మొత్తం విద్యుత్‌లో పవన, సౌర వనరుల నుండి జరిగిన ఉత్పత్తి కేవలం 11.5 శాతం మాత్రమే. 2030 నాటికి కర్బన ఉద్గమనాలను తటస్థం చేయాలంటే 30 వేల మెగావాట్ల పునరుద్పాదక ఇంధన వనరులను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. అయితే గత సంవత్సరం ఫిబ్రవరి నాటికి కేవలం 147 మెగావాట్ల సౌర విద్యుత్, 103 మెగావాట్ల పవన విద్యుత్ మాత్రమే ఉత్పత్తి అయింది.

ముడి చమురు వినియోగం స్వల్పమే

2021-22లో భారతీయ రైల్వేలు 1.25 మిలియన్ టన్నుల డీజిల్‌ను వినియోగించాయి. భారత్ వినియోగిస్తున్న మొత్తం డీజిల్‌లో 1.62 శాతం, పెట్రోలియం ఉత్పత్తుల్లో 0.62 శాతం మాత్రమే రైల్వేలు వినియోగిస్తున్నాయి. అంటే విదేశీ మారక ద్రవ్యంపై రైల్వేల డీజిల్ వినియోగం చూపే ప్రభావం కేవలం 0.01 శాతం మాత్రమే.

ఇవేమీ పరిగణనలోకి తీసుకోకుండా...

రైల్వేల వద్ద ఉన్న డీజిల్ ఆస్తులు, ఆ శాఖ చేసుకున్న కాంట్రాక్ట్ ఒప్పందాలను పరిగణనలోకి తీసుకోకుండా వంద శాతం విద్యుదీకరణపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018 మార్చి 31 నాటికి రైల్వేల వద్ద 5,866 డీజిల్ లోకోలు ఉన్నాయి. వీటి విలువ రూ.52,800 కోట్లు ఉంటుందని అంచనా. మరో ముఖ్యమైన విషయమేమంటే రాబోయే పది సంవత్సరాల్లో వెయ్యి లోకోల కొనుగోలు కోసం రైల్వేలు జీఈ ట్రాన్స్‌పోర్టేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. అదీకాక రైల్వేలు చాలా కాలం నుంచి నిర్వహణపరమైన నష్టాలను చవిచూస్తున్నాయి. 100 శాతం విద్యుదీకరణ కారణంగా అనేక మార్గాల్లో సగటు రవాణా వ్యయం పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించాలంటే ప్రయాణికులు, సరకు రవాణా ఛార్జీలు పెంచక తప్పదు. అన్ని మార్గాల్లో విద్యుదీకరణ చేస్తే శిలాజ ఇంధనాల వ్యయం పెరుగుతుంది. ఫలితంగా కాలుష్యమూ అధికమవుతుంది. ఈ కారణాలన్నింటికీ పరిశీలిస్తే 100 శాతం విద్యుదీకరణ రైల్వేలకు హానికరమే అని చెప్పక తప్పదు. అయితే ఇప్పుడు దీని నుండి వెనక్కి మరలడం సాధ్యం కాదు. కాబట్టి ప్రభుత్వం కొన్ని విధానాలనైనా సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందని రైల్వే రంగ నిపుణులు సూచించారు.

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి కేటీఆర్ పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని బుధవారం భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి కేటీఆర్ డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఐటీ శాఖ మాజీ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సుజయ్ కారంపూరి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన సుజయ్ తండ్రి ప్రొఫెసర్ సుభాష్ మృతదేహానికి నివాళులర్పించారు.

రుణమాఫీ జీవో 567ను సవరించాలి

● తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతులకు ప్రయోజనం జరిగేలా జీవో 567ను సవరించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. 'రేషన్‌కార్డులో ఉన్న వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి, కుటుంబంలో ఒక వ్యక్తికే రుణమాఫీ వర్తింపజేయడం వలన.. కుటుంబం నుంచి వేరుపడిన వారికి రుణమాఫీ వర్తించదు. ఆధార్‌కార్డు, పాస్‌బుక్, రేషన్ కార్డు లేని కుటుంబాలు లక్షల్లో ఉన్నాయి. పాసు పుస్తకాల కోసం ధరణిలో 12 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. రేషన్‌కార్డులకు కూడా లక్షల్లో దరఖాస్తు చేసుకున్నారు' అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్, ప్రధాన కార్యదర్శి టి.సాగర్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ రుణం తీసుకున్న సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్ (స్వయం సహాయక బృందాలు) జాయింట్ లయబిలిటీ గ్రూప్స్, రైతు మిత్ర గ్రూప్స్, కౌలుదారులకు ఇచ్చిన లోన్ ఎలిజిబిలిటీ కార్డు ఉన్న వారికి రుణమాఫీ వర్తించదని పేర్కొన్నారనీ, వాస్తవానికి ఈ నాలుగు గ్రూపుల్లోని వారు దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన నిరుపేదలని వారు వివరించారు. గతంలో కరువు, వరదల వల్ల నష్టపోయిన రైతుల రుణాలను బ్యాంకులు రీ షెడ్యూల్ చేశాయనీ, వీటికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. "గత పదేండ్లుగా బ్యాంకులు రుణాలు ఇవ్వకపోవడం వల్ల రైతులకు వడ్డీలు పెరిగాయి. అలాంటి రైతుల రుణం రెండు లక్షలకు పైగా ఉన్నది. పీఎం కిసాన్ డేటాకు రుణమాఫీని జోడించడం వల్ల చాలా మంది రైతులు రుణమాఫీ అర్హత కోల్పోతారు.

రాష్ట్రంలో 72లక్షల మంది రైతులు ఉన్నప్పటికీ బ్యాంకులు 43 లక్షల మంది రైతులకు మాత్రమే అప్పులిచ్చాయి. పీఎం కిసాన్ పథకం కింద 31 లక్షల మందికే వర్తింపజేశారు. అందువల్ల పీఎం కిసాన్ డేటాను వర్తింపజేయడం వల్ల అర్హత కలిగిన వారు రుణమాఫీ పొందలేకపోతారు. 2018 డిసెంబర్12 నుంచి 2023 సెప్టెంబర్ 12 మధ్య తీసుకున్న లోన్లను కొన్ని బ్యాంకులు జనవరి 2024 నుంచి రీ షెడ్యూల్ చేశాయి. బ్యాంకులు 'బుక్ అడ్జెస్ట్‌మెంట్' ద్వారా రైతులకు రుణాలు పెంచుకుంటూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2023 డిసెంబర్ 9 తర్వాత రీ షెడ్యూల్ చేసిన రుణాలకు లేదా బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసిన రుణాలకు రుణమాఫీని వర్తింపజేయాలి' అని తెలంగాణ రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఎంఎన్‌సీలో ఉద్యోగమంటూ మోసం

- ప్రాసెసింగ్ పేరుతో రూ.2 వేలు వసూలు
- డేటా ఎంట్రీలో మిస్టేక్ చేశావంటూ రూ.1000 పెనాల్టీ
- వివిధ కారణాలతో రూ.5,73,208 స్వాహా
- బాధితుని ఫిర్యాదుతో సైబర్ నిందితుని అరెస్ట్

నవతెలంగాణ- సిటీబ్యూరో

మల్టీ నేషనల్ కంపెనీలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసాలకు పాల్పడుతున్న నిందితుడిని సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి బుధవారం డీసీపీ కవిత వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బి.పవన్‌కళ్యాణ్ స్థానికంగా ఇంటర్‌నెట్ కేఫ్ నడిపేవాడు. ఇదే సమయంలో ఉద్యోగం కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతుండేవాడు. ఈ క్రమంలో ఆన్‌లైన్‌లో సులువుగా డబ్బులు సంపాదించొచ్చనే ప్రకటనలు చూసి సైబర్‌క్రైమ్ నేరాలతో డబ్బు సంపాదించాలని అనుకున్నాడు. 'టీక్యూఆర్ కంపెనీ' పేరుతో ఓ నకిలీ కంపెనీ ఏర్పాటు చేశాడు. మల్టీ నేషన్ కంపెనీల్లో ఉద్యోగాలు లేదా డేటా ఎంట్రీ వర్క్ ఇప్పిస్తానని, ఇంటి వద్దే డేటా ఎంట్రీ పూర్తి చేయొచ్చని ప్రకటనలు ఇచ్చాడు. వాటికోసం ఎవరైనా సంప్రదిస్తే తాను కన్సల్టెన్సీ మేనేజర్‌నంటూ పరిచయం చేసుకుని రిజిస్ట్రేషన్ పేరుతో రూ.2000 వసూలు చేసేవాడు. బాధితులకు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ లేదా డేటా ఎంట్రీ వర్క్ పంపించేవాడు. బాధితులు వర్క్ పూర్తి చేసి తిరిగి పంపిస్తే "మీరు చేసిన డేటా ఎంట్రీలో తప్పులున్నాయి" అంటూ పెనాల్టీ రూపంలో వేలల్లో డిపాజిట్ చేసుకునేవాడు. ఇలా వివిధ కారణాలతో బాధితుల నుంచి అందినకాడికి దండుకొని ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసేవాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన ఓ వ్యక్తిని టార్గెట్ చేసిన పవన్.. ఎంఎన్‌సీలో ఆన్‌లైన్ డేటా ఎంట్రీ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని నమ్మించాడు. రిజిస్ట్రేషన్ పేరుతో రూ.2000 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. డేటా ఎంట్రీ వర్క్‌ను పంపించాడు. వర్క్ పూర్తయిన తర్వాత బాధితుడు ఆ డేటాను తిరిగి పంపించాడు. అయితే, వర్క్‌లో తప్పులున్నాయని అందుకు రూ.1000 పెనాల్టీ చెల్లించాలని వసూలు చేశాడు. ఇదే తరహాలో వివిధ కారణాలు చెప్పి మొత్తం రూ.5,73,208 వరకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్.. నిందితుడిని అరెస్టు చేశారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు, డేటా ఎంట్రీ వర్క్ ఇస్తామని ఎవరైనా ప్రకటనలు ఇచ్చినా, వర్క్ పంపించినా నమ్మొద్దని డీసీపీ కవిత సూచించారు.

రామగుండం ఓసీపీ-2లో ప్రమాదం విచారకరం

- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రామగుండం ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టు-2 గనిలో పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా మట్టిపెళ్లలు కూలి ఇద్దరు కార్మికులు మృతిచెందటం విచారకరమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్షాలతో గనుల్లో నిలిచిపోయిన నీటి తోడివేసేందుకు అవసరమైన పంపులు, వాటర్ పైపులైన్ల మరమ్మతుల సందర్భంగా ఈ ఘటన జరిగినట్టు తెలిసిందని పేర్కొన్నారు. కార్మికుల భద్రత విషయంలో అలసత్వానికి తావు లేకుండా మరింత పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సింగరేణి అధికారులకు సూచించారు.

20న ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ భేటీకి మంత్రి ఉత్తమ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

జాతీయ డ్యామ్ భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) సమావేశం ఈనెల 20న ఢిల్లీలో జరగనుంది. ఈ భేటీకి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యంపై ఇప్పటికే ఎన్‌డీఎస్‌ఏ నిపుణల కమిటీ రెండు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించింది. అలాగే రిటైర్డ్ జస్టిస్ పీసీ ఘోష్ చైర్మెన్‌గా న్యాయ విచారణ సైతం జరుగుతున్నది. కాళేశ్వరం బ్యారేజీలకు వర్షాకాలం నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు చేసినప్పటికీ, మున్ముందు పరిస్థితులు ఎలా ఉంటాయనే సంగతి ఎన్‌డీఎస్‌ఏ తేల్చాల్సి ఉంది. దాదాపు రూ.లక్ష కోట్లతో నిర్మించిన ఈ ప్రాజెక్టుపై గతంలో భారీ అంచనాలు ఉన్న సంగతి తెలిసిందే. కాగా ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మరమ్మతులు చేసినా ప్రాజెక్టు మనగలు గుతుందనే నమ్మకం లేదని ఎన్‌డీఎస్‌ఏ నిపుణులు చెప్పిన విషయం తెలిసిందే. ఈనెల 20న ఢిల్లీలో జరిగే సమావేశంలో కాళేశ్వరంపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చర్చిస్తారనే ప్రచారం జలసౌధలో జరుగుతున్నది. ఈనేపథ్యంలో ప్రాజెక్టుకు చెందిన సమగ్ర వివరాలతో మంత్రి ఢిల్లీ వెళుతున్నారు.

భారత జిడిపి 7 శాతం : ఎడిబి అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత జిడిపి 7 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) అంచనా వేసింది. సాధారణం కంటే అధిక వర్షపాతం ఉండొచ్చన్న అంచనాలతో వ్యవసాయ రంగం పుంజుకోవచ్చని పేర్కొంది. ప్రభుత్వ రంగ సాయంతో పెట్టుబడులకు డిమాండ్ పెరగొచ్చని తెలిపింది. వచ్చే 2025-26లో 7.2 శాతం వృద్ధి ఉండొచ్చని పేర్కొంది. ఇటీవల అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. గత నెల ఆర్‌బిఐ కూడా తన అంచనాలను 7 నుంచి 7.2 శాతానికి చేర్చింది.

ఢిల్లీ అధికారిక నివాసంలో చంద్రబాబు ప్రత్యేక పూజలు



న్యూఢిల్లీ : ఢిల్లీలోని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక బంగ్లా (జన్‌పథ్-1)లో సిఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన కేంద్ర హోంమంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. అలాగే బడ్జెట్ కేటాయింపులపైనా విజ్ఞప్తి చేశారు. అనంతరం బుధవారం ఉదయం తొలి ఏకాదశి సందర్భంగా సిఎం అధికారిక నివాసంలో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. అంతకముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్త నిర్వహణ, అవినీతి కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని అన్నారు. 2019-24 ఆర్థిక సంవత్సరాల మధ్య రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు రాష్ట్రంలో ఎన్‌డిఎకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని ట్వీట్ చేశారు. పర్యటనలో సిఎం చంద్రబాబుతోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు. కాగా.. జన్‌పథ్ నివాసంలో చంద్రబాబును బిజెపి ఎంపి సిఎం రమేష్ కలిశారు. అనంతరం చంద్రబాబు తన పర్యటన ముగించుకుని విజయవాడకు చేరుకున్నారు.

మందుల పరిశ్రమలో పేలిన రియాక్టర్



వసంత్ కెమికల్స్‌లో చెలరేగిన మంటలు

అనకాపల్లి : పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లాలోని అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటన మరవక ముందే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ పరిధి రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారులోని వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీలో బుధవారం ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందారు. పరిశ్రమ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తోటి కార్మికులు చెప్తున్నారు.

వారి కథనం ప్రకారం... వసంత్ కెమికల్స్‌లో ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌత్ (44) హౌస్ కీపర్‌గా పని చేస్తున్నారు. ఉదయం ఆరు గంటలకు విధులకు హాజరయ్యాడు. ఉదయం 8.30 గంటల సమయంలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అయితే, యాజమాన్యం ఎవరికీ ఏమీ కాలేదని చెప్పి, చనిపోయిన ఆయనను చికిత్స కోసమంటూ అంబులెన్స్‌లో ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించి ప్రమాద తీవ్రతను తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించింది.

రూ.35 లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి అనిత

ప్రదీప్ రౌత్ కుటుంబానికి రూ.35 లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించనున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. వసంత కెమికల్స్‌లో జరిగిన ప్రమాదంపై విచారణకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఫ్యాక్టరీస్ అండ్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ విభాగ అధికారులు ప్రమాద ఘటనపై విచారణ చేపట్టి, నివేదిక అందజేయాలని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు

వసంత్ కెమికల్స్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు ప్రదీప్ రౌత్ కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. పరిశ్రమలో ప్రమాద పరిస్థితిని తెలుసుకున్న కార్మికులతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రదీప్‌రౌత్ మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆస్పత్రి మార్చురీలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. అనంతరం కార్మిక, కర్షక భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు.

యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : సిపిఎం

వసంత్ కెమికల్స్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఫార్మా సిటీలో కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతుందని, ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీల పేరుతో హడావుడి చేస్తున్నారని తెలిపారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే సుందరపు

ప్రమాద స్థలిని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో సేఫ్టీ ప్రమాణాలు మెరుగు పర్చేలా చర్యలు తీసుకుంటామని, మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

కార్పొరేట్లపై పన్ను మరింత తగ్గింపు

- వలసదారులపై వేటు : అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్
- ముగిసిన జాతీయ సదస్సు



మిల్వాకీ : .కార్పొరేట్లపై పన్ను మరింత తగ్గిస్తామని, విదేశాల నుండి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తామని, చమురు, సహజవాయువు, బొగ్గు మైనింగ్ రంగాల్లో పెట్టుబడులు పెంచుతామని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపు అభ్యర్థిగా ఎంపికైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అమెరికన్ చరిత్రలోనే అతి పెద్ద వలసవాదుల బహిష్కరణ కార్యక్రమం అమలు చేస్తామని కూడా ఆయన ప్రకటించారు.విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్వాకీలో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా తన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించిన అనంతరం ఆయన ఈ మాటలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన రిపబ్లికన్ పార్టీ జాతీయ సమ్మేళన్ మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ శారీరక, మానసిక బలహీనతలపై సెటైర్లు వేశారు.ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేరును పుతిన్ అని పేర్కొనడాన్ని ప్రస్తావించారు. ట్రంప్ కోడలు, రిపబ్లికన్ నేషనల్ కమిటీ కో చైర్ అయిన లారా ట్రంప్ గత ఎన్నికల ఫలితాలను మోసపూరితమైనవంటూ కొట్టిపారేశారు. 2021 జనవరి6న ట్రంప్ తన అనుయాయులచేత కేపిటల్ హిల్స్‌లోని పార్లమెంటు భవనంపై తిరుగుబాటుకు ఎగదోయడాన్ని రిపబ్లికన్లు సమర్థించుకునే యత్నం చేశారు.1.3 మిలియన్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్‌స్టర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీన్ ఓ బ్రియన్ ఈ సదస్సునుద్దేశించి మాట్లాడుతూ, తాను ఎవరికీ లేదా ఏ పార్టీకి అనుబంధం ఉన్న వ్యక్తిని కాదని, అయితే అమెరికాలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా బ్యాంకులు, బడా కార్పొరేట్లకు అమ్ముడుపోతున్నాయని విమర్శించారు.

వచ్చే నాలుగు రోజులు వాన

- పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే సూచన
- ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ :వాతావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ మీదుగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. అదే సమయంలో 19న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనున్నది. వీటి ప్రభావం వల్ల రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజుల పాటు పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని జిల్లాల్లో పలుచోట్ల భారీ, అక్కడక్కడా అతి భారీ వర్షాలు పడొచ్చని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనూ వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఎక్కువ ప్రాంతాల్లో తేలికపాటి, కొన్ని ప్రాంతాల్లో మోస్తరు, అక్కడక్కడా భారీ వర్షం పడే అవకాశాలున్నాయి. బుధవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 167 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది.

అతి భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలు

18.7.24 : కొమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల

19.7.24 : కొమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం

20.7.24 : జయశంకర్ భూపాలపల్లి, ములుగు

భారీ వర్ష సూచన ఉన్న జిల్లాలు



18.7.24 : హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి

19.7.24 : ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి

20.7.24 : సిద్దిపేట, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్

21.7.24 : మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్, మహబూబాబాద్, సూర్యాపేట, నిజామాబాద్, నిర్మల్

కాలికి పుండ్లయ్యాయని ఆస్పత్రికి వెళ్లి...

- పరిస్థితి విషమించి వ్యక్తి మృతి
- ఇంజక్షన్ వికటించడమే కారణమంటూ బంధువుల ఆరోపణ
- న్యాయం చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన

నవతెలంగాణ-కారేపల్లి



కాలికి పుండ్లు అయ్యాయని ఆస్పత్రికి వెళ్లిన ఓ వ్యక్తికి మూడు ఇంజక్షన్లు వేయగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఈ ఘటన ఖమ్మం జిల్లా కారేపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో బుధవారం జరిగింది. ఇంజక్షన్ వికటించడం వల్లే చనిపోయినట్టు బంధువులు ఆరోపించారు. న్యాయం చేయాలని సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి.. కారేపల్లి మండలం మాణిక్యారం చెందిన రేపాకుల లాలయ్య(55), వీరమ్మ దంపతులు వ్యవసాయం కలిసిరాక ఖమ్మం నగరంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా చేరారు. లాలయ్య కాలికి పుండ్లై మానకపోవడంతో బుధవారం కారేపల్లిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి వెళ్లాడు. పరీక్షించిన డాక్టర్ మూడు ఇంజక్షన్లు వేశారు. మొదటి ఇంజక్షన్ వేసిన తర్వాత తల తిరుగుతోందని, నరాలు గుంజుతున్నాయని, శ్వాస తీసుకోవటం కష్టంగా ఉందని చెప్పడంతో.. మరో రెండు ఇంజెక్షన్లు వేశారు. చివరకు పరిస్థితి విషమించి ఆస్పత్రిలోనే లాలయ్య మృతి చెందాడు. అయితే, వైద్యం వికటించటంతోనే చనిపోయాడని అతని బంధువులు ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు.

రేపాకుల లాలయ్య సీపీఐ(ఎం) మాణిక్యారం శాఖ సభ్యులు. అతని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) నాయకులు, మాణిక్యారం గ్రామస్తులు పెద్దఎత్తున ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడే మృతదేహాన్ని ఉంచి శాంతియుతంగా ఆందోళన చేశారు. మృతునికి భార్య వీరమ్మ, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కుమార్తె ఉంది. అనంతరం ఆస్పత్రి వైద్యుడితో చర్చలు జరిపారు. కుటుంబానికి ఆర్థికసాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కె.నరేంద్ర, నాయకులు తలారి దేవప్రకాశ్, కరపటి సీతారాములు, మోత్కూరి బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు జవ్వాజి శ్రీనివాసరావు, దారావత్ బద్దులాల్, భూక్యా వాచ్యా భూక్యా రంగారావు, బీఆర్ఎస్ నాయకులు అడపా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



నిండిన ఆల్మట్టి..

- దిగువకు కృష్ణమ్మ పరుగులు

అమరావతి : ఎగువన కృష్ణా పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మహారాష్ట్ర, కర్నాటకలోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువన వున్న ఆల్మట్టి డ్యామ్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో దిగువకు నీటిని వదులుతునాన్నరు. బుధవారం ఉదయానికి ఆల్మట్టిలోకి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదుకావడంతో అధికారులు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువన వున్న నారాయణపూర్‌లోకి వదిలారు. నారాయణపూర్ డ్యామ్ సామర్థ్యం 37 టిఎంసీలే కావడంతో అక్కడి నుండి దిగువకు జూరాల ప్రాజెక్టు వైపుకు 28,560 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు డ్యామ్ సామర్థ్యం కేవలం 9.5 టిఎంసీలే కావడంతో కృష్ణా నదిలో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువన శ్రీశైలం వైపు వదిలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో త్వరలోనే శ్రీశైలం ప్రాజెక్టు వద్దకు వరదనీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆల్మట్టి పూర్తిస్థాయి సామర్థ్యం 129 టిఎంసీలు కాగా ప్రస్తుతం 100 టిఎంసీలను రిజర్వాయర్‌లో నిలకడగా వుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. అలాగే 37 టిఎంసీల సామర్థ్యం వున్న నారాయణపూర్ డ్యామ్‌లో 30 టిఎంసీల నీటిని స్థిరంగా వుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. రాష్ట్రంలోని శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు డెడ్ స్టోరేజ్ స్థాయిలోనే వున్నాయి శ్రీశైలంలో కేవలం 33.9 టిఎంసీల నీరు మాత్రమే వుంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన వున్న ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో కృష్ణాలోకి వరద వచ్చే అవకాశం వుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో శ్రీశైలం నుండి తాగునీటి అవసరాలకోసం నాగార్జున సాగర్‌కు దాదాపు 30వేల క్యూసెక్కులను వదులుతున్నారు.

తుంగభద్రకు పోటెత్తుతున్న వరద

కర్నాటకలోని ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తుంగభద్ర డ్యాంలోకి 63,320 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 212 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 39.718 టిసిఎలు ఉన్నాయని డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. వర్షాలు కొనసాగే ఆస్కారం ఉన్నందున డ్యాంలోకి మరింత నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరేళ్ల శారద బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా బుధవారం హైదరాబాద్ బుద్ధభవన్‌లోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో నేరేళ్ల శారద బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సీతక్క, ఉత్తంకుమార్ రెడ్డి హాజరై శుభా కాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. మహిళలకు నిత్యం అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

హస్తకళల చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ గౌడ్

తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్‌గా నాయుడు సత్యనారాయణ గౌడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు సన్నిహితుడిగా పేరున్న సత్యనారాయణ పదవీ బాధ్యతలు చేపట్టడం పట్ల పలువురు కాంగ్రెస్ నేతలు, అభిమానులు అభినందనలు తెలిపారు.

రుణమాఫీకి షరతులు తగవు

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీకి ఎలాంటి షరతులు విధించవద్దని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులకు బ్యాంకు ఖాతాలుండగా, అందులో 11 లక్షల మందికి రుణమాఫీ చేస్తే మిగతా 49 లక్షల మంది రైతుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. గుర్తింపు కోసమే రేషన్ కార్డులు అయితే, అవి లేని వారిని ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. రుణమాఫీకి పాస్ బుక్కును ప్రామాణికంగా తీసుకుంటే రైతుభరోసాకు కూడా దాన్నే తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ సర్కారు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీని అమలు చేసిందని గుర్తుచేశారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాష్టీకానికి మరో 20 మంది బలి

- ఐరాస భవనంపైనా బాంబులు

గాజా సిటీ: అమెరికా అండ చూసుకుని ఇష్టానుసారంగా చెలరేగిపోతున్న నెతన్యాహు ప్రభుత్వం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో 20 మంది ప్రాణాలు తీసింది. ఐరాస భవనంపైనా బాంబులు కురిపించింది.సెంట్రల్ గాజాలోని సుసీరత్‌లో ఓ పాఠశాల భవనంలో నడుపుతున్న ఐరాస సహాయక శిబిరంపైన, దక్షిణాన ఉన్న ఖాన్ యూనిస్‌లోని మవాసి ప్రాంతంపైన ఇజ్రాయిల్ సైన్యం జరిపిన ఫాసిస్టు దాడుల్లో ప్రాణ నష్టంతో బాటు ఆస్తి నష్టం కూడా చోటు చేసుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. ఇజ్రాయిల్ తన చర్యను సమర్థించుకోవడానికి అక్కడ హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని ఎప్పటిలాగే చెప్పింది.ఐరాస సహాయక శిబిరంపై దాడిలో చనిపోయినవారిలో అయిదుగురు పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. మరో డజను మంది దాకా పాలస్తీనా పౌరులు గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ నిర్వాసితుల కోసం సుసిరత్‌లో ఐక్యరాజ్యసమితి ఈ సహాయక శిబిరం నడుపుతోంది. ఇజ్రాయిల్ దాడి పదవ నెలలోకి ప్రవేశించింది. ఇంతవరకు 38 వేల మందికిపైగా పాలస్తీనీయుల ప్రాణాలను ఇజ్రాయిల్ హరించిందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.